జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# పాపం – పుణ్యం




Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# పాపం – పుణ్యం

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్
తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు** : అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 79 3500 2100

© Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** + 91 79 3500 2100

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**First Edition** : November 2024 (500 Copies)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**Price** : Rs. 70

**ముద్రిక** : అంబా మల్టి ప్రింటింగ్
B–99, ఈలెక్ట్రానిక్స్ GIDC
క–6, రోడ్డు సెక్టర్–25
గాంధీనగర్ – 382044
గుజరాత్, India
**ఫోన్:** +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-93-91375-73-7

**Printed in India**

# త్రిమంత్రం

(సర్వ విఘ్న నివారణ చేసే మంత్రం)







నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం

నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వపావప్పణాసణో

మంగలాణం చ సవ్వేసిం,

పడమం హవయి మంగలం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# జ్ఞాని పురుషుని యొక్క పరిచయం

అది 1958వ సంవత్సరం జూన్ నెలలో ఒకనాటి సాయంత్రం సుమారు ఆరు గంటల సమయం, పశ్చిమ భారత దేశంలోని దక్షిణ గుజరాత్‌లోని ఒక పట్టణమైన సూరత్ రైల్వే స్టేషను. అంబాలాల్ మూల్‌జీ భాయ్ పటేల్ నామధేయుడు, వృత్తిరీత్యా కాంట్రాక్టరూ అయిన ఒక గృహస్థుడు జన సమూహంతో రద్దీగా వున్న సూరత్ స్టేషన్‌లోని మూడవ నెంబరు ప్లాట్‌ఫాం బెంచిపైన కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో నలభైఎనిమిది నిమిషాలపాటు ఒక అద్భుతం జరిగింది. అకస్మాత్తుగా అంబాలాల్ మూల్‌జీభాయ్ పటేల్‌లోని ఆత్మ సాక్షాత్కారమైంది. ఆ సమయంలో అతని అహంకారం సమూలంగా దగ్ధమైపోయింది. ఆ క్షణం నుంచి అతను అంబాలాల్ యొక్క ఆలోచనలు, వాక్కు మరియు క్రియలన్నింటి నుంచి పూర్తిగా వేరుచేయబడి, జ్ఞానమార్గం ద్వారా మానవాళికి ముక్తిని ప్రసాదించే నిమిత్తం భగవంతుని చేతిలో సజీవ పరికరంగా మారారు. ఆయన తనకు ప్రకటితమైన పరమాత్మని దాదాభగవాన్ అని పిలిచారు. “ఈ పరమాత్మ, దాదాభగవాన్ నాలో పూర్ణరూపంలో వ్యక్తమైనాడు; మీలో అవ్యక్తంగా ఉన్నాడు. భేదం ఇంతమాత్రమే. ఆయన జీవులందరిలోను విరాజమానుడై ఉన్నాడు” అని తనను కల్సిన ప్రతి ఒక్కరితోనూ చెప్పేవారు.

మనం ఎవరము? భగవంతుడంటే ఏమిటి? జగత్తును ఎవరు నడిపిస్తున్నారు? కర్మ ఏమిటి? మోక్షం ఏమిటి? ఇత్యాది సమస్త ఆధ్యాత్మిక ప్రశ్నలకు ఆ సందర్భంలో సమాధానం లభించింది. ప్రకృతి శ్రీ అంబాలాల్ మూల్‌జీ భాయ్ పటేల్ ద్వారా ప్రపంచానికి సంపూర్ణ తత్త్వరహస్యాన్ని వెల్లడిచేసింది.

శ్రీ అంబాలాల్ జన్మస్థలం బరోడా పట్టణ సమీపంలోని తరసాలి; పెరిగింది గుజరాత్‌లోని బాదరణ్ గ్రామం. ఆయన ధర్మపత్ని హీరాబా. వృత్తిరీత్యా కాంట్రాక్టరు అయినప్పటికీ ఆత్మసాక్షాత్కారం పొందటానికి ముందు కూడా అతని వ్యావహారిక జీవనం ఇంట్లోను, చుట్టు ప్రక్కలవారితోను కూడా ఎంతో ఆదర్శప్రాయంగా ఉండేది. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత జ్ఞానిగా ఆయన జీవితం ప్రజలకే అంకితమైంది.

వ్యాపారంలో ధర్మం ఉండాలి, ధర్మంలో వ్యాపారం ఉండకూడదు అనే నియమాన్ని ఆయన జీవితమంతా అమలుపరచారు. భక్తులచే దాదాశ్రీగా పిలువబడే ఆయన ఎన్నడూ ఎవరినుంచీ స్వంత ఖర్చుల నిమిత్తం ధనాన్ని స్వీకరించలేదు. పైగా తనకు వ్యాపారంలో లభించిన లాభాలను, భక్తులను భారతదేశంలోని వివిధ యాత్రా స్థలాలకు తీసికొనివెళ్లటానికి వినియోగించేవారు.

దాదాజీ మాటలు అక్రమవిజ్ఞాన్‌గా పిలువబడే కొత్త, డైరెక్ట్ మరియు మెట్లదారికాని లిఫ్ట్ మార్గమైన ఆత్మానుభూతి మార్గానికి పునాది అయ్యాయి. అతడు తన దివ్య ప్రాచీన ప్రయోగం (జ్ఞాన విధి) ద్వారా కేవలం రెండు గంటలలో ఈ జ్ఞానాన్ని ఇతరులకు అందచేశారు. ఇప్పటికీ వేలకొలది ముముక్షువులు పొందుతూనే ఉన్నారు. అక్రమమార్గం అంటే మెట్లు లేనిది, లిఫ్ట్‌మార్గం లేక షార్ట్‌కట్ మార్గం. క్రమ మార్గం అనగా మెట్టుతర్వాత మెట్టుక్రమంగా ఎక్కే ఆధ్యాత్మిక మార్గం. ఇపుడు అక్రమమార్గం ఆత్మానుభూతి నిమిత్తం డైరెక్ట్, షార్ట్‌కట్ మార్గంగా గుర్తింపబడింది.

## దాదా భగవాన్ ఎవరు?

దాదా భగవాన్ ఎవరు? అనే విషయాన్ని వివరిస్తూ ఆయన ఇలా అన్నారు :

"మీకు కన్పించేది 'దాదాభగవాన్' కాదు. మీరు చూస్తున్నది ఎ.ఎమ్. పటేల్‌ని. జ్ఞానిపురుషుడనైనా నాలోపల పూర్ణరూపంలో వ్యక్తమైన భగవంతుడు 'దాదాభగవాన్'. ఆయన చతుర్దశ భువనాలకు ప్రభువు. ఆ దాదాభగవాన్ మీలోను, ప్రతి ఒక్కరిలోను కూడా ఉన్నారు. మీలో అవ్యక్తరూపంలో ఉంటే, ఇక్కడ (ఎ.ఎమ్. పటేల్ దేహంలో) సంపూర్ణంగా అభివ్యక్తమైనాడు. నేను దాదా భగవాన్ కాదు. నాలోపలి దాదాభగవాన్‌కి నేను కూడా నమస్కరిస్తాను.

# అనువాదకుని విజ్ఞప్తి

అంబాలాల్ ఎమ్. పటేల్ నామధేయులైన జ్ఞానిపురుషుని దాదాశ్రీ లేక దాదాశ్రీ గా భక్తులందరూ పిలుస్తారు. ఆత్మ విజ్ఞాన సంబంధమైన మరియు ప్రపంచ వ్యవహార జ్ఞాన సంబంధమైన తన సత్సంగాన్ని యధాతధంగా అనువదించటం సాధ్యం కాదని ఆయన తరచూ చెప్పేవారు. అనువాద క్రమంలో లోతైన, సహేతుకమైన అర్ధం ముముక్షువులకు అందకపోవచ్చు అనికూడా దాదాశ్రీ చెప్పేవారు. గుజరాతీ భాషని నేర్చుకోవటంలోని ప్రాముఖ్యతను ఆయన నొక్కి వక్కాణించేవారు. తద్వారానే దాదాశ్రీ అమూల్యమైన బోధల సంపూర్ణసారాన్ని యధాతధంగా గ్రహించే అవకాశం ఉంటుందని దాదా మాటల సారాంశం.

అయినప్పటికీ దాదాశ్రీ తన బోధలను ఇంగ్లీషు మరియు ఇతర భాషలలోకి అరువదించటానికి, తద్వారా ప్రపంచంలోని మానవాళి పొంది తమ బాధలనుంచి విముక్తి పొందాలని, జీవన్ముక్తిని అనుభవించాలని దాదాజీ యొక్క ప్రగాఢమైన వాంఛ. ఈ విజ్ఞానం కూడా దాదాజీ చెప్పారు.

జ్ఞానిపురుషులైన దాదాజీ బోధలను తెలుగుభాష ద్వారా తెలుగు ప్రజలకు అందించటం కోసం చేసిన చిన్న ప్రయత్న ఫలమే ఈ పుస్తకం యొక్క అనువాదం. యధాతధంగా అందించలేకపోయినా సత్సంగ సందేశాన్ని, భావాన్ని ఎటువంటి చెఱుపు లేకుండా అందించడంకోసం ఎంతో శ్రద్ధ వహించటం జరిగింది.

అనంతమైన దాదాజీ జ్ఞాన ఖజానాకి ఇది ప్రాధమిక పరిచయం మాత్రమే. ఈ అనువాదంలో ఏమైన తప్పులు దొర్లివుంటే అవి పూర్తిగా అనువాదకులవే అని గమనించగలరు. వాటినిమిత్తమై మేము మీ క్షమను అర్ధిస్తున్నాము.

# జ్ఞాన (ఆత్మజ్ఞాన) ప్రాప్తికై వర్తమానలింక్

"నేను స్వయంగా సిద్ధులను (ప్రత్యేక ఆధ్యాత్మిక శక్తులను) కొద్దిమందికి ప్రసాదించబోతున్నాను. నేను వెళ్లిపోయిన తర్వాత వాటి అవసరం ఉండదా? భవిష్యతరాల ప్రజలకు ఈ మార్గం యొక్క అవసరం ఉంటుంది, అవునా?"

**–దాదా శ్రీ**

పరమపూజ్య దాదాశ్రీ గ్రామ గ్రామమూ, దేశవిదేశాలు పర్యటించి ముముక్షువులకు సత్సంగంతోపాటు ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించారు. దానితోపాటు సంఘీభావంతో కూడిన ప్రాపంచిక వ్యవహార జ్ఞానాన్ని కూడా తనను కల్సిన వారందరికీ అందించారు. ఆయన తన అవసానదశలో, 1987 చివర్లో తన కార్యాన్ని కొనసాగించే నిమిత్తం డాక్టరు నీరుబెన్ అమీన్‌కి సిద్దులను అనుగ్రహించారు.

పరమపూజ్య దాదాశ్రీ జనవరి 2, 1988న దేహత్యాగం చేసిన తర్వాత డా॥ నీరుబేన్ భారతదేశ గ్రామాలలోనూ, పట్టణాలలోనూ, ప్రపంచంలోని అన్ని ఇతర దేశాలలోనూ పర్యటిస్తూ దాదాశ్రీ కార్యాన్ని కొనసాగించారు. మార్చి 19, 2006న దేహత్యాగం చేసేవరకు ఆమె అక్రమవిజ్ఞాన్‌కి దాదాశ్రీ ప్రతినిధిగా వున్నారు. దేహ త్యాగానికిముందు ఆమె కార్యభారాన్ని శ్రీ దీపక్ భాయ్ దేశాయ్‌కి అప్పగించారు. ఆధునిక కాలంలో ఆత్మానుభూతికి సరళమూ మరియు డైరెక్ట్ మార్గంద్వారా అక్రమ విజ్ఞానాన్ని వ్యాపింపచేయటంలో డా. నీరుబెన్ సాధనం ఆయి ప్రముఖ పాత్రను పోషించారు. లక్షల కొలది ముముక్షువులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. వారు తమ సంసార బాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా స్వేచ్ఛను, శాంతిని, ఆత్మరమణత యొక్క అనుభూతిని పొందుతున్నారు.

# సంపాదకీయం

మన భారత దేశంలో, చిన్న పిల్లలు ఇంకా తప్పటడుగులు వేసే దశలో ఉన్నప్పటి నుంచే పుణ్యం, పాపం గురించిన అవగాహన వారికి కలిగిస్తారు. చిన్నపిల్లలు ఏ ప్రాణినైనా చంపుతుంటే, వాళ్ళ అమ్మ వాళ్ళ చేతి మీద వెంటనే ఒక్కటేసి కోపంగా, 'చంప గూడదు. పాపం తగుల్తుంది' అంటుంది. పసిప్రాయం నుంచే పిల్లలకు, 'తప్పు చేస్తే పాపం తగుల్తుంది. అలా చెయ్యవద్దు' అనేది వినవస్తుంటుంది. చాలసార్లు మనుషులకు దుఖం కలిగి ఏడవటం మొదలు పెడతారు. 'ఏ జన్మలో పాపమో ఇది, అనుభవిస్తున్నాను' అనుకుంటారు. మంచి జరిగితే అతన్ని 'పుణ్యశాలి' అంటారు. ఇలా మన వ్యవహారాలలో పాపం, పుణ్యం అనే పదాలను ఉపయోగిస్తుంటాం.

భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతా పాప పుణ్యాలను నమ్ముతారు. దాన్నుంచి ఎలా విముక్తి చెందాలన్నది కూడా చెప్పబడివుంది.

అయితే, పుణ్యం పాపం అనేదానికి నిజమైన అర్థమేమిటి? నిజంగా ఏమి అర్థమౌతుంది? పూర్వ జన్మ, ప్రస్తుత జన్మ, రాబోయే జన్మలతో పాపపుణ్యాల సంబంధమేమిటి? జీవితంలోని వ్యవహారాలలో పాపపుణ్యాల ఫలితాలను ఏ విధంగా అనుభవించవలసి వస్తుంది? పుణ్యం, పాపం ఏ ప్రకారంగా వస్తాయి? అక్కడి నుండి రకమని మోక్షమార్గంలోకి పోవటానికి పాపపుణ్యాలు ఏవిధంగా ఉపయోగపడతాయి? మోక్ష ప్రాప్తి కోసం పాపపుణ్యాలు రెండూ అవసరమేనా, లేకపోతే రెండిటి నుండీ విముక్తి చెందవలసివుంటుందా?

పాప పుణ్యాల గురించి ఇన్ని మాటలు వింటాము కదా, వాటిలో నిజమెంత? దానికి సమాధానం ఎక్కడి నుండి లభిస్తుంది? పాపపుణ్యాల నిజమైన అర్థం తెలియకపోవటం వలన ఎన్నో చిక్కులు ఏర్పడుతాయి. పాపపుణ్యాల నిర్వచనం ఎక్కడా క్లియర్‌కట్, షార్ట్‌కట్‌లలో (స్పష్టంగా, సంక్షిప్తంగా) లభించదు. అందువలన, పుణ్యం, పాపం గురించి చెప్పే వివిధ రకాల నిర్వచనాలు మానవుని సందిగ్ధంలో పడేస్తుంటాయి. చివరకు, పుణ్యం సంపాదించటం, పాపం జరగకుండా ఉండటం జరగదు.

పరమ పూజ్య దాదాశ్రీ, ఈ నిర్వచనాలను ఎంతో సరళంగా, నేరుగా, అందంగా ఇచ్చారు, 'ఇతరులకు సౌఖ్యాన్నిచ్చేది పుణ్యం ఇస్తుంది, ఇతరులకు దుఃఖాన్ని కలిగించేది పాపాన్ని ఇస్తుంది' అని. ఈ మాత్రం జాగృతిని రోజంతా ఉంచుకున్నట్లయితే, అందులో ధర్మం పూర్తిగా ఉంటుంది, అధర్మం లేకుండా ఉంటుంది.

పొరపాటున కూడా ఎవరికైనా దుఃఖం కలిగించినట్లయితే, అందుకు వెంటనే ప్రతిక్రమణ చేయాలి. ప్రతిక్రమణ అంటే, ఎవరికైతే నోటి ద్వారా కాని, ప్రవర్తన ద్వారా కాని లేక మానసికంగా బాధించినట్లయితే, వెంటనే అతనిలో స్థితమైవున్న ఆత్మను, శుద్ధాత్మను క్షమాపణ కోరాలి, హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడాలి. తిరిగి మరెన్నడూ అలా చేయనని ధృఢ నిశ్చయం చేసుకోవాలి. అంతే. అది చాలు. అది కూడా మనసులో, హృదయపూర్వకంగా అనుకుంటే అది కూడా ఎగ్జాక్ట్ (అటువంటి) ఫలితమే వస్తుంది.

పరమపూజ్య దాదాజీ, 'జీవితం పుణ్యం పాపాల పరిపక్వతనుబట్టి నడుస్తుంది. వేరే నడిపించేవాళ్ళంటూ ఎవరూ లేరు. అలాంటప్పుడు ఎవరిని తప్పుపట్టాలి, ఎవరిని వెన్నుతట్టాలి? అందువలన పాపం పండితే, ఆ సమయంలో ఎక్కువగా ప్రయత్నమేమీ చెయ్యకుండా ప్రశాంతంగా ఉండాలి, ఆత్మలో ఉండాలి. ఒకవేళ పుణ్యం ఫలితాన్నివ్వటానికి సిద్ధమైనపుడు ఇక వందలాది ప్రయత్నాలు ఎందుకు చెయ్యటం? ఒకవేళ పుణ్యం ఫలితాన్నివ్వటానికి సిద్ధంగా లేనపుడు ఇక వందలాది ప్రయత్నాలు ఎందుకు చెయ్యటం? అందువలన నువ్వు ధర్మకార్యంలో ఉండు' అని చెప్పారు.

పుణ్యం, పాపం అనే సాధారణ ప్రశ్నల నుంచి సూక్ష్మాతిసూక్ష్మమైన ప్రశ్నలకు కూడా అంతే సరళమైన, సంక్షిప్తమైన ప్రభావవంతమైన సమాధానం లభించే జవాబులు ఇక్కడ, పరమ పూజ్య దాదాజీ దేశీయ శైలిలో లభిస్తాయి. మోక్ష ప్రాప్తి కోసం పుణ్యం అవసరమా? ఒకవేళ అవసరమైతే ఎలాంటి, ఏ విధమైన పుణ్యం అవసరం పడుతుంది?

పుణ్యమయితే అవసరమే కాని, అది పుణ్యానుబంధీ పుణ్యమైయ్యుండాలి. అంతేకాదు, మోక్ష ఆశయంతోనే పుణ్యం లభించాలి. ఆ పుణ్య ఫలం, మోక్ష ప్రాప్తికి

అవసరమైన అన్ని సాధనాలు, అంతిమ సాధనం కూడా ఆత్మజ్ఞానికి  చేకూర్చే దైయ్యుండాలి. అంతేకాదు, మోక్షం కోసమే పుణ్యానుబంధీ పుణ్యం సంప్రాప్తించి నట్లయితే దానితో పాటు ఉండవలసినవి– 1) క్రోధం, మానం, మాయ, లోభాలు తగ్గి, కషాయం తగ్గిపోయి ఉండాలి, 2) తన దగ్గరున్నవి ఇతరుల సౌఖ్యం కోసం ఇచ్చేయాలి, 3) ఏ కార్యం నుంచైనా ప్రతిఫలాపేక్ష లేకుండా ఉండాలి. అప్పుడు ఆ పుణ్యం మోక్షానికి వెళ్ళటానికి సహాయపడుతుంది. లేకపోతే ఇతర పుణ్యఫలాలు కేవలం భౌతిక సుఖాలనిచ్చి, మంచుముక్కలా కరిగిపోతుంది.

అటువంటి పాపపుణ్యాల గురించిన సత్యాలు జ్ఞానిపురుష్ నుంచే సత్సంగంలో ప్రశ్నోత్తరాల ద్వారా వెలివడుతాయి. అటువంటి వాటి సంకలనాన్ని  ఇక్కడ ఇవ్వటం జరిగింది.

జై సచ్చిదానంద

**–డా.నీరు బెహన్ అమీన్**

దాదా భగవాన్ నిర్వచించిన

# పాపం-పుణ్యం

## పాపపుణ్యాల గురించిన ఇలాంటి నిర్వచనం ఎక్కడా లభించదు

**ప్రశ్నకర్త :** పాపం, పుణ్యం అనేవి ఏమిటి?

**దాదాశ్రీ :** పాపం, పుణ్యం అనేవాటి అర్థమేమిటి? ఏం చేస్తే పుణ్యం ఔతుంది? పాపపుణ్యాల ఉత్పాదన ఎక్కడి నుండి కలుగుతుంది? అని అడిగితే, 'ఈ జగత్తు ఎలా ఉందో అలా నడవనీయలేదు మనుషులు. అందుకే ఏది మంచిదనిపిస్తే అది చేసేస్తుంటారు. అంటే, ఏదైనా జీవిని చంపటం, దేనికైనా బాధ కలిగించటం, దేనికైనా వేదన కలిగించటం చేస్తారు.' అని చెప్తాను.

ఏ జీవికైనా ఎటువంటి వేదన కలిగించినా లేక బాధ కలిగించినా, దానివలన పాపం చుట్టుకుంటుంది. ఎందుకంటే గాడ్ ఈజ్ ఇన్ ఎవిరీ క్రీచర్ వెదర్ విజిబుల్ ఆర్ అన్‌విజిబుల్ (కంటికి కనిపించినా కనిపించకుండా ఉండే జీవి అయినా వాటిలో భగవంతుడుంటాడు). ఈ జగత్తులోని మనుషుల ఇతర జీవులన్నీ భగవంతుని స్వరూపాలే. ఈ చెట్టు ఉంది కదా అందులో కూడా జీవం ఉంది. ఇప్పుడు మనుషులు అది ఒప్పుకుంటున్నారు కాని, వాస్తవానికి వారికి అందులో శ్రద్ధ లేదు. అందువలనే చెట్లని నరికేస్తారు. వాటిని ఒట్టిగానే నరికేస్తుంటారు. అలా చాల పెద్ద నష్టం చేస్తారు.

ఏ జీవికైనా నష్టం కలిగిస్తే పాపం చుట్టుకుంటుంది. అలాగే, ఏ జీవికైనా సౌఖ్యాన్ని కలిగిస్తే పుణ్యం వస్తుంది. మీరు తోటలో నీళ్ళు పోస్తుంటే ఆ ప్రాణులకు సౌఖ్యంగా ఉంటుందా లేక బాధగా ఉంటుందా? మీరిచ్చే సౌఖ్యం వలన పుణ్యం వస్తుంది. ఈమాత్రం తెలుసుకుంటే చాలు.

జగత్తులోని ధర్మానికి సారం ఏమిటన్నది అందరికీ ఒక్క ముక్కలో చెప్పాలంటే, మీకు సుఖం ప్రాప్తించాలంటే ఇతర జీవులకు సౌఖ్యాన్నివ్వండి, దుఃఖం కావాలంటే దుఃఖాన్ని కలిగించండి. ఏది అనుకూలంగా ఉంటే అది చెయ్యవచ్చు. ఇదే పుణ్యం, పాపం అంటే. సౌఖ్యం కావాలంటే సౌఖ్యానివ్వు, దానివలన క్రెడిట్ జమ అవుతుంది. దుఖం కావాలంటే దుఖాన్నివ్వు. దానివలన డెబిట్ జమ అవుతుంది. దాని ఫలితాన్ని మీరు చవిచూడక తప్పదు.

## పాప పుణ్యాల ఆధారంగా మంచి-చెడు

అప్పుడప్పుడు అనుకూలమైన సందర్భాలు ఏర్పడుతాయా?

**ప్రశ్నకర్త :** మంచివి కూడా ఉంటాయి.

**దాదాశ్రీ :** అనుకూల ప్రతికూలమైన సందర్భాలను ఎవరు కలుగజేస్తున్నారు? మీ పుణ్యపాపాల ఆధారంగానే ఆ సంయోగాలు ఏర్పడుతాయి. అసలేమిటంటే, ఈ ప్రపంచాన్ని నడిపించేవారెవరూ లేరు. అలా నడిపించేవారే ఉండివుంటే, పాపపుణ్యాల అవసరమే ఉండేది కాదు.

**ప్రశ్నకర్త:** ఈ ప్రపంచాన్ని నడిపించేది ఎవరు?

**దాదాశ్రీ:** పాపపుణ్యాల పరిణామం! పుణ్యం పాపాల పరిణామంతోనే ఈ ప్రపంచం నడుస్తోంది. ఏ భగవంతుడూ నడిపించడు. ఎవరూ అందులో చెయ్యిపెట్టరు.

## పుణ్యం సంపాదించేందుకు మెట్లు

**ప్రశ్నకర్త:** పుణ్యమనేది ఎన్నో రకాలుగా ఉంటుంది కదా, మరి ఏయే కార్యాలను పుణ్యాలంటారు, వేటిని పాపాలంటారు?

**దాదాశ్రీ:** జీవులకు సౌఖ్యాన్ని కలిగించండి. అందులో ఫస్ట్ ప్రిఫరెన్స్ (మొదటి ప్రాధాన్యత) మనుషులు. మనుషుల తర్వాత ప్రిఫరెన్స్ పంచేంద్రియ జీవులు. మూడవ ప్రఫరెన్స్ నాలుగు ఇంద్రియాలు, మూడు ఇంద్రియాలు, రెండు ఇంద్రియాలు, ఒక ఇంద్రియం ఆ క్రమంలో వాటికి సౌఖ్యాన్ని కలిగించినా, అది కూడా పుణ్యమే అవుతుంది. వాటికి బాధ కలిగిస్తే అది పాపమౌతుంది.

**ప్రశ్నకర్త:** భౌతిక సుఖాలను పొందేవారు ఏ కర్మలను ఆచరించటం వలన వారికి అవి లభిస్తాయి?

**దాదాశ్రీ:** ఎవరైనా బాధల్లో ఉంటే వాటిని తీర్చినట్లయితే పుణ్యం లభిస్తుంది, దాని పరిణామ స్వరూపం, అదే సౌఖ్యం మనకీ లభిస్తుంది. ఎవరికైనా బాధ కలిగిస్తే మీకూ బాధ కలుగుతుంది. మీకు ఇష్టమైనదాన్ని ఇవ్వండి.

పుణ్యం రెండు రకాలు. ఒకటి భౌతిక సుఖాన్నిస్తుంది. రెండవది మనకి 'నిజమైన స్వేచ్ఛ' ప్రాప్తించేటట్టుగా చేసేది.

## ఆ రెండిటినీ కర్మలుగానే తీసుకుంటాం

**ప్రశ్నకర్త:** పాపం, కర్మ, ఒకటేనా లేక వేరు వేరా?

**దాదాశ్రీ:** పుణ్యం, పాపం, రెండూ కర్మలే అవుతాయి. కానీ పుణ్య కార్యాలు బాధించవు. పాప కర్మలు మన ధారణను అనుసరించి జరగనివ్వదు, మనలను బాధిస్తాయి.

'నేను చందూలాల్‌ని' అని నమ్ముతున్నంత కాలం, కర్మ బంధం ఉంటూనే వుంటుంది. కర్మ బంధం రెండు రకాలు. పుణ్యంతో సద్భావ కర్మ, పాపంతో దుర్భావ కర్మబంధాలు ఏర్పడుతాయి. హక్కు, అణ్‌హక్ (హక్కు లేకపోవటం) ల మధ్య తేడా

తెలియనంత వరకు, మనుషులు ఎలా చేస్తున్నారో చూసి తాను కూడా అలాగే వాళ్ళ దగ్గర నేర్చుకుంటూ వుంటాడు. మనసులో వేరుగా ఉంటుంది, మాటల్లో వేరొకటి, ఆచరణలో మరొకటి ఉంటాయి. అంటే శుద్ధమైన పాప బంధమే ఏర్పడుతుంది. అందువలన ఈ కాలంలో మనుషులు కేవలం పాపాన్నే సంపాదిస్తున్నారు.

## పుణ్యం-పాపం, ఆ వ్యవహార ధర్మం

**ప్రశ్నకర్త:** అయితే, పుణ్యం, ధర్మం వీటి మధ్య తేడా ఏమిటి?

**దాదాశ్రీ:** పుణ్యం ఒక వ్యవహార ధర్మం. నిజమైన ధర్మం కాదు. వ్యవహార ధర్మమంటే, తన సుఖం కోసం తాను చేసే వ్యవహారం. పుణ్యం అంటే క్రెడిట్. దాని వలన మనం సుఖంగా జీవిస్తాం. క్రెడిట్ ఉంటే మనం ప్రశాంతంగా ఉండవచ్చు. అప్పుడు ధర్మాచరణ బాగా జరుగుతుంది. పాపం అంటే డెబిట్. పుణ్యంలేదు, క్రెడిట్ లేదు అంటే, మనం ధర్మాచరణ ఎలా చెయ్యగలుగుతాం? క్రెడిట్ ఉంటే ఒక పక్క శాంతి ఉంటుంది కనుక మనం ధర్మాన్ని పాటించగలుగుతాం.

**ప్రశ్నకర్త:** ఎటువంటి కర్మల వలన పుణ్యం వస్తుంది, ఎటువంటి కర్మల వలన ధర్మపాలన జరుగుతుంది?

**దాదాశ్రీ:** ఈ జీవులన్నీ, మనుషులు, చెట్లుచేమలు, ఆవులు గేదెలు, పశుపక్ష్యాదులు, జలచరాలు అన్నీ సుఖాన్ని వెతుక్కుంటూవుంటాయి. దుఃఖించటం ఎవరికీ ఇష్టం ఉండదు. అందువలన మీకున్న సుఖాలలో కొంత ఇతరులకు ఇస్తే, మీ ఖాతాలో క్రెడిట్ అవుతుంది. పుణ్యం వస్తుంది. అదే ఇతరులకు బాధ కలిగిస్తే పాపం చుట్టుకుంటుంది.

**ప్రశ్నకర్త:** అయితే, ధర్మం అని దేన్ని అంటారు?

**దాదాశ్రీ:** ధర్మం అంటే ఆత్మ ధర్మం. ఆత్మకు తనదైన ధర్మం. పాపం, పుణ్యం రెండూ అహంకారానికి ఉన్న ధర్మం. అహంకారం ఉన్నంత వరకు పాపం పుణ్యం రెండూ ఉంటాయి. అహంకారం తొలగిపోతే పాపం పుణ్యం పోతాయి, అప్పుడు ఆత్మ ధర్మం ఔతుంది. ఆత్మని తెలుసుకోవాలి. అప్పుడే ఆత్మధర్మం అవుతుంది.

# పుణ్యం, పాపాలకు ఆవల, రియల్ ధర్మం

రిలేటివ్ ధర్మం ఏం చెప్తుంది? మంచి చెయ్యి, చెడు చెయ్యకు. మంచి చేస్తే పుణ్యం వస్తుంది, చెడు చేస్తే పాపం చుట్టుకుంటుంది.

జీవిత బైఖాతా కేవలం పుణ్యంతోనే నిండిపోయివుండదు. ఎవరినైనా తిట్టినట్లయితే ఐదు రూపాయల ఋణం పడుతుంది, ధర్మకార్యం వలన వంద రూపాయలు జమ అవుతాయి. పాప పుణ్యాలను కూడటం తీసివేయటం జరగదు. అలా జరిగితే కోటీశ్వరుడు పాపాన్ని పోగే అవనివ్వడు. డబ్బు ఖర్చుపెట్టి, అప్పులన్నీ తీర్చేస్తాడు. కానీ ఇది నిజమైన న్యాయం. ఇందులో ఎవరికి ఎప్పుడు ఏది రాసిపెట్టుంటే అప్పుడు దాన్ని అనుభవించవలసివుంటుంది. పుణ్యం పైకి రావటం వలన సుఖం కలుగుతుంది, పాపం బయటపడ్డప్పుడు చేదు అనుభవం కలుగుతుంది. ఫలితాన్నయితే రెండిటిదీ అనుభవించవలసిందే.

నీకు ఏ ఫలితాన్ని చవిచూడలని ఉంటే, ఆ విత్తనాన్ని నాటాలి అని భగవాన్ అంటారు. సుఖం కోరుకుంటే పుణ్యానిది, దుఃఖం కోరుకుంటే పాపానికి చెందిన విత్తనాన్ని నాటాలి. కాకపోతే రెండూ రిలేటివ్ ధర్మాలే కాని రియల్ కావు.

రియల్ ధర్మంలో, ఆత్మ ధర్మంలో అయితే పుణ్యం, పాపం రెండిటి నుంచీ విముక్తులవాలి. రిలేటివ్ ధర్మం వలన భౌతిక సుఖాలు సంప్రాప్తించటం, మోక్షం వైపు ప్రయాణం సాగించటం జరుగుతుంది. అదే రియల్ ధర్మమైతే మోక్షం లభిస్తుంది. ఇక్కడ నా దగ్గర ఉన్నది రియల్ ధర్మం. దీనితో నేరుగా మోక్షప్రాప్తే జరుగుతుంది. మోక్ష సుఖం ఇక్కడే లభిస్తుంది. ఇక్కడ ఆధి, వ్యాధి, ఉపాధి (బాహ్యం నుంచి, బయటి నుంచి వచ్చి పడే దుఃఖం) నుండి విముక్తి లభిస్తుంది, నిరంతర సమాధి ప్రాప్తిస్తుంది. నిరాకులత ఉత్పన్నమౌతుంది. ఇక్కడ ఆత్మ పరమాత్మలకు చెందిన మాటలే ఉంటాయి.

## పరమాణు ఫలస్వరూపం సుఖదుఃఖాల రూపంలో

**ప్రశ్నకర్త:** పాప పుణ్యాలనే విభజన ఎవరు చేసారు?

**దాదాశ్రీ:** ఎవరూ చెయ్యలేదు.

**ప్రశ్నకర్త:** ఇది పాపం, ఇది పుణ్యమని బుద్ధి చెప్తుంది. ఆత్మకి పాప పుణ్యాలంటూ ఏమీ లేవు కదా?

**దాదాశ్రీ:** లేదు ఆత్మకి లేదు. ఎదుటివారికి బాధ కలిగించే మాటలు మనం మాట్లాడితే ఆ వాక్కే పరమాణువులను దగ్గరకు లాక్కుంటుంది. ఆ పరమాణువులకు దుఃఖమనే రంగు అంటుకుంటుంది. ఆ పరమాణువులు తిరిగి ఫలితాన్నిచ్చినపుడు, అవి ఇచ్చేది దుఃఖమే అవుతుంది. మధ్యలో మరే కల్తీ ఉండదు.

## దాని బాధ్యత ఎవరిది?

**ప్రశ్నకర్త:** ఒక వ్యక్తి ధనికుడు, ఒక వ్యక్తి బీదవాడు ఇది ఎలా వస్తుంది? అందరూ మనిషి జన్మే కదా ఎత్తారు అయినా?

**దాదాశ్రీ:** అదేమిటంటే, ఈ జన్మ ఏదైతే ఉందో అది ఎఫెక్ట్. ఎఫెక్ట్ అంటే, పూర్వ జన్మలో కాజెస్ వేసారు కదా దాని ఫలితమే. అందువలన, ఎంత పుణ్యం ఉంటే, దాని వలన ఏమేం జరుగుతాయి? అని అడిగితే, అందులో అన్నీ అనుకూలమైన పరిస్థితులే ఎదురౌతాయి, అప్పుడు అంతా మంచే జరుగుతుంది. బంగళా కట్టుకోవాలనుకుంటే బంగళా తయారౌతుంది, మోటారు కారు వస్తుంది. అయితే పాపం తీసుకునివచ్చే ప్రతికూల సందర్భాల వలన ఆ బంగళా వేలం వేయబడుతుంది. అందుకే అంతా మన కర్మ ఫలితమే. ఇందులో భగవంతుని ప్రమేయమేదీ ఉండదు. యు ఆర్ హోల్ అండ్ సోల్ రెస్పాన్సిబుల్ ఫర్ యువర్ లైఫ్. ఒక్క లైఫే కాదు. ఎన్ని లైఫులలోనూ భగవంతుడు కలుగజేసుకోవటం జరగదు. అనవసరం జనమంతా భగవంతుని వెనక పడ్డారు.

## పుణ్యపాపాల ప్రకారం

జగత్తులో ఆత్మ, పరమాణువు రెండే ఉన్నాయి. ఎవరికైనా శాంతిని కలిగిస్తే, సుఖాన్ని అందిస్తే, పుణ్య పరమాణువులు ఒక దగ్గర కూడుతాయి. ఎవరికైనా దుఃఖాన్ని కలిగిస్తే, పాప పరమాణువులు ఒక దగ్గర జమ అవుతాయి, మరి అవే హింసిస్తాయి. కోరుకున్న విధంగా జరిగితే అది పుణ్యం, మనసుకి వ్యతిరేకంగా జరిగితే అది పాపం. పాపం రెండు రకాలు. ఒకటి పాపానుబంధీ పాపం, రెండవది పుణ్యానుబంధీ పాపం. అలాగే పుణ్యం రెండు రకాలు. ఒకటి పాపానుబంధీ పుణ్యం, రెండవది పుణ్యానుబంధీ పుణ్యం.

## పాపానుబంధీ పాపం

పాపానుబంధీ పాపం అంటే, ఇప్పుడు పాపాన్ని అనుభవిస్తున్నాడు, తిరిగి పాపానికి చెందిన కొత్త అనుబంధం ఏర్పడుతుంది. ఎవరికైనా దుఃఖం కలిగిస్తాడు, తిరిగి అందుకు సంతోషిస్తాడు.

## పుణ్యానుబంధీ పాపం

పుణ్యానుబంధీ పాపం అంటే, పూర్వజన్మలోని పాపం వలన ఇప్పుడు దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు, కానీ నీతిగా, సంస్కారవంతునిగా జీవిస్తూ, తదనుబంధంగా పుణ్యాన్ని సంపాదిస్తున్నాడు.

**ప్రశ్నకర్త:** అంటే, దుఃఖం ప్రయోజనకరమే కదా?

**దాదాశ్రీ:** కాదు. ఎవరికైతే 'నేను శుద్ధాత్మను' అనే అవగాహన కలుగుతుందో, వాళ్ళకి దుఃఖం ప్రయోజనకరమైనది. లేదంటే దుఃఖం లోనుంచి దుఃఖమే కదా ఉత్పన్నమౌతుంది. దుఃఖంలో దుఃఖ భావాలే వస్తాయి. ఈ కాలంలో పుణ్యానుబంధీ పాపం చేసేవారు తక్కువ మంది. ఉండటమైతే ఉన్నారు కానీ వాళ్ళకి కూడా ప్రతికూల సమయాలు అవరోధాలను కలిగిస్తాయి. ఎందుకంటే ఇలాంటి పాపం అవరోధాన్ని కలిగించేది. పాపం అంటే అర్థం ప్రాపంచిక వ్యవహారాలలో అడ్డంకులను కలిగించేది, దాన్నే పాపం అంటారు. అంటే బ్యాంక్‌లో వృద్ధిచేసుకునే

మాట ఎక్కడికి పోయిందో కాని, రోజూ చేసే వ్యవహారంలో కూడా ఏదో ఒక అడ్డంకి వస్తుంటుంది. అలా అడ్డంకులు వస్తున్నా, గుడికి వెళ్తాడు, ఆధ్యాత్మిక పరమైన ఆలోచనలే వస్తాయి. దాన్ని పుణ్యానుబంధీ పాపం అంటారు. పుణ్యం ఫలిస్తుంది కాని కాలం బాగోలేక చేసిన పాపం వలన కష్టాలు ఎదురౌతుంటాయి. అంటే వాస్తవానికి పుణ్యం ఎలా అనుకూలించాలో అలా లేదు. మరి ఏదైనా అంటుకుంటుంది కదా! గుడి బయట చెప్పులు విప్పేటప్పుడు పక్కన ఉన్నతన్ని, భాయ్ చెప్పులు ఎందుకు ఇక్కడ విప్పారు అని అడిగితే, అటువైపు దొంగతనం జరుగుతుంది అందుకే ఇక్కడ విప్పాను అంటాడు. అప్పుడు మన మనస్సులో, అటువైపు నుంచి ఎత్తుకెళ్తారు అని మనసులోకి వస్తుంది. దానితో దర్శనం చేసుకునే సమయంలో కూడా మనసు నిలకడగా ఉండదు.

## పాపానుబంధీ పుణ్యం

పూర్వం చేసిన పుణ్యం వలన ఈ రోజు సుఖాన్ని అనుభవిస్తున్నాడు కానీ భయంకరమైన పాపం మూటగట్టుకుంటాడు. ఇప్పుడు అంతటా పాపానుబంధీ పుణ్యమే ఎక్కువగా ఉంది. ఒక సేఠుకి ఒక బంగళా ఉంటుంది కానీ అతను ఆ బంగళాలో ఉండడు. రోజంతా సంపాదనలో బయటే ఉంటాడు. కానీ సేఠానీ మాత్రం మోహబజారులో మంచి చీర కోసం వెతుకుతుంటుంది. సేఠ్ కూతురు కారు తీసుకుని తిరగటానికి పోతుంది. నౌకరు ఒక్కడే ఇంట్లో ఉంటాడు. బంగళా అంతా అప్పుడు చెల్లాచెదురు అయిపోతుంది. పుణ్యవశాన అన్నీ లభించాయి. బంగళా, కారు, ఫ్రిజ్ అన్నీ లభించాయి. అలాంటి పుణ్యం ఉన్నప్పటికీ పాపం చుట్టుకున్నట్లుగా ఉంటుంది. లోభం మోహంలో పడి సమయమంతా అయిపోతుంది కాని, భోగించలేకపోతారు. పాపానుబంధీ పుణ్యం వారు విషయలాలసలోనే ఉంటారు.

అందుకే, బంగళా ఉంది, కారు ఉంది, భార్య ఉంది, పిల్లలున్నారు, అన్నీ ఉన్నాయి కానీ, రోజంతా డబ్బు ఎలా సంపాదించాలని ఆపసోపాలు పడుతుంటారు. అలా రోజంతా పాపబంధాలనే తగిలించుకుంటూవుంటాడు. ఈ జన్మలో పుణ్యాన్ని అనుభవిస్తుంటాడు కానీ వచ్చే జన్మ కోసం పాపాలను మూటగట్టుకుంటూవుంటాడు.

రోజంతా ఉరుకులూపరుగులు- అదీ ఎలా? బయ్ (కొనుగోలు చెయ్యటం), బారో (అరువు తెచ్చుకోవటం) అండ్ స్టీల్ (దొంగిలించటం). ఎటువంటి నియమ నిబంధనలూ లేవు. అటువంటివారు పరోపకారులు కారు.

ఇప్పుడు మీ నగరంలో చుట్టుపక్కల పుణ్యకార్యాలు ఎన్నో కనిపిస్తుంటాయి. అవన్నీ పాపానుబంధీ పుణ్యాలు. అంటే పుణ్యవశాత్తూ బంగ్లా ఉంది, కారు ఉంది, ఇంట్లో అన్ని రకాల సదుపాయాలున్నాయి, ఇవన్నీ పుణ్యం ఆధారంగా వచ్చినవే కానీ ఆ పుణ్యం ఎలాంటిది? ఆ పుణ్యంలో ఎన్నో చెడు ఆలోచనలు వస్తుంటాయి- ఎవరిది తీసేసుకోవాలి, ఎక్కడి నుంచి దోపిడీ చెయ్యాలి. ఎక్కడెక్కడి నుంచి పోగుచేసుకోవొచ్చు, ఎవరి సొత్తు అనుభవించాలి అని. అంటే *అణ్‌హక్* ని భోగించేందుకు సిద్ధ మవుతుంటారు. *అణ్‌హక్* సొమ్మును లాక్కునేందుకు చూస్తారు. అవన్నీ పాపానుబంధీ పుణ్యాలు. మనుష్యత్వం, అంటే మోక్షానికి వెళ్ళే సమయం వచ్చింది. కానీ ఇతను వీటిని పోగుచేసుకోవటంలో పడ్డాడు. అది పాపానుబంధీ పుణ్యం. అందులో పాపమే ఒడిగట్టుకుంటూవుంటారు. అంటే అది దారితప్పించే పుణ్యం.

చిన్న చిన్న ప్రదేశాలకు ఠాకుర్‌గా ఉన్నవాళ్ళు ఎంతో విలాసవంతమైన జీవితాన్ని గడిపారు. కోట్ల రూపాయలు ఖరీదు చేసే ఇళ్ళలో నివసించారు. కానీ జ్ఞాని ఏం చూస్తారు? ఇలాంటివారిని చూసిన జ్ఞానులు అయ్యో పాపం అని వాళ్ళని జాలితలుస్తారు. బోరివలి (ముంబైలో మధ్యతరగతి వర్గాలు నివసించే చోటు) వాళ్ళ మీద రాని కరుణ, వీరి మీద వస్తుంది. ఎందుకలా?

**ప్రశ్నకర్త:** ఎందుకంటే అది పాపానుబంధీ పుణ్యం కాబట్టి.

**దాదాశ్రీ:** పాపానుబంధీ పుణ్యమే నిజమే! కానీ, ఓహోహో, వీళ్ళది మంచు ముక్కలాంటి పుణ్యం. మంచు ముక్క కరిగిపోతున్నట్లుగా వీరి పుణ్యం కూడా కరుగుతూ పోతుంటుంది, దాన్ని జ్ఞాని చూడగలుగుతాడు. చేప కొట్టుకుంటుందే, అలా కొట్టుకుంటూవుంటారు. దీనిబదులు బోరివలిలో ఉన్నటువంటి నీరులాంటి పుణ్యంలో, కరగటానికి ఇంకేం మిగిలి ఉంటుంది? కానీ ఇదైతే కరిగిపోతూవుంది.

కానీ ఆ భోగించేవాళ్ళకి తెలియటం లేదు, *కథాపా–అజంపా* (ప్రతీకార వాంఛ, క్లేశం, అశాంతి, భయం) ల మధ్య భోగించటానికి ఇంకేముంది? ఈ కలియుగంలో భోగించటం ఇలాగేనా? అందుకు వ్యతిరేకంగా ఇది ఎంతో వికృత రూపంలో కనిపిస్తుంది. అరవై సంవత్సరాల ముందు ఉన్న రూపంలాంటి రూపం ఇప్పుడు లేదు. ప్రశాంతమైన ముంబై ఉండేది.

ఇప్పుడా రూపమే లేదు. అరవై సంవత్సరాల క్రితం మెరైన్ లైన్స్‌లో ఉంటే దేవగతిలో ఉన్నట్లుగా ఉండేది. ఇప్పుడది కళ్ళు పెద్దవి చేసి చూసేటట్టుగా ఉంది. రోజంతా వ్యాకులతతో, ఆందోళనతో ఉన్న మనుషులే కనిపిస్తారు. ఆ రోజుల్లో పొద్దున్నే కూర్చుని పేపర్ చదివుతూవుంటే, దేవీదేవతలందరూ పేపర్ చదువుతున్నట్లుగా ఉండేది. ఆవేశాలు, అశాంతి భావాలు లేవు. ఉదయానికి ముందే ముంబై సమాచార్ వచ్చిన తర్వాత ఇతర పేపర్లన్నీ కనుమరుగయ్యాయి. నేను కూడా మెరైన్ లైన్స్‌లో దిగుతుండేవాడిని. కానీ ఆ కాలంలో మనుషులలో ప్రశాంతత ఎక్కువగా ఉండేది! ఇంతటి వేదన లేదు. ఇంత లోభం లేదు, ఇంత మోహం లేదు, ఇంతటి తృష్ణ లేదు, శుద్ధమైన నెయ్యి ని శంకించే పనే లేదు, అనుమానం వచ్చేదే కాదు. ఇప్పుడు శుద్ధమైన నెయ్యి తెద్దామంటే దొరకదు.

మలబార్ హిల్స్ ఎంతటి పుణ్యమైనదో కానీ మంచు పర్వతం ఆ పుణ్యం. మలబార్ హిల్స్ మీద ఎంతటి మంచు ఉన్నప్పటికీ, రోజు రోజుకీ? ఇరవై నాలుగు గంటలూ కరిగిపోతూనేవుంటుంది నిరంతరం. కానీ మలబార్ హిల్స్‌కి, ఈ అన్నిచోట్లా నివసించేవాళ్ళకి టాప్ క్లాస్ జనులకు స్వయంగా తెలియదు, వాళ్ళకి ఏం జరుగుతూవుందో. రాత్రింబవళ్ళు పుణ్యం కరిగిపోతూనేవుంటుంది. ఇది కరుణ చూపించవలసిన దశ. అక్కడి నుంచి తింటూ తింటూ, ఏం తినాల్సివస్తుందో, అన్నది తెలియదు కనుకనే అంతా నడిచిపోతూవుంది. పాపానుబంధీ పుణ్యమిది. రోజంతా డబ్బు డబ్బు అంటూ తపనే. డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి అన్న ఆలోచనే రోజంతా. విషయ సుఖాలను ఎక్కడ అనుభవించను, ఇలా ఏమైనా చేయనా, అలా ఏమైనా చేయనా. డబ్బు! తపన, తపన, తపన. కానీ చూడు పెద్ద పెద్ద పర్వత పుణ్యమే కరిగిపోతూవుంది. ఆ పుణ్యం పూర్తిగా అయిపోతుంది, తిరిగి అంతకు ముందు

ఉన్నట్లుగానే రెండు చేతులూ ఖాళీ ఖాళీ అయిపోతాయి. తిరిగి నాలుగు కాళ్ళ మీద స్థిరపడాల్సివస్తుంది. అందుకే జ్ఞాని జాలితలుస్తాడు అరెరె అని. ఈ దుఃఖం నుంచి విముక్తులయితే మంచిది. ఏదైనా మంచి తరుణం వస్తే మంచిది. చూడండి వీళ్ళకి లభించినవి మంచి సంయోగాలే. ఈ సేఠు ఎప్పుడు అక్కడి నుంచి విముక్తులై ఇక్కడకు వస్తారో అన్న కోరికైతే నాకుంది. కానీ అంతా కుదరాలి కదా. అయితే ఎవరికైతే అలా కుదురుతుందో, వాళ్ళు వస్తారు కూడా.

**ప్రశ్నకర్త:** దాదా, వేరే చదివేవాళ్ళకి మోక్షానికి చెందిన, మరి ఇతర విషయాలు అర్థం కావు. కానీ ఈ దుఃఖానికి సంబంధించిన మాటలు బాగా అర్థమౌతాయి

**దాదాశ్రీ:** అవి అర్థమౌతాయి. అందరికీ అర్థమౌతాయి. ఇవి దివ్యమైన మాటలు. అరె, మోక్షం గురించి పక్కనపెట్టు, దుఃఖ నివారణయితే జరిగింది ఈ రోజు. ప్రాపంచిక దుఃఖమైతే పోయింది. ఇదే ముక్తికి మొదటి సంకేతం. దుఃఖం నుంచి విముక్తులయ్యారు- ప్రాపంచిక దుఃఖం నుంచి.

## అడ్వాన్స్‌గా ఓవర్‌డ్రాఫ్ట్ వ్యయం

నాలుగు ఇళ్ళకు యజమాని, కానీ ఇంట్లో ఐదు రూపాయలు కూడా లేవు, భావనగర్ రాజుకి ఉండే దర్పం ఉంటుంది. మరి ఆ అహంకారాన్ని ఏం చెయ్యాలి?

**ప్రశ్నకర్త:** దాదా ఎన్నోసార్లు వ్యవహారంలో ఇవన్నీ పెట్టుకున్నా, ఆ వ్యక్తికి అన్నీ లభిస్తుంటాయి.

**దాదాశ్రీ:** లభిస్తాయి కాని, అన్నీ పాపాన్ని మూటగట్టి తెచ్చిస్తాయి. దాని నియమమే అలాంటిది. నీవు అంతా ఖర్చుపెట్టి, కౌంటర్ వెయిట్ పెట్టుకుని నీవు ఇక్కడకు తెచ్చుకుంటావు. ఈ రోజు ఏమీ లేకపోతే ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకుంటావు. ఆ ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకుని మనిషి నుంచి జంతుజన్మలోకే పోతావు. చలాకీతనంతో సంపాదించింది ఎందుకూ పనికిరాదు. అది మన పుణ్యం వలన సహజంగా లభించింది అయ్యుండాలి.

అందువలన లభిస్తుంది కాని, అంతా ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకుంటూవుంటారు. మనసులో దొంగిలించాలనే భావం పోదు. అబద్ధమాడే ఆలోచన, కపటమైన ఆలోచన పోదు. పైకి మంచిగా కనిపించి లోపల కపటంతో ఉండే మాటలు పోవు. ఇక పూర్తిగా పాపమే అంటుకుంటుంది కదా! అలా జరగకూడదు లభించినప్పటికీ! అందువలన, నేను భేఖ్ (సన్యాసం) తీసుకోవటానికి సిద్ధమయ్యాను. ఎందుకంటే అలా పాపం అంటుకునే బదులు సన్యాసం తీసుకోవటమే మంచిది. చాలా భయంకరమైన బిరుదులు, ఎంతో వేడిలో ఉడికిపోతున్నాయి. అజ్ఞానంలో ఎంతో తెలివైన వ్యక్తి కూడా ఒక గంట సేపు అలా ఉడికిపోయినా, ఉడికిపోతున్న ఆ సమయంలో అతని కారణ మనస్సులో, అరె, ఇక ఇప్పుడేమీ అవసరం లేదు అనిపిస్తుంది. బుద్ధి తక్కువవారికి వేడి తక్కువగా అర్థమౌతుంది కానీ సూక్ష్మబుద్ధి ఉన్నవాళ్ళకి ఆ ఉక్కపోతను సహించటం ఎలా కుదురుతుంది? అదైతే ఆశ్చర్యకరమే.

## పుణ్యానుబంధీ పుణ్యం

ఒక రకమైన పుణ్యం గతి తప్పదు. అలాంటి పుణ్యం ఈ కాలంలో చాల తక్కువ. అది కూడా కాసేపటిలో అయిపోతుంది. అది పుణ్యానుబంధీ పుణ్యం అనబడుతుంది. ఏ పుణ్యంలోనైతే కర్మాచరణ చేస్తారో, మంచి కర్మ, ప్రాపంచిక ప్రయోజనం కోసం కానప్పుడు, అందులో ప్రాపంచిక ఇచ్ఛ లేనప్పుడు, ఏ పుణ్యమైతే వస్తుందో, అది పుణ్యానుబంధీ పుణ్యం.

పుణ్య ఫలాన్ని అనుభవిస్తుంటారు, అదే సమయంలో ఆత్మ ఉద్ధరణ కోసం అవసరమైన అభ్యాసం, కార్యాలు చేస్తుంటారు. పుణ్యాన్ని అనుభవిస్తూనే కొత్తగా పుణ్యాన్ని సంపాదిస్తుంటారు. అలా అభివృద్ధి చెంది మోక్షాన్ని పొందుతారు. పుణ్యానుబంధీ పుణ్యమని దేన్ని అంటారు? ఈరోజు అది పుణ్యం అవుతుంది, దాన్ని పూర్తిగా అనుభవిస్తుంటారు, అందులో అడ్డంకులు ఏమీ రావు, తిరిగి ధర్మాచరణ, రోజంతా ధర్మకార్యాలనే చేస్తుంటారు. అది పుణ్యానుబంధీ పుణ్యం. ఏమైనా ఆలోచనలు వస్తే, కేవలం ధర్మం, సత్సంగం గురించిన ఆలోచనలే రావాలి. ఏ పుణ్యం వలన సౌఖ్యము, సానుకూలతలు ఎక్కువగా లేకపోయినా, నాకు కాస్త అడ్డంకులు

కలిగినప్పటికీ, ఎవరికీ దుఃఖం కలిగించని వ్యవహారం చేయాలి, అటువంటి ప్రవర్తనే ఉండాలి అనే మంచి ఆలోచనలు కలిగితే అభ్యంతరం లేదు. కానీ ఎవరికీ ఒక ఉపాధి కలిగించను, అని అనుకోవటమే పుణ్యానుబంధీ పుణ్యం అనిపించుకుంటుంది. ఎందుకంటే కొత్తగా బంధించేది కూడా పుణ్యమే అవుతుంది కనుక.

**ప్రశ్నకర్త:** పుణ్యానుబంధీ పుణ్యం అనేదానికి ఉదాహరణ ఇవ్వండి.

**దాదాశ్రీ:** ఎవరికైనా కారు, బంగళా, అన్ని ఉపకరణాలు ఉండటం, అనుకూలవతి అయిన భార్య ఉండటం, మంచి సంతానం, మంచి నౌకర్లు, అలా అంతా మంచివే లభించినపుడు అతన్ని ఏమంటారు? లోకులు అతన్ని 'పుణ్యశాలి' అంటారు. ఇక ఆ పుణ్యశాలి ఏం చేస్తున్నాడు? మనం చూసినట్లయితే రోజంతా సాధుసంతుల సేవ చేస్తూ కనిపిస్తాడు, వేరేవాళ్ళకి సేవచేస్తాడు, మోక్షానికి తయారీలు చేసుకుంటూవుంటాడు. అలా చేయగా చేయగా మోక్షానికి కావలసిన సాధనం కూడా లభిస్తుంది. ఇప్పుడున్నది పుణ్యమే, కొత్తగా పుణ్యాన్నే మూటగట్టుకుంటున్నాడు. తక్కువ పుణ్యం దక్కినా, అతని ఆలోచనలలో 'మోక్షానికి పోవాలి' అన్నదే ఉంటుంది. అదే పుణ్యానుబంధీ పుణ్యం. మీరు నన్ను కలవటం మీ పుణ్యానుబంధీ పుణ్యమే అయ్యుండాలి, దానివలనే జరిగివుండాలి. కొద్దిగా ఇలా కొన్ని తుంపరలు పడివుంటాయి. లేకపోతే కలవనేకలిసివుండరు.

మొండివైఖరితో చేసే పనులన్నీ, మొండిగా చేసే తపస్సు, మొండితనంతో చేసే పనులు, వీటితో పాపానుబంధీ పుణ్యం కలుగుతుంది. కానీ అర్థం చేసుకుని చేసే తపం, క్రియలు, తన ఆత్మ ఉన్నతి కోసం చేసే పనుల వలన పుణ్యానుబంధీ పుణ్యం కలుగుతుంది. ఏ సమయంలోనైనా జ్ఞాని పురుష్ ఎదురౌతారు, మోక్షానికి తీసుకునిపోతారు.

## రెండు దృష్టులూ వేరు వేరు

**ప్రశ్నకర్త:** ఈ కాలంలో సామాన్య మానవుడికి, ప్రకృతి ధర్మం పట్ల విశ్వసనీయత పోతూవుంది కనుక, చెడు మార్గం లేదా చెడ్డ పనుల ద్వారానే భౌతిక

సుఖాలు, సౌకర్యాలు లభిస్తాయని అనిపిస్తుంది. దానితో చెడు కర్మలను ఆచరించేందుకు ప్రేరేపించబడతాడు.

**దాదాశ్రీ:** ఔను. సామాన్య వ్యక్తికి అంతా అలాగే అనిపిస్తుంది. చెడు మార్గంలో చెడు కార్యాల ద్వారానే భౌతిక సుఖం, సౌకర్యాలు ప్రాప్తిసాయి. అందుకు కారణం, ఇది కలియుగం కావటం, ప్రధూషిత కాలమవటమే. మనుషులకు భౌతిక సుఖం, సౌకర్యాలు, పుణ్యం లేకపోతే లభించవు. ఎటువంటి సౌకర్యమైనా పుణ్యం లేకుండా లభించదు. పుణ్యం లేకపోతే ఒక్క రూపాయి కూడా చేతికి చిక్కదు.

పాపానుబంధీ పుణ్యం, మరొకటి పుణ్యానుబంధీ పుణ్యం అనేవి ఉంటాయి. ఈ రెండిటినీ గుర్తించేందుకు మనలో అవగాహనా శక్తి ఉండాలి.

అందువలనే తానే అనుభవిస్తాడా? ఉన్నది పుణ్యమే కానీ ఏం మూట కట్టుకుంటున్నాడు? పాపం మూట కట్టుకుంటున్నాడు. అందువలన మనకి, ఇలాంటి పాప కర్మలు చేస్తున్నాడు కదా మరి సుఖాలను ఎలా అనుభవిస్తున్నాడు అనిపిస్తుంది. అలా కాదు. అతను అనుభవిస్తున్నది అతని పుణ్యఫలం. అది తప్పు కాదు. పాపానికి ఫలితం సుఖం ఎన్నటికీ కాదు. కొత్తగా రాబోయే జన్మలను పాడు చేసుకుంటున్నాడు. అందుకే ఆ మనిషి అలా ఎందుకు చేస్తున్నాడు అనిపిస్తుంది.

మరి ప్రకృతి అతనికి సహాయం కూడా చేస్తుంది. ఎందుకంటే ప్రకృతి అతన్ని కిందికి పడేయబోతున్నది, అధోగతిలో, కనుకనే అతనికి సహాయం చేస్తుంది. కొత్తగా దొంగతనానికి వచ్చి, మొదటిసారి జేబులో చెయ్యి పెట్టాడనుకోండి, అతన్ని పట్టిస్తుంది. భయ్, వద్దు, ఇందులో పడితే కిందకు జారిపోతావు అని చెప్పేందుకు. కొత్త దొంగని పట్టిస్తుంది. ఎందుకని? అతన్ని ఊర్ధ్వగతిలోకి తీసుకెళ్ళాలి కనుక. పక్కా దొంగ ఉంటాడు, అతన్ని వదిలేస్తుంది. అధోగతికి పోయి బాగా దెబ్బతిను అని. కొత్తగా దొంగతనానికి వచ్చినవాడు పట్టుబడతాడా పట్టుబడడా?

**ప్రశ్నకర్త:** పట్టుబడతాడు.

**దాదాశ్రీ:** ఔను. మరి పక్కా దొంగ పట్టుబడడు. ప్రభుత్వం అట్లా చేసినా, ఇట్లా చేసినా సరే పట్టుబడడు. అతను ఏ వలలోను పడడు. అందరినీ కొనేస్తాడు. ఎన్నిసార్లు అంటారో, ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళని జేబులో వేసుకుని తిరుగుతుంటాను అని. తన ప్రమేయం గురించి చెప్పుకుంటూ వుంటారు కదా. ఆ పనులన్నిటినీ అతను తన బాధ్యత మీదనే చేస్తుంటాడు కదా.

## పాపానుబంధీ పుణ్యపు సంపద

పాపానుబంధీ పుణ్యపు సంపద అంటే ఏమిటి? ఆ సొమ్ము వచ్చిందంటే, ఎవరిది తీసుకోను, *అణ్‌హక్* ది అనుభవించనా, *అణ్‌హక్* ది లాక్కోనా, అనే పాశవిక ఆలోచనలు వస్తుంటాయి. ఎవరికైనా సాయం చేయాలనే ఆలోచన ఏమాత్రమూ రాదు. దానం చేసినా అది కూడా పేరు కోసమే అవుతుంది. ఏ విధంగా నేను పేరు సంపాదించగలను అని. అంతే కాని ఎవరి హృదయాన్నో తృప్తి పరచటానికి కాదు. ఇక్కడ జ్ఞాని పురుష్ సమక్షంలో హృదయం తృప్తిపడుతుంది. రాత్రింబవళ్ళు పూర్తిగా ఆత్మసంతృప్తి ఉంటే, అది, ఒక్కో వ్యక్తికి ఐదైదు లక్షల రూపాయలిచ్చినదానితో సమానం. కానీ మనసు ఒప్పుకోదు ఎల్లప్పుడూ. డబ్బులు ఇవ్వటం వలన కొత్త గుర్తింపు ఒకటి కలుగుతుంది.

అందుకే ఈ పాపానుబంధీ పుణ్యంతో ఇక్కడికి ఎవరూ రాలేరు. అందుకే ఇక్కడికి అలాంటి ధనికులు ఎవరూ రాలేరు. ఇక్కడికి పుణ్యానుబంధీ పుణ్యం ఉన్నవారు, నిజమైన ధనవంతులే ఇక్కడికి వస్తారు. నిజమైన అంటే మరేమీ లేదు, ఈ కాలాన్నిబట్టి, పూర్తిగా సత్యవంతమైనదేమీ ఉండదు. మా ఇంట్లో కూడా పూర్తిగా సత్యవంతమైనదేమీ లేదు. ఈ కాలానుగుణంగా మంచి ఆలోచనలు వస్తాయి, ఈ మనిషికి ఎలా సుఖం కలిగేటట్లుగా చేయగలను, ఏ విధంగా ఇతనికి జ్ఞాన ప్రాప్తి ధర్మ ఆలోచనలు వస్తాయి అని. అదే నిజమైన సంపద అనిపించుకుంటుంది. పుణ్యానుబంధీ పుణ్యమే సంపద అనిపించుకుంటుంది. పుణ్యానుబంధీ పుణ్యమంటే, అది పుణ్యమే కాక, కొత్తగా పుణ్యాన్ని కూడా కలిగిస్తుంది. ఆలోచనలు అన్నీ మంచివైతే పుణ్యం అవుతుంది, ఆలోచనలు చెడుగా ఉండటం అంటే, ఏమి భోగించను, ఎక్కడి

నుంచి తీసుకోను, అలా రోజంతా రాత్రి సమయంలో కూడా నిద్రలో ఉన్నప్పుడు కూడా ఆ మెషీన్ నడుస్తూనేవుంటుంది, రాత్రంతా కూడా.

ఇక, అలాంటి మనుషుల ఇంటికి నన్ను పిలుస్తారు దర్శనం, పాదస్పర్శ చేయించేందుకు. అలా ఎందుకంటే, ఆ మనుషులకు అది తెలుసు కాబట్టే. అక్కడికి పోతే, అతను కోటీశ్వరుడౌతాడు. కానీ శవాన్ని కూర్చోబెట్టినట్లే కనిపిస్తాను నేను అందరికీ. వాళ్ళు జైజైలు కొట్టిస్తారు కదా! నాకు అర్థమౌతుంది పాపం వీళ్ళంతా శవాలేనని. అప్పుడు చూస్తాను అక్కడ ఎవరెవరు మంచివాళ్ళున్నారు అని. అక్కడ వాళ్ళ నౌకర్లను చూస్తే, అరె, వాళ్ళ శరీరాలు ధృఢంగా, ఎర్రెర్రగా, ఇక వాళ్ళ వంట చేసేవాళ్ళు ఉంటారే, వాళ్ళు పండులాగా, హోఫీజ్ మామిడి లాగా, చూడండి మరి! ఇక నాకు అర్థమౌతుంది, ఈ సేఠ్‌లు అధోగతిలోకి పోబోతున్నారు అని, వాటి సంకేతాలే ఇవన్నీ అని.

ముప్పై రెండు రకాల వంటకాలుంటాయి కాని అతను తినలేడు. మేము అంతా కలిసి తింటున్నప్పుడు సేఠ్‌తో, మీరు ఎందుకు తినటం లేదు అని అడిగితే, నాకు డయాబెటిస్ ఉంది, బ్లడ్‌ప్రెషర్ ఉంది అంటాడు.

సేఠ్‌కి డాక్టర్ చెప్పివుంటాడు, 'చూడు, నీకు బ్లడ్‌ప్రెషర్ ఉంది, డయాబెటిస్ ఉంది, అవన్నీ తినగూడదు, సద్ద రొట్టెలు, కాస్త పెరుగు తినాలి...వేరే ఏమీ తినవద్దు' అని. అరె భాయ్, ఇక్కడ ఎద్దుని పొలంలోకి తీసుకెళ్తాం కదా, అది తినదెందుకు? పొలంలోకి తీసుకునిపోయినా కూడా? ఎందుకంటే ఛీంఖా కట్టేసారు (మూతికి కట్టేది) మూతికి కట్టేస్తారు కదా ఏదో? ఏమంటారు దాన్ని?

**ప్రశ్నకర్త:** జాలీ.

**దాదాశ్రీ:** మాదగ్గర దాన్ని 'శీకీ' అంటారు. అలా కట్టేసివుంటుంది కదా, ఇక పాపం అది తినాలనివున్నా కూడా తినలేదు. చచ్చిపోతావు అని డాక్టరు చెప్పివుంటాడు కనుక.... అలాగే ఈ మనుషులకు ఛీంఖా కట్టేసివుంటుంది.

అంటే అది పూర్తిగా నరకవేదనను వాళ్ళు అనుభవిస్తున్నట్లే. నేను సేఠ్‌లు అందరి దగ్గరికీ పోయాను. ఇక అక్కడ దర్శనం చేయిస్తారు, దానితో కాస్త శాంతి

లభిస్తుంది. నేను చెప్తాను వాళ్ళకి, దాదా భగవాన్‌ని స్మరిస్తూవుండండి అని. ఎందుకంటే వాళ్ళకి జ్ఞానమైతే వచ్చే యోగమే లేదు. వాళ్ళకి ఏర్పాటు చేసినప్పటికీ వచ్చే అవకాశమే లేదు. అందుకే మహా దుఃఖమే అది.

## భోగించగలిగేవాడు పుణ్యాత్ముడే

సంపద మనిషిని పనివానిగా చేస్తుంది. ఒకవేళ డబ్బు అవసరానికి మించి వచ్చినట్లయితే, మనిషి ఒక పనిమనిషిగా మారిపోతాడు. సంపద ఎక్కువగా ఉండి, దానితోపాటు అతను దాత అయితే మంచిదే. లేకపోతే అతన్ని పనివాడు అనే కదా అంటారు! రోజంతా బాగా పనిచేస్తాడు. అతను భార్యను కూడా పట్టించుకోడు. పిల్లలను పట్టించుకోడు. ఎవరినీ పట్టించుకోడు. కేవలం డబ్బునే పట్టించుకుంటాడు. అందుకే డబ్బు మనిషిని నెమ్మది నెమ్మదిగా శ్రామికుడిని చేసేసి, చివరకు తిర్యంచగతికి తీసుకునిపోతుంది. ఎందుకంటే, పాపానుబంధీ పుణ్యం కదా! పుణ్యానుబంధీ పుణ్యమైతే పరవాలేదు. రోజంతటిలోను అరగంట మాత్రమే శ్రమించవలసివుంటుంది, అలా అరగంట సేపు పనిచేసినా రోజంతా చక్కగా గడిచిపోతుందే దాన్ని పుణ్యానుబంధీ పుణ్యమని అంటారు.

ఈ జగత్తు ఎలాంటిదంటే, భోగించేవారు ఉంటారు, శ్రమించేవారు ఉంటారు. అందరూ కలిసేవుంటారు. శ్రమించేవారు, 'ఇదంతా నేనే చేస్తున్నాను' అనుకుంటారు. అందులో వాళ్ళకి అహంకారం ఉంటుంది. కానీ భోగించేవారిలో అహంకారం ఉండకపోతే, భోక్తారసం లభిస్తుంది. శ్రమించేవారికి అహంకారతో గర్వరసం లభిస్తుంది.

ఒక సేఠ్ నన్ను, 'నా కొడుకుకి ఏదైనా చెప్పరాదండి, కష్టపడడు. హాయిగా అనుభవిస్తుంటాడు' అన్నాడు. అప్పుడు నేను, 'చెప్పవలసిందంటూ ఏమీ లేదు. అతను తన భాగం పుణ్యాన్ని అనుభవిస్తున్నాడు. అందులో మనమెందుకు కలుగజేసుకోవాలి?' అన్నాను. అతను, 'అతనికి తెలివితేటలు రావొద్దా?' అని అడిగితే, 'ఈ జగత్తులో ఎవరైతే భోగిస్తారో అతనే తెలివైనవాడు' అన్నాను. బయటకు పంపిస్తే అతన్ని పిచ్చివాడు అంటారు. శ్రమిస్తే శ్రామికుడు అంటారు. కానీ కష్టపడి పనిచేసినవాళ్ళు

అహంకార రసాన్ని పొందుతారు. పొడుగాటి కోటు వేసుకుని వెళ్తారు కనుక, 'సేఠ్ గారొచ్చారు, సేఠ్‌గారొచ్చారు' అంటారు. అంతే. ఇక భోగించేవానికి ఎటువంటి సేఠ్ సేఠ్ అనిపించుకునే పనే లేదు. 'నాది నేను అనుభవిస్తున్నాను, అదే సత్యం' అంటాడు.

ఇప్పుడు ఉన్నది సంపదే కాదు. ఇది పాపానుబంధీ పుణ్యం బాపతు డబ్బు. పుణ్యం అలాంటిది సంపాదించారు, అజ్ఞాన తపం చేసారు, దాని పుణ్యం లభించింది. దాని ఫలం వచ్చింది. అటువంటి డబ్బు మనిషిని పిచ్చివాడిని చేస్తుంది. దాన్ని సుఖం అని ఎలా అంటారు? సుఖమంటే డబ్బు ఆలోచనే ఉండదే అదే సుఖం అనిపించుకుంటుంది. నాకు సంవత్సరంలో ఒకటి రెండుసార్లు వస్తుంది, జేబులో డబ్బులు ఉన్నాయా లేవా అన్న ఆలోచన.

**ప్రశ్నకర్త:** భారమనిపిస్తుందా?

**దాదాశ్రీ:** లేదు. నాకు భారమని ఎప్పుడూ అనిపించదు. కానీ నాకు ఆ ఆలోచనే ఉండదు కదా. దేని గురించి ఆలోచించాలి. అన్నీ వెనకో ముందో అయిపోతుంటాయి. ఎలాగంటే, తిని తాగేవన్నీ మీ టేబుల్ మీదకు వస్తాయా లేదా, అలాగే.

## అనుభవిస్తున్నది డబ్బునా లేక వేదననా?

ఇది ఎలాంటిదంటే, ఎవరికైతే రాయి తగిలిందో వాళ్ళదే తప్పు అన్నట్లు. ఎవరి తప్పుకి వాళ్ళు అనుభవిస్తారు అని మాత్రమే కాదు, అనుభవించినదానికి బహుమానం కూడా లభిస్తుంది. పాపానికి బహుమానం లభిస్తే అది, చేసిన తప్పుకి శిక్ష, పూలమాలలు లభిస్తే అది అతని పుణ్యానికి బహుమానం. అయితే, రెండిటినీ అనుభవించవలసిందే - ఆనందంగా లేక బాధగా.

ప్రకృతి ఏమంటుంది? 'అతను ఎన్ని రూపాయలను ఖర్చుచేసాడన్నది మేము చూడం. అతను కష్టాలు ఎన్ని అనుభవించాడు, ఆనందంగా, బాధగా అన్నది శాంతి అశాంతి అన్నది మాత్రమే మేము ఇక్కడ చూస్తాం. డబ్బు లేకపోయినా శాంతిని

అనుభవిస్తాడు, డబ్బు ఉన్నప్పటికీ బాధని అనుభవిస్తాడు అంటే ఏ ఆనందాన్ని కాని ఏ బాధని కాని అనుభవిస్తాడు'. అంటే, ఏ శాంతిని కాని అశాంతిని కాని అనుభవిస్తాడో, అది డబ్బు మీద ఆధారపడి లేదు.

## నిజమైన ధనం సుఖాన్నిస్తుంది

కొడుకుకి పది లక్షల రూపాయలనిచ్చి తండ్రి అంటాడు, 'ఇప్పుడు నేను ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతాను' అని. అయితే ఆ డబ్బులను కొడుకు, మాంసాహారం, తాగుడు, షేర్లలో ఖర్చుపెట్టేస్తాడు. ఎందుకంటే, తప్పు మార్గంలో పోగుచేసుకున్న డబ్బు ఎప్పుడూ దగ్గర నిలవదు. ఈ రోజుల్లో సరైన ధనం, సరైన పద్ధతిలో సంపాదించిన ధనం కూడా నిలవదు. అలాంటప్పుడు తప్పుగా సంపాదించిన డబ్బు ఎలా నిలుస్తుంది? అంటే పుణ్యంతో గడించిన డబ్బు అవసరం ఉంది. పద్ధతి తప్పకుండా, దానమిచ్చింది సరిగ్గా ఉంటే, అటువంటి ధనం సుఖాన్నిస్తుంది. ఆలా కాకుండా, ఇప్పుడు ఈ ప్రధూషిత కాలంలోని ధనం కూడా పుణ్యఫలమనే అంటారు కాని, అది పాపానుబంధీ పుణ్యఫలం. అది శుద్ధ పాపబంధంలోనే పడేస్తుంది. దాని బదులు ఆ డబ్బుతో చెప్పండి, 'నువ్వు రానేవద్దు. అల్లంత దూరంలోనే ఉండు. అదే నాకు శోభనిస్తుంది, నీ శోభ కూడా పెరుగుతుంది' అని. తయారయ్యే ఈ బంగళాలలో పాపానుబంధీ పుణ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ ఉంటే ఒకవేళ వెయ్యిమందిలో అకరో అరో, పుణ్యానుబంధీ పుణ్యం కలవారుండవచ్చు. మిగతాదంతా పాపానుబంధీ పుణ్యమే. ఇంత డబ్బు ఎప్పుడైనా ఉందా? శుద్ధ పాపాన్నే మూటగట్టుకుంటున్నారు. వీళ్ళు తిర్యంచ్ కి రిటర్న్ టికెట్ తీసుకునివచ్చివున్నారు.

ఈ ప్రపంచం ఒక్క నిమిషం కూడా ఉండే యోగ్యం లేనిది. మంచి పుణ్యం ఉన్నప్పటికీ, లోపల దాహం తీరదు. అంతర్దాహం నిరంతరం దహిస్తూనేవుంటుంది. అంతర్దాహం దేనివలన కలుగుతుంది? అంతర్దాహం పాప పుణ్యాల ఆధీనంలో లేదు. అంతర్దాహం రాంగ్ బిలీఫ్ ఆధీనంలో ఉంది. నలువైపుల నుంచీ ఫస్ట్ క్లాస్ సంయోగాలున్నప్పటికీ, అంతర్దాహం నడుస్తూనేవుంటుంది. అది మరి పోయేదెలా? పుణ్యం కూడా చివరకు అంతమైపోతుంది. అప్పుడేమౌతుంది? పాపం ఉదయిస్తుంది.

అదే అంతర్‌దాహం. పాపం ఉదయించే సమయంలో బయటి ఉత్పన్నమయే దాహం వలన ఆ సమయంలో నీ దశ ఎలా ఉంటుంది? అందుకే భగవాన్, జాగ్రత్తగా ఉండండి అని చెప్తారు.

## పుణ్యంతోనే ధన ప్రాప్తి

**ప్రశ్నకర్త:** ఈకాలంలో పాపుల దగ్గరే డబ్బులున్నాయి.

**దాదాశ్రీ:** పాపాత్ముని దగ్గర లేవు. మీకు నేను అర్థమయేటట్టుగా చెప్తాను. నా మాటను అర్థం చేసుకోండి ఒకసారి, పుణ్యం లేకపోతే డబ్బు మిమ్మల్ని తాకదు. నల్ల బజారుదీ తాకదు, తెల్ల బజారుదీ తాకదు. పుణ్యమే లేకపోతే దొంగతనంగా సంపాదించింది కూడా మనకి చెందదు. ఇదైతే మరి పాపానుబంధీ పుణ్యం. అది పాపమని మీరు అంటున్నారే, అది చివరకు పాపానికే తీసుకునిపోతుంది. ఆ పుణ్యం కూడా అధోగతిలోకే తీసుకునిపోతుంది.

చెడు ధనం వస్తే ఆలోచనలు కూడా చెడువే వస్తాయి, ఎవరిది భోగించాలి అని, రోజంతా ఎలా కల్తీ చేయాలి అనే ఆలోచనలే వస్తాయి. అప్పుడతను అధోగతిలోకే పోతాడు. పుణ్యఫలాన్ని భోగించడు, అధోగతికే పోతాడు. దాని బదులు పుణ్యబంధీ పాపమే మంచిది ఎలా అంటే, కూరగాయలు తేవటంలోనూ ఈ రోజుల్లో అడ్డంకులు కలుగుతుంటాయి. కానీ రోజంతా భగవాన్ నామస్మరణయితే చెయ్యవచ్చుగా. పుణ్యానుబంధీ పుణ్యమే ఉంటే, అతను పుణ్యఫలాన్ని అనుభవిస్తాడు, కొత్తగా పుణ్యం కూడా ఉత్పన్నమౌతుంది.

## .. అలా అయితే తర్వాత జన్మ కూడా చెడుతుంది

**ప్రశ్నకర్త:** ఈ కాలంలో మనిషి తన పాలన, పోషణను తాను స్వయంగా చేసుకోలేకపోతున్నాడు. దాన్ని పూర్తిచేసుకునేందుకు తప్పో ఒప్పో చేయవలసి వస్తుంది కదా మరి అలా చెయ్యవచ్చా?

**దాదాశ్రీ:** అదేమిటంటే, అప్పు చేసి నెయ్యి తాగనట్లే వ్యాపారం

చెయ్యటమంటే. ఈ తప్పు చెయ్యటం వలనే ఇప్పుడు పడిపోతున్నారు. ఇప్పుడు పడిపోతున్నారంటే అందుక కారణమేమిటి? పాపం బాగా ఉంది కనుకనే సరిపోవటం లేదు. కూరలు లేవు, మరేమీ లేవు. అయినా ఇప్పటికైనా మంచి ఆలోచనలు వస్తుంటే, ధర్మకార్యంలో భాగంగా గుడికి వెళ్ళండి, ఆశ్రమాలకు వెళ్ళటం, ఏమైనా సేవచెయ్యటం, అలాంటి ఆలోచనలు వస్తే, ఈ రోజు పాప ఫలితమే ఉన్నా, పుణ్యాన్ని సంపాదించు కుంటున్నారు. కానీ పాపంలో ఉంటూ మరింత పాపాన్నే సంపాదించుకుంటూ పోవటం సరి కాదు. పాపం కారణంగా లోటు ఉన్నా, ఈ విధంగా తప్పు చేస్తే, ఇక మీ దగ్గర ఏం మిగులుతుంది?

## ఆ సంపాదన తెలివితేటలదా లేక శ్రమతో వచ్చిందా?

విషయం అర్థం చేసుకోవాలి కదా? ఎప్పటివరకు ఈ శూన్యస్థితి? ఉపాధేమో మీకు ఇష్టం లేదు. ఈ మానవదేహం ఉపాధుల నుంచి విముక్తి పొందటానికి ఉన్నదే. కేవలం డబ్బు సంపాదన కోసం కాదు. డబ్బు దేనితో సంపాదిస్తారు? శారీరక కష్టంతోనా లేక బుద్ధిని ఉపయోగించా?

**ప్రశ్నకర్త:** రెండిటితోను.

**దాదాశ్రీ:** శారీరక కష్టంతో డబ్బుని సంపాదిస్తుంటే ఈ కూలీల దగ్గర చాల డబ్బు ఉండేదే. ఎందుకంటే ఈ కూలీలు ఎక్కువ కష్టపడతారు కదా? ఒకవేళ డబ్బు సంపాదన బుద్ధిని ఉపయోగించి చేస్తుంటే, ఎందరో పండితులున్నారు కదా! వాళ్ళ చెప్పులు సగం అరిగిపోయేవుంటాయి. డబ్బు సంపాదన బుద్ధితో చేసేది కాదు, కష్టంతో చేసేదీ కాదు. అది మన పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యం ఏదైతే ఉందో, దాని ఫలస్వరూపం మీకు అది దక్కటం. మరి నష్టం, చేసుకున్న పాపపు ఫలస్వరూపం. పుణ్య పాపాల ఆధీనంలో ఉంది సంపద. కనుక సంపదలు కావాలంటే మనకు పుణ్యపాపాల మీద ధ్యాస ఉండాలి.

భూలేశ్వర్‌లో ఎవరికైతే సగం చెప్పులు అరిగిపోయాయో, అలాగే ఎందరో తెలివిగలవారున్నారు. ఒకరు నెలకి ఐదు వందల రూపాయలు సంపాదిస్తే, ఒకరు ఏడు వందలు సంపాదిస్తారు. పదకొండు వందల రూపాయలు సంపాదిస్తున్నానని

గట్టిగా అరిచి చెప్పుకుంటాడు. అరె, కానీ నీ సగం చెప్పులు ఇంకా సగం చెప్పులుగానే ఉన్నాయి. చూడు మరి తెలివితేటల కర్మాగారం! మరి తక్కువ తెలివి కలవారు ఎక్కువ సంపాదిస్తున్నారు. తెలివికలిగినవారు పాచికలు వేస్తే తిన్నగా పడతాయా లేక మూర్ఖుడు వేసే పాచికలు తిన్నగా పడతాయా?

**ప్రశ్నకర్త:** ఎవరు పుణ్యం చేసుకున్నారో వాళ్ళకే తిన్నగా పడతాయి

**దాదాశ్రీ:** అంతే, అందులో తెలివితేటలు పనిచేయవు కదా! పైగా తెలివితేటలున్నవారికి అంతా వ్యతిరేకంగా జరుగుతుంటుంది. తెలివితేటలు అతనికి కష్టాల్లో హెల్ప్ చేస్తుంది. బాధల్లో ఉన్నపుడు ఎలాగైతే అంతా సరిచేస్తుందో, అలా హెల్ప్ చేస్తుంది.

## తెలివి గుమస్తాది, లాభం సేఠ్‌ది

డబ్బు ఎవరి వలన వస్తుంది, ఎవరి వలన పోతుంది అన్నది నాకు తెలుసు. డబ్బు శారీరక శ్రమ వలనా రాదు, తెలివితేటల వలనా రాదు, ట్రిక్ పనికి రాదు. డబ్బు సంపాదన దేనితో జరుగుతుంది? తిన్నగా సంపాదిస్తే మన మంత్రులకు నాలుగు అణాలు కూడా రావు. ఈ డబ్బు అనేది పుణ్యంతోనే సంపాదించగలుగుతాము. పిచ్చివాడైనా సరే పుణ్యంతో డబ్బు సంపాదిస్తాడు.

సంపద పుణ్యంతోనే ప్రాప్తిస్తుంది. బుద్ధిని ఉపయోగించినా రాదు. ఈ మిల్లు యజమానులకు, సేఠ్‌లకు చిన్న తెలివితేటల చుక్క కూడా లేదు. కానీ డబ్బు విపరీతంగా వస్తుంది. వాళ్ళ గుమస్తా తన బుద్ధిని ఉపయోగిస్తుంటాడు. ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసుకి వెళ్తాడు, అక్కడ ఆఫీసర్ చేత తిట్లు కూడా గమస్తాయే తింటాడు. ఆ సమయంలో సేఠ్ హాయిగా పడుకునివుంటాడు.

ఒక సేఠు ఉండేవాడు. సేఠ్, అతని గుమస్తా ఇద్దరూ కూర్చునిమవున్నారు. అహ్మదాబాద్‌లోనే జరిగింది. చెక్కతో చేసిన గద్దె, దాని మీద పరుపు, అలాగే మంచం, ఎదురుగా టీపాయ్! దానిమీద భోజనం పళ్ళెం ఉంది. సేఠు భోజనం చెయ్యటానికి కూర్చున్నాడు. సేఠ్ డిజైన్ చెప్పనా? నేల నుంచి మూడు అడుగుల పైన కూర్చున్నాడు.

తల నేల నుంచి అడుగున్నరలో ఉంది. త్రికోణాకారంలో ముఖం, పెద్దపెద్ద కళ్ళు, పెద్ద ముక్కు. పెదవులు లావుపాటి పకోడీల్లాంటివి, పక్కనే ఫోను. తింటూనే ఫోన్ వస్తే మాట్లాడుతున్నాడు. సేఠ్‌కి తినటమే రావటం లేదు. రెండు మూడు పూరీ ముక్కలు కింద పడ్డాయి. అన్నం మెతుకులైతే కింద చెల్లాచెదురుగా పడివున్నాయి. ఫోను గంట మోగింది, సేఠ్, 'రెండు వేల మూటలు ఎత్తుకో' అన్నాడు. రెండవ రోజు రెండు లక్షల రూపాయల సంపాదన వచ్చింది. గుమస్తా కూర్చుని తన తల బద్దలు కొట్టుకుంటున్నాడు, సేఠ్ ఎలాంటి శ్రమ పడకుండా సంపాదిస్తున్నాడు. అలా సేఠ్ తన తెలివితోనే సంపాదిస్తున్నట్లుగా కనిపిస్తుంది. కానీ ఆ తెలివి అతనికి సరైన సమయంలో అతని పుణ్యం కారణంగానే పనిచేస్తుంది. ఇది పుణ్యంతో జరుగుతుంది. సేఠ్‌ని, గుమస్తాని పక్క పక్కనే చూస్తున్నపుడు ఇది అర్థమైంది. సరైన బుద్ధి గుమస్తాకే ఉంది కానీ సేఠ్‌కి లేదు. ఈ పుణ్యం ఎక్కడి నుంచి వచ్చింది? భగవాన్‌ని అర్థం చేసుకుని పూజచేసినందుకా? లేకపోతే అర్థం చేసుకోకుండానే భజన చేసినందుకా? ఎవరికో ఉపకారం చేసాడు, ఎవరికో మంచి చేసాడు, వాటి వలన పుణ్యం సంపాదించాడు.

## శ్రీమంతుడు ఎవరు అవుతారు?

ఏం చెయ్యటం వలన శ్రీమంతుడు అవుతాడు? ఎందరో ఎక్కువ మందికి హెల్ప్ చేసివుంటేనే సంపద అతని దగ్గరకు వస్తుంది! లేదంటే సంపద రాదు. ఇవ్వాలనే ఇచ్ఛ ఉన్నవాళ్ళ దగ్గరకే సంపద వెళ్తుంది. ఇతరుల కోసం కష్టపడి, మోసపోయి, నోబిలిటీని ఉపయోగించినవారికే లక్ష్మీ కటాక్షం దొరుకుతుంది. పోయింది అని అనిపించవచ్చు. కానీ వచ్చి అక్కడే నిలబడుతుంది.

**ప్రశ్నకర్త:** పెద్ద మనసున్నవాడే సంపాదిస్తాడు అని మీరు రాసారు. ఇచ్చిపుచ్చుకోవటం పెద్ద మనసుతో చేసినవాడే బాగా సంపాదిస్తాడు. ఇక సంకుచిత్వం కలవాడు ఎప్పటికీ సంపాదించలేడు!

**దాదాశ్రీ:** ఔను. అన్ని రకాలుగా నోబుల్ అయినవాడయితే లక్ష్మీదేవి అక్కడికే పోతుంది. ఈ చెడ్డవారి దగ్గరికి లక్ష్మి పోతుందా ఏమిటి?

**ప్రశ్నకర్త:** అంటే, పుణ్యం కారణంగానే మనిషి ధనవంతుడౌతాడా?

**దాదాశ్రీ:** ధనవంతుడు అవటానికి పుణ్యం కావలసిందే. పుణ్యంతోనే డబ్బు వస్తుంది.

**ప్రశ్నకర్త:** డబ్బులు సంపాదించటానికి బుద్ధి అవసరం పడుతుందని రాసారు.

**దాదాశ్రీ:** లేదు. బుద్ధి లాభం, నష్టం ఈ రెండే చూస్తుంది. ఎక్కడకు పోయినా లాభం నష్టం అనేవే అది చూపిస్తుంది. అది డబ్బులు గిబ్బులు అవేమీ ఇవ్వదు. బుద్ధే గనక డబ్బు ఇస్తున్నట్లయితే ఈ భూలేశ్వర్ (ముంబైలో ఒక ప్రాంతం) లో ఇంతమంది బుద్ధిశాలి గుమస్తాలున్నారే, వాళ్ళకి సేఠ్‌లకు అర్థం కాని విషయాలు కూడా అర్థమౌతాయి. కానీ పాపం వాళ్ళ చెప్పులు సగం అరిగిపోయివుంటాయి. సేఠ్ అయితే మూడువందల యాభై రూపాయల బూట్లు వేసుకుని తిరుగుతుంటాడు. అయినా మూర్ఖుడిగానే ఉంటాడు.

డబ్బు సంపాదించాలంటే పుణ్యం అవసరం పడుతుంది. దానికి వ్యతిరేకంగా బుద్ధితో పాపం చుట్టుకుంటుంది. బుద్ధిని ఉపయోగించి సంపాదనకు పోతే పాపమే అంటుకుంటుంది. నాలో బుద్ధి అనేది లేదు కనకు నాకు పాపం అంటుకోదు. నాలో బుద్ధి ఒక సెంట్ పర్సెంట్ అయినా లేదు.

## లక్ష్మి ఎవరి వెనుక పడుతుంది?

లక్ష్మీదేవి పుణ్యశాలుల వెనకాలే తిరుగుతుంటుంది, శ్రామికులు లక్ష్మీదేవి వెనక తిరుగుతుంటారు. అందువలన పుణ్యముంటే లక్ష్మీదేవి వెనకనే వస్తుందన్నది మనం తెలుసుకోవాలి. కష్టంతో దొరికేది రొట్టెలు, భోజనం, ఒకవేళ ఒకరిద్దరు కూతుళ్ళుంటే వాళ్ళ పెళ్ళిళ్ళు అవుతాయి. అవికాక పుణ్యం లేకుండా లక్ష్మీకటాక్షం లభించదు. అందువలన వాస్తవం చెప్పేదేమిటంటే, 'నువ్వు పుణ్యశాలివే అయితే ఎందుకు ఆందోళనపడతావు? నీవు ఒకవేళ పుణ్యశాలివి కాకపోతే కూడా ఎందుకు ఆందోళనపడతావు?

పుణ్యశాలి అంటే ఎలా ఉంటారు? దాన్ని ఉపయోగించుకునేవాడు కూడా ఆఫీసు నుంచి అలసిపోయి ఇంటికి వస్తే, అమ్మగారు, 'గంటన్నర లేటయింది ఎక్కడికి పోయావు?' అంటుంది. చూడా పుణ్యశాలిని! పుణ్యవంతుడికి అలా జరుగతుందా? పుణ్యవంతునికి వ్యతిరేకమైన గాలి కూడా వీచదు. చిన్నప్పటి నుంచి ఆ క్వాలిటీయే వేరుగా ఉంటుంది. అవమాన యోగమే ఉండదు. ఎక్కడికి పోతే అక్కడ, 'రా భాయ్ రా భాయ్' అనిపించుకుంటూనే పెద్దవుతాడు. ఇలాంటివాళ్ళు అక్కడక్కడ తగులుతుంటారు. ఏమిటి దాని అర్థం? పుణ్యం కాస్తా తరిగిపోతే, తిరిగి అదే పాత పరిస్థితి. అందువలన నీవు పుణ్యవంతుడివి కాకపోతే, రాత్రంతా పట్టా తీసుకుని తిరిగినా ఉదయానికి యాభై రూపాయలైనా దొరుకుతాయా? అందువలన గాభరాపడొద్దు. దొరికినదానితో తిను తాగు, మాట్లాడకుండా పడుకుని నిద్రపో.

**ప్రశ్నకర్త:** అది ప్రారబ్ధవాదం అవుతుంది కదా?

**దాదాశ్రీ:** కాదు. ప్రారబ్ధవాదం కాదు. నీ తరపు నుంచి చేయగలిగిన పని చెయ్యి. కష్టపడి తిను. ఇక వేరే గాభరా ఆందోళనలు ఎందుకు పడతావు? ఇలా పోగుచేసుకోనా అలా పోగుచేసుకోనా అని! నీకు ఇంట్లోనే మర్యాద లేక, బయటా మర్యాద లేకపోతే ఎందుకు మరి ఆరాటపడటం? ఎక్కడికి పోయినా, 'రా రా కూర్చో' అని అనేవాళ్ళుండేంత పుణ్యం తీసుకునివచ్చుంటే ఆ మాటే వేరు కదా?

ఈ సేర్ జీవితమంతటికీ ఇరవై ఐదు లక్షలు తీసుకునివచ్చుంటే, అతను ఇరవై ఐదు లక్షలను ఇరవై రెండు లక్షలు చేస్తాడు కాని పెంచడు. ఎప్పుడు పెంచుతాడు? ఎల్లప్పుడూ ధర్మం పాటిస్తుంటే. కానీ తను లోపల కలుగజేసుకోవటానికి పోతే, అంతా చెడిపోతుంది. ప్రకృతి ధర్మంలో కలుగజేసుకుంటే చెడుతుంది అంతా. లక్ష్మీ వస్తుంది కాని ఏమీ చేతికి రాదు.

## పుణ్యశాలుల ర్యాంక్

పెద్ద పెద్ద చక్రవర్తులుండేవారు, వాళ్ళకి రాత్రా పగలా అనే తేడా ఉండదు. వాళ్ళు సూర్యనారాయణుని చూడనే చూడరు. కానీ పెద్ద రాజ్యాన్ని ఏలుతుంటారు. ఎందుకంటే పుణ్యమే అక్కడ పనిచేస్తుంది.

**ప్రశ్నకర్త:** శాలిభద్ర సేఠుకి పైనుంచి దేవీదేవతలు బంగారు నాణాలున్న పెట్టెలను అందించేవారట, అది నిజమేనా?

**దాదాశ్రీ:** ఔను ఇస్తారు. అన్నీ ఇస్తారు. ఎందుకివ్వరు వాళ్ళ పుణ్యం ఉన్నంత వరకు? దేవీదేవతలోపాటు ఋణానుబంధం కూడా ఉంటుంది. వాళ్ళ బంధువులు అక్కడకు (దేవలోకంలో) వెళ్ళివుంటే, పుణ్యం కూడా ఉంటే వాళ్ళకేమేమి ఇవ్వరు?

పుణ్యశాలులకు తక్కువ కష్టపడ్డా, అంతా లభిస్తుంది ఎంత వరకు పుణ్యం ఉంటుందో. సహజమైన ఆలోచన వచ్చి, ఏ ప్రయత్నమూ చేయకపోయినా, వస్తువులన్నీ వాళ్ళ ఆలోచనకు తగ్గట్లుగానే సమకూరుతాయి. అది సహజ ప్రయత్నం. ప్రయత్నం నిమిత్తమే. కానీ ఆ సహజ ప్రయత్నాన్ని పురుషార్థం అనటం, అలా పరిభాషంతా తప్పుల తడకైంది.

లక్ష్మి అంటే పుణ్యాత్ముల పని. పుణ్యం లెక్క ఎలా ఉంటుందంటే, బాగా కష్టపడితే, కొద్దిగా లభిస్తుంది. దాన్ని చాల కొద్ది సాధారణ పుణ్యమని అంటారు. ఇక శారీరక కష్టం ఎక్కువగా చేయకుండా, ఎక్కువగా మాటల్లోనే కష్టపడుతూ, వకీళ్ళలాగా ఉంటే వాళ్ళని కాస్త ఎక్కువ పుణ్యాత్ములు అనవచ్చు. కాయకష్టంతో పోలిస్తే దానికంటే ఎక్కువ కాదు కదా? మాట్లాడే పని కూడా లేకుండా, శారీరక కష్టంతో పని లేకుండా, మానసిక కష్టంతోనే సంపాదించేవారు అధిక పుణ్యాత్ములు అనబడతారు. అంతకంటే ఎక్కువ ఎవరో తెలుసా? సంకల్పం చేసుకుంటూనే పొందేవారు. సంకల్పం చేసుకోవటమే వారు చేసే కష్టం. రెండు బంగళాలు, ఒక గోదాము అని సంకల్పం చేసుకుంటే చాలు అంతా సిద్ధమైపోతుంది. అలాంటి మనిషి మహా పుణ్యాత్ముడు. సంకల్పం చేసుకోవటమే అతను పడే కష్టం. సంకల్పమైతే చేసుకోవాలి. చాల తక్కువ కష్టం. ఏదో ఒకటి ఉండాలి కదా.

**ప్రశ్నకర్త:** కానీ, మనుషులలో అలాంటివారు ఉండరనుకుంటా.

**దాదాశ్రీ:** మనుషులలో కూడా ఉంటారు. ఎందుకుండరు? మనుషుల్లో కూడా కోరుకున్నంత వస్తుంది.

**ప్రశ్నకర్త:** దేవలోకంలో అలా జరుగుతుందని అంటారు

**దాదాశ్రీ:** దేవలోకంలో అంతా సిద్ధిస్తుంది. కానీ, ఇక్కడ కూడా కొందరికి సంకల్పసిద్ధి ఉంటుంది. అంతా ఔతుంది. పుణ్యం ఉండాలి అంతే. పుణ్యం లేదు. పుణ్యం తక్కువైపోయింది.

ఎంత కష్టపడితే అంత అంతరాయం. ఎందుకంటే, ఎందుకలా కష్టపడాల్సి వస్తోంది?

అంటే ఈ జగత్తులో, అందరికంటే ఎక్కువ పుణ్యాత్ముడు ఎవరు? అతనికి ఏమాత్రం ఆలోచన వచ్చి ఒక నిర్ణయం తీసుకున్నా, సంవత్సరాల తరబడి ఎటువంటి కోరిక లేకుండా కష్టపడకుండా అన్నీ సమకూరుతుంటాయి. రెండవ నంబరులో, కోరిక ఉంటుంది, మళ్ళీ మళ్ళీ నిర్ణయం చేసుకుంటూవుంటాడు, సాయంత్రానికి అది సహజంగానే లభిస్తుందే అతను. మూడవ నంబరతను, కోరిక ఉంటుంది, ప్రయత్నంతో అది ప్రాప్తిస్తుంది. నాల్గవ నంబరతనికి కోరిక ఉంటుంది, చాల ఎక్కువ ప్రయత్నం చేస్తే ప్రాప్తిస్తుంది. ఐదవ నంబరతనికి ఎంత అధిక ప్రయత్నం చేసినా లభించదు. కాయకష్టం చేసేవారికి చాల శ్రమించవలసివుంటుంది. పైగా తిట్లు కూడా తింటూవుంటారు. అయినా డబ్బు ఉండదు. ఒకవేళ ఉన్నా ఇంటికి పోయి తిండి తింటాడని కచ్చితంగా చెప్పలేము. వాళ్ళు అందరికంటే ఎక్కువ ప్రయత్నం చేస్తారు. అయినా ప్రాప్తించదు.

## పుణ్యంతోనే సత్సంగ ప్రాప్తి

మీరు పుణ్యం చేసుకున్నారా లేదా? అందుకే సి.ఎ. అయ్యారు.

**ప్రశ్నకర్త:** ఇప్పటివరకు పాపం చెయ్యలేదు. పుణ్యమే చేసాను.

**దాదాశ్రీ:** అలా అనిపిస్తుంది. పాపం కూడా చేస్తారు కాని, పాపం తక్కువగా చేసివుంటారు, పుణ్యం ఎక్కువ చేసివుంటారు. అందుకే, ఈ సత్సంగంలోకి

రావటానికి టైం దొరికింది. ఇక్కడికి రాగలిగారు. లేకపోతే సత్సంగంలోకి వచ్చే టైం ఎవరికి ఉంటుంది?

## పుణ్యపాపాల పరిణామ స్వరూపం....

**ప్రశ్నకర్త:** పాపపుణ్యాలతో అతని సంబంధం ఎలా ఉంటుంది?

**దాదాశ్రీ:** ఇది పాపమే అతను, మీరు ఇక్కడకు వచ్చారు కదా, ఇక్కడ మీరు ఎవరికీ తగలకుండా జాగ్రత్తగా నడుస్తారు. ఒకరికొకరు తగిలే పరిస్థితి ఉంటే, చాల ఎక్కువ రద్దీగా ఉంటే, ఎవరికీ తగలకూడదు అని మనసులో ఆలోచన ఉంటే మంచిది. అటువంటి భావనతో ఇక్కడకు వస్తే మీకు పుణ్యమే లభిస్తుంది.

కాని, ఇక్కడ రద్దీగా ఉంది కనుక ఎవరికైనా తగులుతుంది అనే భావనతో వస్తే, పాపం చుట్టుకుంటుంది.

ఎవరికైనా మీ వలన ఏ కాస్త బాధ కలిగినా, అది పాపాన్నే కలిగిస్తుంది. మీ వలన ఎవరికైనా సుఖం, శాంతి లభిస్తే, హృదయానికి ఆహ్లాదం కలిగితే మీకు శుద్ధమైన పుణ్యం కలుగుతుంది.

ఇప్పుడీ పూర్వం నుంచే వస్తున్న పాపాలు, ఈ జన్మలో తిరిగి పైకి వస్తాయి. ప్రణాళిక పూర్వ జన్మలో జరుగుతుంది, అది ఈ జన్మలో ఫలిస్తుంది.

పాపం పండినప్పుడు, రోజంతా ఆలోచనలు, చెడు ఆలోచనలు వస్తుంటాయి, బయట కూడా నష్టం జరుగుతూవుంటుంది. పిల్లలు వ్యతిరేకిస్తుంటారు. పార్టనర్‌తో దెబ్బలాట జరుగుతుంది- పాపం పండిన సమయంలో. మరి పుణ్యం పండినప్పుడు, శత్రువయినా కూడా వచ్చి, 'అరె, చందూభాయ్, ఏమైనా పనుంటే నాకు చెప్పు...' అంటాడు. అరె, నువ్వు శత్రువువి! అంటే అప్పుడు మీ పుణ్యం ఫలించిందన్నమాట. అందుకే పుణ్యం ఫలించినపుడు శత్రువు కూడా మిత్రుడౌతాడు. పాపం పండినపుడు కొడుకు కూడా శత్రువౌతాడు. ఏ కొడుకైనా తండ్రి మీద దావా వేస్తాడా?

**ప్రశ్నకర్త:** వేస్తాడు కదా.

**దాదాశ్రీ:** అరె, ఒక వ్యక్తి తన తండ్రి మీద దావా వేసాడు. అతనింకా ఏమేం చేసాడు? అతను దావా వేసిన తర్వాత వకీలుతో, తండ్రి ఓడిపోతే ఏం పరవాలేదు, ఇప్పుడు బాగుంది, ఇదిగో, మీ మూడు వందల రూపాయల ఫీజు, ఈ ఒక్కసారికి ఇలా కానీ అంటాడు. 'ఎందుకు, ఇప్పుడెందుకు?' అని అంటే, 'పరువు పోవాలి' అంటాడు. ఓరి వెధవా, తండ్రి పరువు తీస్తావా? అప్పుడు, 'దాని కోసం నేను నూట యాభై ఎక్కువ ఇస్తాను' అని అంటాడు. అక్కడ దావా వేసాడు, పరువు తీసాడు. అంటే మన తప్పు ఉన్నపుడు, పాపం పండినపుడు, కొడుకు కూడా శత్రువు ఔతాడు.

## పరమ మిత్రుడెవరు?

పుణ్యం బావుంటే అంతా బావుంటుంది. అందుకే పుణ్యవశాన మిత్రులుంటే, ఎక్కడకు పోతే అక్కడ సుఖమే సుఖం ఉంటుంది. అతను మిత్రుడైయ్యుండాలి. పాపవశాన వచ్చే మిత్రుడు ఎదురుదెబ్బ తీయక మానడు. ఇక సమభావంతో పని నెరవేర్చటం సాధ్యం కాదు కనుక, అరిచి చెప్పవలసివస్తుంది.

**ప్రశ్నకర్త:** ఎక్కడకు పోయినా, పుణ్యం మిత్రుడిలా పనిచేస్తుందని మీరు అన్నారు...

**దాదాశ్రీ:** ఔను. ఎంతటి ప్రతికూలమైన చోటయినా మీకు, మీరు ఎక్కడైనా ఇరుక్కుపోయినా, అక్కడ పుణ్యం మీకు అనుకూలంగా చేయటానికి ముందుకు వస్తుంది.

**ప్రశ్నకర్త:** పాపం ఉంటే, ఇంట్లో కూడా బాధే పెడుతుంది.

**దాదాశ్రీ:** పాపం అనేది ఇంట్లో పక్కలో పడుకుని ఉన్నపుడు కూడా దెబ్బ తీస్తుంది. పక్కలో పడుకుని ఉన్నపుడు కూడా చింత కలుగజేస్తుంది. మంచి ఫస్ట్‌క్లాస్ పక్క వేసినా, దాని మీద కూడా చింతాక్రాంతుడౌతాడు. పాపం వదిలిపెట్టదు! అందుకే సంత్‌లు, పాపానికి భయపడు అని చెప్పారు.

## మోక్షానికి వెళ్ళటానికి ఎటువంటి పుణ్యం అవసరం?

**ప్రశ్నకర్త:** మోక్షమార్గంలోకి రానంత వరకు, పుణ్యమనే గైడ్ అవసరం పడుతుంది కదా?

**దాదాశ్రీ:** ఔను. ఆ పుణ్యం గైడ్ కోసమే మనుషులు శుభాశుభాలలో పడ్డారు కదా! ఆ గైడ్‌ని అందరూ కలుస్తారు. కానీ మోక్ష మార్గంలోకి పోయేందుకు అవసరమైన పుణ్యం ఉంటుందే, అలాంటి పుణ్యంతో పని లేదు. మోక్షానికి పోయేవారికి పుణ్యం ఎలా ఉంటుంది? అతనికి ఈ జగత్తులో సూర్యనారాయణుడు ఉదయించినా ఉదయించకపోయినా అతనికి తెలియదు. జీవితమంతా గడిచిపోతుంది- అలాంటి పుణ్యం ఉంటుంది. ఇక అలాంటి చెత్త పుణ్యంతో ఏం చేసుకోవాలి?

## పాపం ఎన్నటికీ మైనస్ అవదు

**ప్రశ్నకర్త:** ఈ మార్గం దొరకనంత వరకు పుణ్యం అవసరం ఉంటుంది కదా?

**దాదాశ్రీ:** ఔను. అది నిజమే. అక్కడ వాళ్ళ దగ్గర శుద్ధమైన పుణ్యం ఎక్కడుంది? ఏమాత్రం లేదు. ఎందుకంటే మీ కోరిక ఏమిటి అని అడిగితే మీరు, పుణ్యం చేస్తే పాపం తలెత్తదిక అనుకుంటారు. కాని భగవాన్ ఏమంటారో తెలుసా? నువ్వు వంద రూపాయల పుణ్యం సంపాదిస్తే నీ ఖాతాలో వంద రూపాయలు జమ అయ్యాయి. ఆ తర్వాత రెండు రూపాయల పాపం చేసావనుకో అంటే, ఎదుటివారిని 'పక్కకు తప్పుకో దూరంగా పో' అన్నావనుకో, అందులో కాస్తంత తిరస్కార భావం వచ్చేసింది. ఇప్పుడు దాని వలన అప్పు జమ అవదు. భగవాన్ అంటే పచ్చి మాయ కాదు. ఒకవేళ పుణ్యం, పాపం రెండూ జమ-అప్పు అయినట్లయితే ఇక్కడ ఈ వ్యాపారులకు ఏమాత్రం దుఃఖమనేదే ఉండగూడదు. కానీ వీళ్ళు సుఖాలను అనుభవిస్తున్నారు, దుఃఖాలనూ అనుభవిస్తున్నారు. భగవాన్ అలా చాలా పక్కా.

**ప్రశ్నకర్త:** మనిషి పుణ్య మార్గంలో పోతే పాపం ఎందుకు చుట్టుకుంటుంది?

**దాదాశ్రీ:** ఈ నియమం ఎల్లప్పుడూ ఎలా ఉంటుందంటే, మీరు ఏ కార్యం చేసినా, అది పుణ్య కార్యమైతే మీకు వంద రూపాయలు జమ అవుతాయి. పాప కార్యమైతే ఎంత కొద్దిగా ఉన్నా, ఒక రూపాయే అయినా, అది మీ ఖాతాలో అప్పుగా నిలిచిపోతుంది. కానీ ఆ వంద రూపాయలలో నుంచి ఒక్క రూపాయి కూడా తగ్గదు. అలా తగ్గినట్లయితే, ఎవరికీ పాపమనేదే అంటుకోదు. అంటే రెండూ వేరువేరుగానే ఉంటాయి. పాపం పండినపుడు అది చేదు అనుభవాన్నిస్తుంది.

పుణ్యం లోంచి పాపం తగ్గటం అనేది ఉండదు. అలా తగ్గినట్లయితే మనుషులకు ఇక పంటే కదా. దుఃఖమనేదే ఉండదిక. ఒక కొడుకు కాని కూతురు కాని చనిపోవటమనేదే ఉండదు. పనివాడు దొంగతనం చేయడు. ఏమీ చెయ్యరు. హాయిగా ఉంటారు. పుణ్యం చుట్టూ ఉన్నపుడే కార్లలో షికార్లు కొడుతూ సరదాగా జీవిస్తారు. అలాగే పాపం చుట్టుముట్టినపుడు అదే కారుకి యాక్సిడెంట్ చేయిస్తుంది. అదంతా అలా చుట్టుకుంటుంది. లోపల ఉన్న సరుకంతా చుట్టుముట్టుతుంటుంది. లేకపోతే ఎక్కడి నుండి వచ్చి చుట్టుముట్టుతుంది? ఏదైతే ఉందో అదే మీ లెక్క. అందులో మార్పనేదేమీ ఉండదు.

## తెలియక చేసిన పాపం సంగతేమిటి?

**ప్రశ్నకర్త:** కానీ, నేను పాపం చేసానో, పుణ్యం చేసానో నాకు తెలియకపోయినా పాపపుణ్యాలు చుట్టుకుంటాయా? అతనికి తను ఈ పాపాలు చేసాడు, ఈయీ పుణ్యాలు చేసాడు అన్నది తెలియకనేపోతే వాటి ప్రభావం అసలు ఉండనే వుండదు కదా?

**దాదాశ్రీ:** ప్రకృతి నియమం ఎలా ఉంటుందంటే, మీకు దాని సంగతి తెలిసినా తెలియకపోయినా, దాని ప్రభావం పడక మానదు. మీరు ఈ చెట్టుని నరికారు, మీకు అది పాపమో పుణ్యమో తెలియదనుకుందాం, అయినా ఆ చెట్టుకి దుఃఖం కలుగుతుందా లేదా? అందుకే మీకు పాపం తగులుతుంది. మీరు నాలుగు గంటలు లైన్‌లో నిలబడి రేషన్‌లో కంట్రోల్‌లోని పంచదార సంచీ తీసుకుని వెళ్తుంటే, ఆ సంచికి ఒక కన్నం ఉండటంతో అందులోంచి పంచదార కారిపోతే, ఆ పంచదార

ఎవరికైనా పనికొస్తుందా లేదా? కింద చీమలుంటాయి. అవి తీసుకునిపోతుంటాయి. ఇక అది మీరు వాటికి దానం చేసారని చెప్పవచ్చు. మీకు అర్థం కాకపోయినా అది దానం చెయ్యటమే అయింది కదా? మీకు అది తెలియకపోవచ్చు కానీ దానమైతే జరిగింది కదా? చీమలకు సుఖం కలిగింది కదా? దాని వలన మీకు పుణ్యం లభిస్తుంది.

తెలియక పాపం చేసినట్లయితే దాని ఫలితం ఏమీ రాదు అని చాల మంది అంటూవుంటారు. ఎందుకు రాదు? ఓరి మూర్ఖుడా, తెలియక నిప్పుల మీద చెయివేస్తే తెలిస్తుంది ఫలితం వస్తుందో రాదో! తెలిసి చేసిన పాపం, తెలియక చేసిన పాపం రెండూ సమానమే. కాని తెలియక చేసిన పాపం తెలియకుండా, తెలిసి చేసిన పాపం తెలిసేటట్లుగా అనుభవించవలసివుంటుంది. అదే వాటిలో తేడా. అంతే, అదే పద్ధతి. ఇదంతా నియమానుసారం జరుగుతుంది. ఈ జగత్తు అంతా నియమానుసారంగా, న్యాయ స్వరూపంగా ఉంది.

తెలియకుండా జరిగిన తప్పుకి ఫలితం మీకు తెలియకుండానే జరుగుతుంది. మీకు అర్థమయేట్టుగా చెప్తాను.

ఒకడు ఏడు సంవత్సరాలు రాజ్యాన్ని ఏలుతాడు. మరొకడు కూడా ఏడు సంవత్సరాలు రాజ్యం చేస్తాడు. ఇద్దరూ రాజ్యం చేయటం సమానంగా ఉంది. రాజ్యాలు రెండూ కూడా సమానమే. కానీ అందులో ఒక మనిషి తన మూడు సంవత్సరాల వయసులో గద్దె ఎక్కుతాడు, పది సంవత్సరాల వయసు వచ్చేసరికి రాజ్యం పోతుంది. రెండవవాడు ఇరవై సంవత్సరాల వయసులో గద్దె ఎక్కుతాడు, ఇరవై ఏడు సంవత్సరాల వయసులో గద్దె దిగుతాడు. ఎవరు నిజంగా రాజ్యాన్ని అనుభవించినట్లు? మొదటివాడిది బాల్యంలోనే పోయింది. అతనికి ఆట బొమ్మనిస్తే దాన్నే ఆడుతూ కూర్చుంటాడు.

అందువలన, అది తెలియకుండా వచ్చిన పుణ్యఫలం. అర్థం చేసుకోకుండానే దర్శనం చేసుకుంటే, అర్థం చేసుకోకుండానే ఫలితాన్ని అనుభవించాడు. అర్థం చేసుకుని చేసిన పుణ్యఫలాన్ని అర్థం చేసుకునే భోగిస్తాడు.

అదే విధంగా జాగృత మైండ్‌తో చేసిన పాప ఫలితాన్ని జాగృతిలోనే అనుభవించవలసివస్తుంది. జాగృతిలో లేకుండా చేసిన పాపాన్ని జాగృతి లేకుండానే

అనుభవిస్తారు. మూడు సంవత్సరాల ప్రాయంలో తల్లి చనిపోతే ఏడవటం ఉండదు. వాడికి తెలియనుకూడా తెలియదు. అక్కడ ఏం చెయ్యాలో కూడా అర్థం చేసుకోలేడు. ఒకవేళ పాతిక సంవత్సరాల వయసులో అమ్మ చనిపోతే? అంటే అక్కడ అర్థం చేసుకుని దుఃఖాన్ని అనుభవిస్తాడు. చిన్నపిల్లవాడు తెలియకుండా దుఃఖాన్ని అనుభవిస్తాడు.

## తప్పు సేర్‌దా లేక అతని పాపాలదా?

సేఠ్ ఇనామ్‌లు ఇస్తుంటాడు. అది తన వ్యవస్థితం. ఆ వ్యవస్థితం తలకిందులైతే అప్పుడు సేఠ్ మనసులో, ఈ సారి ఇతని జీతం నుంచి కట్ చేయాలి అనిపిస్తుంది. ఇక సేఠ్ జీతంలో కట్‌చేస్తే నౌకరు మనసులో, ఈ సేఠ్ చాల చెడ్డవాడు అనే ఆలోచన వస్తుంది. నాకీ చెడ్డవాడు దొరికాడు అనుకుంటాడు. కానీ అలా గుణించుకునే వ్యక్తికి తెలియనిదేమిటంటే, అతను చెడ్డవాడే అయితే ఇనామ్ ఎందుకు ఇస్తాడు. అందువలన అదేమీ తప్పు కాదు. సేఠ్ చెడ్డవాడు కాదు. ఇక్కడ తన 'వ్యవస్థితం' లో మార్పు వచ్చింది.

పుణ్యం నడుస్తూ ఉంటుంది. నీకు వెయ్యి రూపాయల జీతం ఎవరిస్తారు? నీకు జీతమిచ్చే నీ సేఠ్ కూడా పుణ్యం ఆధీనంలోనే ఉంటాడు. పాపం చుట్టుముట్టినపుడు పనివాళ్ళు కూడా సేఠ్‌ని దెబ్బతీస్తారు.

## పుణ్యంలోను పాపంలోను జాగృతి

**ప్రశ్నకర్త:** సంపత్తి లభించిందంటే వాళ్ళు పుణ్యం చేసుకోవటంవలనే అయ్యుంటుంది.

**దాదాశ్రీ:** అదంతా పుణ్యమే కదా. గొప్ప పుణ్యం. కాకపోతే సంపత్తిని కాపాడుకోవటం కష్టమౌతుంది.

**ప్రశ్నకర్త:** అందువలన అది సరే. ఉపాధి కూడా ఉంది కదా? ప్రారంభం అక్కడి నుంచే జరుగుతుంది.

**దాదాశ్రీ:** సంపత్తి లేదూ అంటే దానంత మరేదీ ఉండదు.

**ప్రశ్నకర్త:** డబ్బు లేదు, సంపత్తి లేదు అంటే దానంత మరేమీ ఉండదా?

**దాదాశ్రీ:** ఔను దానంత మరేదీ ఉండదు. సంపత్తి ఉపాధి. సంపత్తి ధర్మకార్యాల వైపు మళ్ళిందంటే పరవాలేదు. లేకపోతే అది ఉపాధి అవుతుంది. ఎవరికివ్వాలి? ఇప్పుడు దాన్ని ఎక్కడ పెట్టుకోవాలి? అదంతా ఉపాధి అయిపోతుంది.

అందువలన చాల ఎక్కువ పుణ్యం కూడా పనికిరాదు. పుణ్యం కూడా సమతౌల్యంగా ఉంటే మంచిది. ఎక్కువ పుణ్యం ఉంటే శరీరం ఇంత లావెక్కుతుంది. ఏం చేసుకోవాలి దాన్ని? ఎన్ని కిలోల శరీరం? మనం మోస్తాం, మంచం కూడా మోయాల్సివస్తుంది కదా? ఆ మంచం అబ్బ అమ్మ అంటుంది కదా?

**ప్రశ్నకర్త:** పాపం, పుణ్యం పండినపుడు, అతని జీవితంలోని సంఘటనల మీద ఏమైనా ప్రభావం పడుతుందా? అందుకు ఏమైనా ఉదాహరణతో చెప్పండి.

**దాదాశ్రీ:** పాపం పండితే, ముందుగా జాబ్ (ఉద్యోగం) పోతుంది. తర్వాత ఏమౌతుంది? వైఫ్, కొడుకు ఉంటే, అక్కడ స్టోర్‌కి వెళ్ళటానికి డబ్బులు అడుగుతారు. ఆ అలవాటు ముందునుంచే ఉంది. దాన్నిబట్టే అడుగుతారు, రెండు వందల డాలర్లు ఇవ్వండి అని. దానితో కలహం మొదలు. ఇక్కడేమో ఉద్యోగం లేదు, ఎందుకలా గొడవపెడుతుంది అనవసరంగా? రెండొందలు రెండొందల డాలర్లు ఖర్చు చేయాలా? ఇలా అంతా నెమ్మదిగా మొదలౌతుంది. అలా రోజూ కలహాలు. ఇక భార్య, బ్యాంక్ నుంచి తీసుకునివచ్చి ఇవ్వవా? అంటుంది. అప్పుడు బ్యాంక్‌లో కొద్దిగా ఉంచుకోవాలా వద్దా? ఇక్కడ దీనికి అద్దె కట్టాలి. అదంతా చెయ్యొద్దా? బ్యాంక్‌లో డబ్బులు కట్టొద్దా? కానీ భార్య గొడవపెడుతుంది, మెదడు వెడెక్కేటట్టుగా గొడవపెడుతుంది. ఇవన్నీ రాత్రిళ్ళు నిద్ర కూడా పోనివ్వవు. ఇక్కడ అమెరికాలో ఎందరికి ఇలాంటి అనుభవం కలిగివుంటుంది? పైగా వెధవ, కర్కశుడు అని, అలాంటి మాటలు అంటారు. అంటే ఎంత వీలయితే అంత కఠోరమైన పదాలను వాడుతారు. వదిలిపెట్టదు కదా? అతన్ని వేధిస్తూనేవుంటుంది. పాపం అతనికి ఒక పక్క

ఉద్యోగం పోయింది, ఏం చెయ్యాలో తెలియటం లేదు, మెదడు సరిగ్గా పనిచేయటం లేదు, అది కాకుండా ఈమె గొడవ ఒకటి. అలా జరుగుతుందా లేదా?

**ప్రశ్నకర్త:** జరుగుతుంది, జరుగుతుంది.

**దాదాశ్రీ:** ఏదో కొన్ని చోట్ల జరుగుతుందా లేక చాలాచోట్ల జరుగుతుందా? జాబ్ పోయిన తర్వాత నన్ను కలుస్తారు. 'దాదా జాబ్ పోయింది. ఏం చెయ్యాలి?' అంటారు.

ఆ జాబ్ పోయిన తర్వాత రోజులు బాగానే నడుస్తుంటే అతను వివేకవంతుడు అనిపించుకుంటాడు. భార్య తను కూడా రోజులు బాగా గడుపుతుంటే వాళ్ళు వివేకవంతులు. కొత్త బట్టలు కొనుక్కోరు, ఉన్న పాత బట్టలనే వేసుకుంటారు. మళ్ళీ ఉద్యోగం దొరకనంత వరకు అలాగే టైమ్ గడిపేస్తుంటారు. భర్తలు ఉత్సాహంగా ఉండటం అవసరం. ఉద్యోగం పోయిందని భయపడకూడదు. ఏ గడ్డో పీకి లేక ఏదైనా పని చేసి సాయంత్రానికి పది, ఇరవై డాలర్లు తెచ్చుకుంటే చాలు. తక్కువైతే పడదు కదా. అలా చెప్తే, కాదు మమ్మల్ని చూసి మిగతావాళ్ళు ఏమనుకుంటారు అంటారు. అరె మూర్ఖుడా, ఇతరుల దగ్గర జాబ్ ఉంది, నీ దగ్గర జాబ్ లేదు. ముందు నువు దాని సంగతి ఆలోచించు. ఎవరి గొప్పా గౌరవాలు ప్రపంచంలో నిలిచిపోలేదు. అందరూ బట్టలు వేసుకున్నారు కనుక గౌరవంగా కనిపిస్తారు. ఆ బట్టలు తీసేస్తే అందరూ నగ్నంగా కనిపిస్తారు. కేవలం జ్ఞానిపురుష్ మాత్రమే బట్టలు తీసేసినా కూడా నగ్నంగా కనపడడు. మిగతా జగత్తంతా నగ్నంగానే ఉంది.

**ప్రశ్నకర్త:** ఒక పక్క జాబ్ పోయింది, రెండవ పక్క దాదాని కలవటం జరిగితే పాపం, పుణ్యం రెండూ ఒక దగ్గరికి వచ్చి చేరినట్లా?

**దాదాశ్రీ:** పాపం మంచిగానే వచ్చింది కనుక దాదా కలిసారు. అందువలన దాదా, మనం పాపం పండినపుడు ఏం చెయ్యాలి అన్నది చెప్తారు, అంతా ఒక కొలిక్కి తీసుకునివస్తారు. పుణ్యం పండి దాదా కలిస్తే, అప్పుడు దాదా నుంచి తీసుకోవటానికి ఏమైనా ఉంటుందా? పాప ఫలితం అనుభవిస్తున్నపుడు దాదా, చూడు భాయ్ ఇలా చెయ్యి, అలా చెయ్యి అని చెప్పి అంతా కొలిక్కి తీసుకుని

వస్తారు. అంటే, పాపం పండినపుడు దాదా కలవటమనేది చాల మంచి పరిణామం అని చెప్పవచ్చు.

## బుద్ధి ఆశయ రహస్యం

ప్రతి మనిషికి తన ఇంట్లో ఆనందంగా ఉంటుంది. గుడిసెలో ఉండేవాళ్ళకి బంగళాలో ఆనందం రాదు, బంగళాలో ఉండేవాళ్ళకి గుడిసెలో ఆనందం రాదు. అందుకు కారణం వాళ్ళ బుద్ధికున్న ఆశయం. ఎవరు ఏ విధంగా తన బుద్ధిలో ఆశయాన్ని నింపుకుని వస్తారో, వాళ్ళకి అలాగే దొరుకుతుంది. బుద్ధి ఆశయంలో నిండివున్నదాని రెండు ఫొటోలను తీస్తుంది. 1. పాప ఫలం, 2. పుణ్య ఫలం. బుద్ధి ఆశయాన్ని ప్రతివారూ రెండు భాగాలుగా చేసారు. ఆ నూరు శాతంలోంచి ఎక్కువ శాతం కారు, బంగళా, భార్య, సంతానం, వీళ్ళ గురించి నిండిపోయి వుంది. కాబట్టి వాటిని పొందేందుకు పుణ్యం ఖర్చయింది. తర్వాత ధర్మం కోసం కష్టం మీద బుద్ధి ఆశయంలో ఒకటి రెండు శాతం మాత్రమే నిండి వుంది.

**ప్రశ్నకర్త:** బుద్ధి ఆశయాన్ని కాస్త విశేషంగా వివరించండి దాదా.

**దాదాశ్రీ:** బుద్ధి ఆశయం అంటే, 'నేను దొంగతనం చేసే గడపాలి. నల్ల బజారులోనే గడపాలి' అనేది. కొందరు, 'ఇప్పుడు నేను దొంగతనం ఎప్పటికీ చెయ్యను' అని అంటే, కొందరు 'నేను ఇలా భోగించాలి' అంటారు. అలా భోగించటానికి అతను ఏకాంత ప్రదేశాన్ని కూడా తయారుచేసుకుంటాడు. అందులో పాపం, పుణ్యం పనిచేస్తాయి. భోగించాలనే ఇచ్ఛ ఎలా ఉంటే అలా అంతా అతనికి లభిస్తుంది. ఎందుకంటే అతని బుద్ధి ఆశయంలో అలా ఉంది కనుక. ఇక పుణ్యం పని చేసినట్లయితే మరి అతన్ని పట్టుకోవటం కష్టం- ఎంత కాపుకాసినా సరే! తర్వాత పుణ్యం అయిపోతే, ఇక తేలిగ్గానే పట్టుబడతాడు. చిన్న పిల్లవాడైనా అతన్ని వెతికి పట్టుకుంటాడు, 'ఇక్కడ ఇలా మోసం జరుగుతోంది' అంటూ.

ఇద్దరు దొంగలు దొంగతనం చేస్తుంటారు. అందులో ఒకడు పట్టుబడతాడు, రెండవవాడు స్వేచ్ఛగా తిరుగుతుంటాడు అంటే అది ఏం సూచిస్తోంది? దొంగతనం చేయాలి అని ఇద్దరు దొంగలూ తమ బుద్ధి ఆశయంలో పట్టుకునే వచ్చారు. కానీ

అందులో పట్టుబడ్డవాడి పాప ఫలం వచ్చింది, ఖర్చయింది. కానీ తప్పించుకున్న రెండవవాడి పుణ్యం ఫలం అందులో ఖర్చయింది. అలాగే, ప్రతివారి బుద్ధి ఆశయంలో ఉన్నదేదైతే ఉందో, అందులో పాపం పుణ్యం రెండూ పనిచేస్తాయి. బుద్ధి ఆశయంలో డబ్బు సంపాదించాలన్నది నింపుకుని తెచ్చుకుంటే, డబ్బు ఎంతగానో వచ్చిపడుతుంది. రెండవది, బుద్ధి ఆశయంలో డబ్బు సంపాదించాలన్నది నింపుకుని తెచ్చుకోవటం జరిగింది కానీ, అందులో పుణ్యానికి బదులు పాపం ఎదురైతే, అతనికి లక్ష్మీదేవి ముఖం కూడా చూపించదు. అరె, ఈ లెక్క ఇంత వాడైనది కనుక ఇందులో ఎవరి ప్రమేయమూ ఏమాత్రం నడవదు. కానీ ఈ పనికిరానివాడు, నేను పది లక్షల రూపాయలు సంపాదించాను అని అనుకుంటాడు. అరె, అక్కడ పుణ్యం ఖర్చయింది. అది కూడా వ్యతిరేక మార్గంలో. దాని బదులు నీ బుద్ధి ఆశయాన్ని మార్చుకో. ధర్మం కోసమే బుద్ధి ఆశయాన్ని పెట్టుకోవాలి. జడ వస్తువులైన కారు, బంగళా, రేడియోల కోసం భజన చేయవద్దు, వాటి కోసం బుద్ధి ఆశయాన్ని పెట్టుకోవద్దు. ధర్మం కోసమే, ఆత్మ ధర్మం కోసమే బుద్ధి ఆశయాన్ని పెట్టుకో. ఇప్పుడు మీకు ప్రాప్తించింది ఏదైనా, మీ ఆశయాన్ని మార్చుకుని, సంపూర్ణంగా నూరు శాతం ధర్మం కోసమే పెట్టుకో.

నేను నా బుద్ధి ఆశయంలో తొంభైతొమ్మిది శాతం ధర్మం, లోక కళ్యాణ భావన పెట్టుకుని వచ్చాను. ఇతర చోట్లలో నా పుణ్యం ఖర్చే కాలేదు. డబ్బులు, కారు, కొడుకు, కూతురు, ఎక్కడా అవలేదు.

నన్ను కలిసి జ్ఞానం తీసుకుని వెళ్ళినవాళ్ళు రెండు, మూడు శాతం ధర్మం కోసం, ముక్తి కోసం పెట్టుకున్నారు. అందుకే మేము కలిసాము. నేను పూర్తిగా నూరు శాతం ధర్మం కోసమే కేటాయించాను. అందుకే నాకు అన్ని వైపుల నుంచి ధర్మం కోసం 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' లభించింది.

అనంత జన్మల నుంచి మోక్షానికి *నియాణాం* (పుణ్యాన్నంతటినీ ఏదైనా ఒక దాని మీదనే సంకల్పం చేసుకోవటం) చేసాను. కానీ పూర్తిగా పక్కా *నియాణాం* చేయలేదు. ఒకవేళ మోక్షం కోసమే నియాణాం చేసివుంటే, పుణ్యమంతా అందులోనే ఖర్చవుతుంది. ఆత్మ కోసం బ్రతకటమే పుణ్యం, ప్రాపంచిక విషయాల కోసం బ్రతకటం పూర్తిగా పాపం.

# పుణ్యాలను విభజన చేయటం ఇష్టం

ఈ పుణ్యం, మనం కోరుకున్నదానికి అనుగుణంగా విభజించబడుతుంది. ఒకరు, నాకు ఇంత మద్యం కావాలని, ఇలా జరగాలి, అలా జరగాలి అని కోరుకుంటారు. ఒకరేమో నాకు కారు కావాలి, ఇల్లు కావాలి అని కోరుకుంటారు. అందుకు నేను, రెండు రూములుంటే చాలని అంటారు. అప్పుడు రెండు రూములు దొరికిన సంతోషం ఉంటుంది, నడపటానికి కారు దొరుకుతుంది.

చిన్న చిన్న గుడిసెలలో నివసించేవారందరికీ సంతోషం ఉంటుందా? నిజమైన సంతోషం ఉంటుంది. అందుకే వాళ్ళకి వాళ్ళ ఇల్లు వాళ్ళకి నచ్చుతుంది. అలా ఉంటే వాళ్ళకి బావుంటుంది. ఇక ఆదివాసులను మన దగ్గరకి తీసుకునివచ్చి చూడు. నాలుగు రోజులు ఉంచుకుని చూడు. అతనికి ఇక్కడ ప్రశాంతత లభించదు. ఎందుకంటే అతని బుద్ధి ఆశయంలో ఇది ఇమడదు. ఎందుకంటే బుద్ధి ఆశయానికి అనుగుణంగానే పుణ్యం డివిజన్ జరుగుతుంది. టెండర్‌నిబట్టే ఐటమ్ వస్తుంది.

**ప్రశ్నకర్త:** పుణ్యపాపాలనుబట్టే జరుగుతున్నపుడు టెండర్ నింపవలసిన అవసరం ఎక్కడుంటుంది?

**దాదాశ్రీ:** ఈ టెండర్ నింపటమనేది పండిన పాప పుణ్యాలకు అనుగుణంగానే జరుగుతుంది. అందుకే నేను 'టెండర్' నింపమనే అంటాను. కాని దేని ఆధారంగా టెండర్ నింపటం జరుగుతుందన్నది నాకు తెలుసు. ఈ రెండూ నియమాలను దాటి జరిగేవి కావు.

నేను చాలమందికి, నా దగ్గరకు టెండర్ నింపుకుని రమ్మని చెప్తాను. కానీ ఎవరూ నింపి తేలేదు. ఎలా నింపాలి? అది పాపపుణ్యాల మీద ఆధారపడి వుంది. అందువలన పాపం పండినపుడు అటు ఇటు పరుగులు పెడితే, ఉన్నది కూడా పోతుంది. అందువలన ఇంటికి పోయి పడుకో, సాధారణంగా చేసే పనులను కొద్దికొద్దిగా చెయ్యి. పుణ్యం ఉదయించినట్లయితే ఇక తిరుగాడాల్సిన పనేముంటుంది? ఇంట్లోనే ఎదురెదురుగా కొద్దిగా పనులు చేసుకుంటూపోతుంటే, అన్నీ సమకూరుతాయి. అందువలన, రెండు పరిస్థితులలోను, పరుగులు పెట్టటం వద్దు అని చెప్తాం.

ఈ మాటలను అర్థం చేసుకోవాలంతే!

## పుణ్యమనే ఆటకి ప్రతిగా మిథ్యా ప్రయత్నమెందుకు?

ఫలితాన్నివ్వటానికి పుణ్యం సిద్ధంగా ఉన్నపుడు మిథ్యా ప్రయత్నాలో ఎందుకు పడతారు? ఒకవేళ పుణ్యం ఫలాన్నివ్వటానికి సిద్ధంగా లేకపోతే అనవసరంగా అందులో కలుగజేసుకోవటమెందుకు? సిద్ధంగా లేనపుడు నీవు అందులో కలుగజేసుకోవటం వలన ఒరిగేదేమీ ఉండదు. ఇక సిద్ధంగా ఉంటే అందులో ఎందుకు కలుగజేసు కుంటావు నువ్వు? పుణ్యం ఫలం ఇవ్వటానికి సిద్ధమైనపుడు అందులో ఆలస్యమనేదే జరగదు.

## పాపపుణ్యాల లింకు

బయటి నుంచి ఒక వ్యక్తి వ్యవహారం విషయంలో నా సలహా తీసుకునేందుకు వచ్చి, 'నేను ఎంత తల బద్దలుకొట్టుకున్నా నాతో ఏమీ అవటం లేదు' అన్నాడు. అప్పుడు నేను, 'ప్రస్తుతం నీ పాపం పనిచేస్తోంది. నువ్వు ఎవరి దగ్గరి నుంచైనా ఒక రూపాయి అప్పు తీసుకుని వస్తుంటే దార్లో నీ జేబు కట్ అవుతుంది. అందువలన ఇప్పుడు ఇంట్లో హాయిగా కూర్చుని, నీవు ఏ శాస్త్రాలు చదువుకుంటూవుంటావో వాటిని చదువుకో, భగవంతుడిని స్మరిస్తూవుండు' అన్నాను.

1968లో నేను జయగఢ్ జెట్టీని నిర్మిస్తున్నాను. అక్కడ ఒక కాంట్రాక్టర్ నా దగ్గరకు వచ్చాడు. అతను నన్ను, 'నేను మా గురువుగారి దగ్గరకు పోతూవుంటాను. ప్రతి సంవత్సరం నా డబ్బు పెరుగుతూనేవుంటుంది. నాకా కోరిక లేకపోయినా పెరుగుతూపోతుంటుంది. అయితే అది గురుకృపేనంటారా?' అని అడిగాడు. అందుకు నేను, 'అది గురు కృప అని అనుకోవద్దు. ఒకవేళ నీ డబ్బు పోతున్నట్లయితే నీకు, పద గురువుని రాళ్ళతో కొట్టాలి అనిపిస్తుంది' అన్నాను.

అందులో గురువు నిమిత్తులు. ఆయన ఆశీస్సులు నిమిత్తమాత్రం. గురువుగారు కోరుకుంటే నాలుగు అణాలు ఆయనకి దొరకవా ఏమిటి? అందువలన అతను నన్ను, 'నేనేం చెయ్యాలి?' అని అడిగితే, 'దాదా నామస్మరణ చెయ్యి' అన్నాను.

ఇప్పటివరకు నీ పుణ్యం లింకు వచ్చింది. లింకు అంటే చీకట్లో పేకముక్కలను ఎత్తితే, నాలుగు, తర్వాత ఐదు, ఆ తర్వాత ఆరు వచ్చాయి. ఇక అప్పుడందరూ, 'ఓహెూ సేఠ్‌గారు, ఓహెూ సేఠ్‌గారు, ఏమి చెప్పాలి మీ గురించి' అంటారు. అలా నీకు నూటఏడు సార్లు జరుగుతుంది. కాని ఇప్పుడు ఇక మారిపోతోంది కనుక జాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు తీసి చూస్తే యాభైఏడు తర్వాత మూడు, మూడు తర్వాత నూట పదకొండు వస్తుంది. అప్పుడంతా నిన్ను మూర్ఖుడు అని అంటారు. అందువలన దాదా నామాన్ని వదిలిపెట్టవద్దు. లేకపోతే దెబ్బతింటావు.

తర్వాత నేను ముంబై వచ్చేసాను. ఆ మనిషి రెండు మూడు రోజుల తర్వాత ఈ మాటలను మర్చిపోయాడు. తర్వాత అతనికి భారీ నష్టం ఏర్పడింది. దానితో భార్యాభర్తలిద్దరూ నల్లుల మందు తాగి చనిపోవాలనుకున్నారు! కాకపోతే అతని పుణ్యవశాత్తూ అతని తమ్ముడు డాక్టరు. అతను వచ్చాడు, ప్రాణాలను కాపాడాడు. ఇక అతను కారు వేసుకుని నా దగ్గరకు వేగంగా వచ్చాడు. నేను అతనికి, 'ఈ దాదా నామ స్మరణ చేస్తుండు. మరోసారి అలాంటి పని చెయ్యకు' అని చెప్పాను. తర్వాత అతను నామస్మరణ చేయటం ప్రారంభించాడు. అతని పాపమంతా కడిగివేయబడి, అంతా బాగుపడింది.

'దాదా' అన్నప్పుడు పాపం దరికి రాదు. నలువైపులా తిరుగుతూవుంటుంది కానీ తాకదు. మీరు ఊగిసలాడితే మాత్రం అప్పుడు పట్టుకుంటుంది. రాత్రిపూట నిద్రలో అంటుకోదు. మెలకువతో ఉన్నంతసేపు స్మరిస్తుండండి, లేవగానే తిరిగి స్మరిస్తుంటే, ఆ మధ్య సమయం ఆ స్వరూపం అనబడుతుంది.

ధర్మం బాపతు పుణ్యం ఎలాంటిదంటే, ధర్మం ప్రతి చోట సహాయపడుతూ వుంటుంది. ఎటువంటి కష్టకాలంలోనైనా సహాయపడుతుంది. అలావుంటుంది ధర్మం వలన కలిగే పుణ్యం. పుణ్యం హెల్ప్ చేస్తుంది. నా జ్ఞానం వేరే రకంగా ఉంటుంది. ప్రత్యక్ష రూపంలో ఉండే (చిత్తం దొరా అనే) జ్ఞానం.

పుణ్యమూ ఫైలే, పాపమూ ఫైలే. పుణ్యం తప్పు చేయిస్తుంది, పాపం జాగృతిలో ఉంచుతుంది. పుణ్యమైతే అందుకు వ్యతిరేకంగా ఈ ఐస్‌క్రీం తిను, ఈ ఫ్రూట్ తిను

అంటూ అన్ని రకాల తప్పులూ చేయిస్తుంది. దానిబదులు ఈ చేదు మందు తాగిస్తే జాగృతైతే ఉంటుంది కదా!

## వినియోగదారుడిని పంపేవారెవరు?

వీళ్ళంతా మోటల్ నడుపుతుంటారు కదా, అందులో, ఆ మోటల్‌లో ఎవరైనా ఉన్నట్లయితే, అలా వచ్చేవారిని పంపిస్తున్నదెవరు? మీరు మోటల్ నడుపుతుంటారు కదా, ఎవరు పంపిస్తుండవచ్చు?

**ప్రశ్నకర్త:** తెలియదు.

**దాదాశ్రీ:** అదే మీ పుణ్యం. భగవంతుడు పంపించడు, వేరెవరూ పంపించరు. మీ పుణ్యమే పంపిస్తుంది. పాపం ఉదయించినట్లయితే అందరి మోటల్స్ నిండిపోతాయి, మీది నిండదు. ఎంతో బాగా తయారుచేసినా సరే నిండదు.

## ఎవరికైనా దోషాన్ని ఎలా అంటగడతారు?

ఈ పుణ్యవంతులకు లభించని వస్తువంటూ ఏమీ ఉండదు. కానీ అలాంటి పూర్తి పుణ్యాన్ని కొనితెచ్చుకోలేదు కనుకనే. లేకపోతే ప్రతి వస్తువూ, ఎలా కోరుకుంటే అలా దొరుకుతుంది. అలాంటిది. కానీ మనుషులు లౌకిక జ్ఞానంలో పడివున్నంతకాలం, ఎప్పుడూ ఏ వస్తువూ లభించదు. ఒకపక్క బుర్రంతా వేడెక్కుతుంది. దానికి తోడు అతనికి దొరికిన జ్ఞానం '*బూధే నార్ పాంసరీ*' (కొడితేనే ఆడది తిన్నగా ఉంటుంది) అని. అయినట్లయితే, అతనికి ఏం కావాలో అది దొరుకుతుంది. అలాంటి జ్ఞానమే లభిస్తే అది అలాంటి ఫలితాన్నిస్తుందా లేదా? అప్పుడేమౌతుంది? ఏ స్త్రీ గర్భాన తీర్థంకరులు జన్మించారో, ఆ స్త్రీ పరిస్థితిని చూసావా నువ్వు ఎలా ఉంటుందో? ఎంత అన్యాయం? ఎందుకంటే, ఏ స్త్రీ జాతి నుంచి ఇరవైనాలుగు మంది తీర్థంకరులు జన్మించారో, పన్నెండు మంది చక్రవర్తులు జన్మించారో, వాసుదేవుడు జన్మించాడో, అక్కడ కూడా ఆవిధంగా చేస్తారా. మీది చేదు అనుభవమే కావొచ్చు కానీ, అందుకోసం స్త్రీజాతిని ఎందుకు నిందించటం? మీరు పన్నెండు రూపాయలకు డజను మామిడి పండ్ల చొప్పున తీసుకునివచ్చినప్పటికీ అవి పుల్లగా ఉండవచ్చు, మూడు రూపాయలు

డజన్ ధరకి తెచ్చినా అవి తియ్యగా ఉండవచ్చు. అంటే చాలసార్లు వస్తువు దాని ధర మీద ఆధారపడివుండదు. మీరు చేసుకున్న పుణ్యం మీద ఆధారపడివుంటుంది. మీ పుణ్యం కాస్త జోరు పెంచితే మామిడి పండు తియ్యదే వస్తుంది. కానీ పుల్లగా వచ్చింది ఏదైతే ఉందో, అందులో పుణ్యం జోరు ఏమాత్రం లేదు. అందులో ఎవరి దోషాన్ని ఎంచుతాము?

అంటే, ఇది పుణ్యం లోపమే తప్ప మరేముంది? పెద్దన్న ఆస్తిని పంచివ్వటం లేదంటే అది పెద్దన్నయ్య తప్పా? మీ పుణ్యంలో ఉన్న లోటే కాని, అందులో ఎవరి దోషమూ లేదు. వీళ్ళు ఆ పుణ్యాన్ని సరిచేసుకోరు సరికదా పెద్దన్నయ్యతో ఘోర పాపాన్ని మూటగట్టుకుంటారు. ఇక పాపపు దొన్నెలు జమౌతాయి.

మనకి ఒకవేళ ఇల్లు లేకపోతే, ఎవరైనా సహాయం చేసి ఉండటానికి ఇల్లు ఇస్తే, అతని మీద రాగం మొదలౌతుంది, అతను తిరిగి ఆ ఇంటిని తీసుకోవాలని వస్తే అతని మీద ద్వేషం పుడుతుంది. ఇవే రాగద్వేషాలంటే. నిజానికి రాగద్వేషాలు చేసే అవసరం లేదు. అతను నిమిత్తుడే. ఇచ్చేవారు, తీసుకునేవారు, ఇద్దరూ నిమిత్తులే. మీ పుణ్యం పండినపుడు ఇచ్చేవారు కలుస్తారు. పాపం పంటకి వచ్చినపుడు తీసుకునేవారు వస్తారు. అందులో వాళ్ళ దోషమేమీ లేదు. మీకు ఏది పంటకి వస్తుందో దాని మీద ఆధారపడివుంటుంది అంతా. ఎదుటివారి దోషం కించిత్తయినా లేదు. అతను నిమిత్తుడే. అలా మన జ్ఞానం చెప్తుందంటే ఎంత అందంగా చెప్తుంది!

అజ్ఞానికి ఎవరైనా తియ్యతియ్యగా మాట్లాడితే అక్కడ రాగం మొదలౌతుంది, చేదుగా మాట్లాడితే ద్వేషం కలుగుతుంది. ఎదుటివారు తియ్యగా మాట్లాడితే అక్కడ మన పుణ్యమే ప్రకాశిస్తుంది, ఎదుటివారు చేదుగా మాట్లాడితే అక్కడ మన పాపం ప్రకాశిస్తుంది. అందువలన మౌలికంగా రెండు సందర్భాలలోను ఎదుటివారితో సంబంధమేమీ లేదు. మాట్లాడదేవాళ్ళతో ఎటువంటి సంబంధం లేదు. ఎదుటి మనిషి నిమిత్తుడే. ఖ్యాతి వచ్చే నిమిత్తంలో ఖ్యాతి వస్తుంది, అపఖ్యాతి వచ్చే నిమిత్తంలో అపఖ్యాతి వస్తుంది. అది కేవలం నిమిత్తమాత్రమే. అందులో ఎవరి దోషమూ లేదు.

**ప్రశ్నకర్త:** అందరూ నిమిత్తులనే అనుకోవాలి కదా?

**దాదాశ్రీ:** నిమిత్తం కాకుండా ఈ ప్రపంచంలో మరేదీ లేదు. ఉన్నదంతా ఈ నిమిత్తమే.

## అందుకు పుణ్యపాపాలే ఆధారం

**ప్రశ్నకర్త:** ఎంత అబద్ధం పలికినా, నిజంలోకి మారిపోతుంది, ఎంత సత్యం పలికినా అది అబద్ధం లోకి మారిపోతుంది. ఈ పజిల్ (చిక్కుప్రశ్న) ఏమిటి?

**దాదాశ్రీ:** అవి అతని పాపపుణ్యాల మీద ఆధారపడివుంటుంది. వాళ్ళ పాపం పంటకి వస్తే వాళ్ళు నిజం చెప్పినా అది అబద్ధమైపోతుంది. పుణ్యం పండినపుడు అబద్ధమాడినా దాన్ని జనమంతా సత్యంగా స్వీకరిస్తారు. ఎంత అబద్ధమైనా సరే నడిచిపోతుంది.

**ప్రశ్నకర్త:** మరి అతనికి ఎటువంటి నష్టమూ కలుగదా?

**దాదాశ్రీ:** నష్టం జరుగుతుంది కాని రాబోయే జన్మలో. ఈ జన్మలో అయితే అతనికి పూర్వజన్మ ఫలం లభించింది. ఇతను అబద్ధమాడాడు కదా, దాని ఫలితం వచ్చే జన్మలో లభిస్తుంది. ఇప్పుడతను విత్తనం నాటాడు. ఇకపోతే ఇదేమీ అంధ నగరం కాదు ఏం చేసినా చెల్లిపోవటానికి!

## ఆ కపుల్ (దంపతుల) లో పుణ్యశాలి ఎవరు?

ఒకతను నా దగ్గరకు వచ్చాడు. అతను నాతో, 'దాదా, నేను పెళ్ళి చేసుకున్నాను. కానీ నాకు నా భార్య నచ్చటం లేదు' అన్నాడు. అందుకు నేను, 'ఎందుకు బాబూ, నచ్చకపోవటానికి కారణమేమిటి?' అన్నాను. దానికి అతను, 'ఆమె కొంచెం కుంటిది. కాలు కుంటుకుంటూ నడుస్తుంది' అన్నాడు. 'నీ భార్యకి నువ్వు నచ్చావా లేదా?' అని అడిగితే, 'దాదా, నేనైతే ఇష్టపడేటట్టే ఉన్నాను కదా, అందంగా ఉంటాను, చదువుకున్నవాడిని, నాలో ఎటువంటి శారీరక లోపమూ లేదు' అన్నాడు. 'అయితే అందులో తప్పు నీదే. నువ్వలాంటి తప్పేం చేసావు నీకు కుంటిది దొరికింది? ఆమె ఎంత పుణ్యం చేసింది, ఆమెకి నీలాంటి మంచివాడు దొరికాడు!

అరె, ఇది నీ కర్మే నీకు ఎదురౌతోంది. అందులో ఎదుటివారి దోషాన్నెందుకు చూస్తావు? నీ తప్పుకి నీవు అనుభవించు, మరో కొత్త తప్పు చేయకుండా ఉండు' అని చెప్పాను.

## కష్టాలలో పుణ్యపాపాలవ రోల్...

**ప్రశ్నకర్త:** మనుషులకు రోగాలు వస్తుంటాయి. అందుకు కారణమేమిటి?

**దాదాశ్రీ:** అతను స్వయంగా చేసిన తప్పు, అంతా పాపమే చేసాడు, దానితోనే ఈ రోగాలు వచ్చాయి.

**ప్రశ్నకర్త:** మరి ఈ చిన్నచిన్న పిల్లలేం తప్పు చేసారు?

**దాదాశ్రీ:** అందరూ పాపం చేసారు. అందుకే ఈ రోగాలన్నీ వస్తాయి. పూర్వజన్మలో చేసుకున్న పాప ఫలితమే ఇప్పుడు వచ్చింది. చిన్న పిల్లలు బాధను అనుభవిస్తారంటే అది పాప ఫలితమే, శాంతి, ఆనందాలు పొందుతారంటే అది పుణ్య ఫలం. పాపపుణ్యాలు రెండిటి ఫలితాలూ వస్తాయి. పుణ్యమనేది క్రెడిట్, పాపమనేది డెబిట్.

**ప్రశ్నకర్త:** ఈ జన్మలో మనకేమైనా బాధలుంటే, రోగాలుంటే, అవి మన పూర్వజన్మ ఫలితాలయితే, ఇప్పుడు మనం దానికి చికిత్స చేయించుకుంటే, అవి మనలను ఏ విధంగా బాగుచేస్తాయి, అది మరి ఒకవేళ వ్యవస్థితమే అయ్యుంటే?

**దాదాశ్రీ:** మందులేవైతే తీసుకుంటావో అది కూడా వ్యవస్థితం కాబట్టే తీసుకోగలుగుతావు. లేకపోతే తీసుకోనే లేవు. మనకు దొరకనే దొరకదు.

**ప్రశ్నకర్త:** ఎన్ని రకాల మందులు తీసుకున్నా ఆ మందుల ప్రభావమే ఉండదు. వాటితో నయమవదు. అలా కూడా జరుగుతుంది కదా దాదా?

**దాదాశ్రీ:** ఇంకా డబ్బులు కూడా ఖర్చవుతుంటాయి. మరణ కాలం కూడా దగ్గరకు వస్తుంది. పుణ్యం ప్రకాశిస్తే, ఏదో కాస్త అలా టమాటా రసం తీసుకున్నా సరే రోగం పోతుంది. అందువలన పుణ్యం మీదనే ఆధారపడివుంటుంది.

మీ పుణ్యం ఫలమివ్వటానికి తయారుగా ఉంటే, అంతా అలా ఫ్రీ ఆఫ్ కాస్ట్ లభిస్తుంది. కానీ పాపం ఫలమివ్వటానికి తయారుగా ఉంటే, మంచిది కూడా చెడుగా మారిపోతుంది.

వ్యాధి కలిగినపుడు పుణ్యం వలన బాధ తక్కువయిపోతుంది. వ్యాధి కలిగినపుడు పాపం వలన బాధ ఇంకా పెరిగిపోతుంది. పుణ్యమనేదే లేకపోతూ బాధను పూర్తిగా అనుభవించవలసివుంటుంది.

పుణ్యం వలన వైద్యుడు కూడా మంచివాడు దొరుకుతాడు. టైమ్ దొరుకుతుంది. అంతా లభిస్తుంది, ప్రశాంతత ఉంటుంది. నొప్పిని డాక్టర్ తీసేసాడా? పుణ్యం తీసేసింది, పాపం వలన నిలబడింది. లేకపోతే మరెవరు తీసేస్తారు? డాక్టరు నిమిత్తుడు.

**ప్రశ్నకర్త:** రోగం వచ్చింది అంటే పాపం ఫలించినట్లా?

**దాదాశ్రీ:** మరి ఇంక అదేమిటి మరి?ఆ రోగమే పాపం, రోగరహితంగా ఉండటం పుణ్యం.

## ఆయుష్షు ఎక్కువ ఉంటే మంచిదా లేక తక్కువగానా?

**ప్రశ్నకర్త:** దీర్ఘాయువు, దీర్ఘాయుష్షు అనేది పుణ్య ఫలమా లేక పాప ఫలమా?

**దాదాశ్రీ:** ఆ.. ఒకవేళ జీవితం ఇతరులతో తిట్లు తినటానికి కాని లేక ఇతరులను నిందించటానికి కాని ఉంటే అది పాప ఫలితమే. ఆత్మ ఉన్నతి కోసం కాని లేక ఇతరులకు మంచి చేయటంలో ఎక్కువ కాలం జీవిస్తే అది పుణ్య ఫలం అవుతుంది.

పుణ్యాత్ముల జీవిత కాలం ఎక్కువగా ఉంటుంది. పుణ్యం కాస్త తక్కువగా ఉంటే, ఆయుష్షు మధ్యలోనే తెగిపోతుంది. ఎవరైనా ఎక్కువ పాపాత్ముడై, జీవిత కాలం ఎక్కువగా ఉంటే? పాపాత్ముని ఆయుష్షు ఎలా ఉండాలని భగవాన్ అంటారు?

నేను భగవాన్‌ని అడిగాను, 'పాపాత్ముని ఆయుష్షు ఎంత ఉంటే మంచిదని అనుకోవాలి?' అని. అప్పుడు, 'ఎంత తక్కువగా బతికితే అంత మంచిది' అన్నారు. ఎందుకంటే అతను పాప సంయోగంలో ఉన్నాడు కనుక తక్కువ కాలం జీవిస్తే ఆ సంయోగం అతనికి మారిపోతుంది. కానీ అతను తక్కువ కాలం బతకడు కదా! ఇది అతని లెవెల్ తెలియజేయటానికి చేప్తాను నేను. కానీ అతను ఎక్కువగా బతుకుతాడు. అతను వంద సంవత్సరాలు కూడా పూర్తి చేసుకుంటాడు. ఇక ఎంత పాపాన్ని మూటగట్టుకుంటాడు, ఎంత లోపలికి వెళ్ళిపోతాడంటే, అతనికే ఎరుక. పుణ్యాత్ముడు ఎంత ఎక్కువ కాలం జీవిస్తే అంత మంచిది.

## వేరే జన్మలో కట్టుకున్న మూటలు ఎవరివి?

పరాయి దేశంలో సంపాదించింది పరాయి దేశంలోనే ఉండిపోతుంది. ఈ కార్లు, బంగళాలు, భార్యాపిల్లలు ఇవన్నీ ఇక్కడే వదిలిపెట్టి పోవలసివుంటుంది. ఈ అంతిమ స్టేషన్‌లో ఎవరి బాబుదీ చెల్లదు. కేవలం పాప పుణ్యాలనే వెంట తీసుకుని పోయే వీలుంటుంది. దీన్నే సాధారణ భాషలో నీకు చెప్పాలంటే, ఇక్కడ ఏయే తప్పులు చేసారో వాటి బాపతు సెక్షన్‌లు మీతో వెళ్తాయి. ఆ తప్పుల సంపాదన ఇక్కడే మిగిలిపోతుంది, పైగా దాని మీద కేసు కూడా నడుస్తుంది. ఆయా సెక్షన్ల ప్రకారం కొత్త దేహప్రాప్తి జరిగి, కొత్త రకంగా సంపాదించి బాకీ చెల్లించవలసివుంటుంది. అందువలన బాబూ, ముందునుంచే మంచిగా ఉండాలి కదా! 'స్వదేశంలో' ఎంతో సౌఖ్యంగా ఉంటుంది కానీ, స్వదేశాన్ని ఇంతవరకు చూడనేలేదు కదా!

**ప్రశ్నకర్త:** మనిషి తన జన్మలో సత్కార్యాలను చేసిన తర్వాత, అతని శరీరం నశించిన తర్వాత, ఆ ఆత్మ పరిస్థితి ఎలా ఉంటుంది?

**దాదాశ్రీ:** సత్కార్యాల వలన పుణ్యం వస్తుంది. అది క్రెడిట్ అవుతుంది. దానితో ఆ మనిషికి మంచి ఇంట్లో జన్మ లభిస్తుంది. రాజు అవుతాడు లేకపోతే ప్రధాన మంత్రి అవుతాడు. అంతకంటే ఎక్కువ సత్కార్యాలను చేసివున్నట్లయితే దేవగతి లభిస్తుంది. సత్కార్యాలు క్రెడిట్ అనబడతాయి. తిరిగి ఆ క్రెడిట్‌ని అనుభవిస్తారు. తప్పు పనులు చేస్తే దాని డెబిట్ అనుభవిస్తారు. ఇక రెండు కాళ్ళు కాస్తా నాలుగు

కాళ్ళు అయిపోతాయి. మీరు ఎస్.ఇ. అయ్యారంటే అది క్రెడిట్ కారణంగానే. డెబిట్ ఉంటే మిల్లులో నౌకరవుతారు. రోజంతా కష్టపడి పనిచేసినా పూర్తవదు. అందుకే ఈ క్రెడిట్ డెబిట్ ఆధారంగా నాలుగు గతులు, క్రెడిట్ డెబిట్ అసలు ఉత్పన్నమే అవకపోతే మోక్షగతికి వెళ్తారు.

స్వార్థం వలన పాపం అంటుకుంటుంది. నిస్వార్థంగా పనిచేస్తే పుణ్యం వస్తుంది. కానీ రెండూ కర్మలే కదా! పుణ్యకర్మ ఫలితం బంగారు సంకెళ్ళయితే, పాప ఫలితం ఇనప సంకెళ్ళు. అయితే రెండూ సంకెళ్ళే కదా!

## స్వర్గానికీ, మోక్షానికీ ఉన్న తేడా

**ప్రశ్నకర్త:** స్వర్గానికీ మోక్షానికీ ఉన్న తేడా ఏమిటి?

**దాదాశ్రీ:** స్వర్గం అయితే ఇక్కడ పుణ్యం ఏదైతే చేసి వెళ్తారో, పుణ్యం అంటే మంచి పనులు, శుభమైన పనులు, అంటే ఇతరులకు దానం చెయ్యటం, ఎవరికీ దుఃఖం కలిగించకుండా ఉండటం, ఎవరికైనా సహాయం చెయ్యటం, ఒబ్లయిజింగ్ నేచర్ కలిగివుండటం, ఇలాంటి కర్మలు చెయ్యరా మనుషులు?

**ప్రశ్నకర్త:** చేస్తారు.

**దాదాశ్రీ:** అంటే, మంచి పనులు చేస్తే స్వర్గానికి పోతారు, చెడ్డ పనులు చేస్తే నరకానికి పోతారు. మంచి పనులు చెడ్డ పనుల మిక్చర్ చేసినా అందులో చెడ్డ పనులను తక్కువగా చేస్తే, మనుషులలో జన్మిస్తారు. అలా నాలుగు భాగాలలో చేసిన పనులకు ఫలితం వస్తూవుంటుంది. అలా పనులు చేసేవారెవరూ మోక్షంలోకి పోలేరు. మోక్షం కావాలంటే కర్తృత్వ భావం ఉండగూడదు. ఆత్మజ్ఞానం లభిస్తే కర్తృత్వ భావం నశిస్తుంది, కర్తృత్వ భావం నశించినపుడు మోక్షం ప్రాప్తిస్తుంది.

## పుణ్య ఫలం ఎలా ఉంటుంది?

పుణ్యం అంటే జమ, పాపం అంటే ఖర్చు. జమ ఉన్నపుడు ఎక్కడంటే అక్కడ ఖర్చు చేయవచ్చు. దేవీదేవతలు దృష్టి జైలులో బంధిగా ఉంటారు కాని వారికి

కూడా మోక్షమైతే కంటికి కనిపిస్తుంది కానీ మోక్షమైతే లభించదు. మీ ఇంట్లో పెళ్ళి జరుగుతోందంటే మీరు మిగతా అంతా మర్చిపోతారు. మోహావేశంలో, తన్మయత్వంలో ఉంటారు. ఐస్‌క్రీం తింటుంటే నాలుక తింటూవుంటుంది. బ్యాండ్ మోగుతుంటే చెవులకు ఇంపుగా ఉంటుంది. కళ్ళు పెళ్ళి కుమారుడిని చూస్తూవుంటుంది. ముక్కు అగర్‌బత్తి, సెంటులవైపు వెళ్తుంది. ఆ పంచేంద్రియాలు తమపని చేసుకుంటూవుంటాయి. మనసు ఆందోళనలో పడిపోతుంది. ఇవన్నీ జరుగుతున్నపుడు ఆత్మ గుర్తే ఉండదు. దేవీ దేవతలకు కూడా ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. దీనికి ఎన్నో రెట్లు ఎక్కువ సుఖం ఉంటుంది కనుక వాళ్ళకసలు ధ్యాసే ఉండదు. వాళ్ళకి ఆత్మ మీద ధ్యాసే పోదు. కాని దేవగతిలో కూడా *కఢాపా-అజంపా*, ఈర్ష్యలు ఉంటాయి. దేవీ దేవతలు కూడా పూర్తిగా సుఖాలలో తేలియాడుతుంటారు. అది ఎలా అంటే, పెళ్ళిలో నాలుగు రోజులు వరుసగా తినటానికి లడ్డూ పెడితే, ఐదవ రోజు ధ్యాస కిచిడీ మీదకు మళ్ళుతుంది! వాళ్ళకి కూడా ఎప్పుడెప్పుడు మానవ శరీరం దొరుకుతుందా, భారతదేశంలో మంచి సంస్కారవంతమైన కుటుంబంలో జన్మించాలి, జ్ఞాని పురుష్ ఎవరైనా తారసపడాలి అని ఉంటుంది. జ్ఞానిపురుష్ దొరికితేనే బావుంటుందనిపిస్తుంది. లేకపోతే చతుర్గతిలోకి పోకతప్పదు.

## పాప ఫలం ఎలా ఉంటుంది?

ఆత్మ మీద పొరలు కమ్మి ఎలా ఉంటుందంటే, ఎవరైనా ఒక వ్యక్తిని చీకటి గదిలో పెట్టి, కేవలం రోజుకి రెండుసార్లు భోజనం మాత్రం పెడితే ఎలాంటి దుఃఖంలో ఉంటారో, అలాగే ఈ చెట్లూచేమల వంటి ఏకేంద్రియ జీవుల నుంచి పంచేంద్రియ జీవుల వరకు అపారమైన దుఃఖం కలుగుతుంది. ఈ పంచేంద్రియాలు కలిగిన మనుషులకు ఇంతటి దుఃఖమంటే, ఇక తక్కువ ఇంద్రియాలు కలవాటికి ఎంతటి దుఃఖం ఉండవచ్చు? ఐదు కంటే ఎక్కువ ఆరు ఇంద్రియాల జీవి ఏదీ లేదు. ఈ చెట్లూ చేమలూ, జంతుజాలానిది తిర్యంచ గతి. కాబట్టి వాటిది కఠినమైన కారాగార శిక్షే. మనుష్యగతి అంటే సాధారణ ఖైదు. నరకగతిలో భయంకరమైన దుఃఖం ఉంటుంది. అది ఎలా ఉంటుందన్నది వర్ణించుకుంటూపోతే అది వింటే మనిషి చచ్చేపోతాడు. బియ్యం ఉడికి చిందిపడేదాని కంటే లక్షరెట్లు ఎక్కువగా ఉంటుంది.

ఒక జన్మలోనే ఐదైదు మరణ వేదనలను అనుభవిస్తారు కానీ ఆ మృత్యువు రాదు. అక్కడ దేహం పాదరసంలా ఉంటుంది. మరణవేదనను అనుభవించాలి కాబట్టి మృత్యువు రాదు. వాళ్ళ శరీర అంగాలన్నీ చితికిపోతాయి, తిరిగి అతుక్కుంటాయి. వేదనను అనుభవించవలసేవుంటుంది. నరకగతి అంటే జీవితఖైదన్నట్లే.

## పాపపుణ్యాలు చిమ్ముతున్న సమయంలో....

పాపం చేస్తావు కదా, అది అప్పుడు పైకి చిమ్ముతుంటే తెలిసివస్తుంది! అప్పుడు ఘోరంగా ఓడిపోతారు. నిప్పుల మీద కూర్చున్నట్లు ఉంటుంది!! పుణ్యం చేసుకుంటే అర్థమౌతుంది వేరే విధమైన మజా వస్తుందని. అందువలన ఏయే విధమైన కర్మలను ఆచరిస్తున్న సమయంలో ఆలోచించు అవి పండి పైకి చిమ్మినప్పుడు ఎటువంటి పరిణామం వస్తుందన్నది. కర్మాచరణ సమయంలో ఆలోచించాలి, ఎవరినైనా మోసగించి డబ్బు తీసుకునే సమయంలో తప్పక ఆలోచించాలి అది పైకి వస్తుందని. ఆ డబ్బుని బ్యాంక్‌లో వేసినా సరే పోతుంది. అది కూడా పోతుంది. పైగా ఆ డబ్బుని పోగుచేసుకుంటున్నప్పుడు చేసిన పాపం, చేసిన రౌద్రధ్యానం, వాటి సెక్షన్లు కూడా వేరుగా పడతాయి. అవి పైకి ఎగచిమ్మినపుడు నీ పరిస్థితి ఎలా ఉంటుంది?

## పుణ్యం పూర్తయినప్పుడు అది జ్ఞాని నుంచి వేరుచేస్తుంది..

పుణ్యం స్వభావం ఎలా ఉంటుంది? ఖర్చయిపోతుంటుంది. కోట్లకొద్దీ మంచు పరిమాణం ఉన్నప్పటికీ దాని స్వభావమేమిటి? కరిగిపోవటం.

నీవు, నేను కలిసిన సంయోగం పుణ్యం మీద ఆధారపడివుంది. నీ పుణ్యం అయిపోయిందనుకో, అందులో నేను చేసేదేముంటుంది? నువ్వేమో ఇదే సంయోగం నాకు కావాలని అనుకుంటున్నావనుకో, అప్పుడేమౌతుంది? దెబ్బతింటావు. తల కూడా పగులుతుంది. ఎంత లభించిందో అదే లాభం. నా పుణ్యం పండింది అనుకుంటూ ఆనందపడు. నీ మనసు ఇష్టపడే సంయోగం కావాలని నీవు కోరుకుంటున్నావా?

**ప్రశ్నకర్త:** అలా ఏమీ లేదు

**దాదాశ్రీ:** అయితే ఇది నియమానుసారమే జరిగింది కదా? లేకపోతే నియమాలకు ఆవలా?

**ప్రశ్నకర్త:** నియమానుసారమే ఉంది.

**దాదాశ్రీ:** ఆ తర్వాత కావాలనుకుంటే ఏమౌతుంది? మరోసారి పుణ్యం పండితే తిరిగి నాతో కలవటం జరుగుతుంది. వదిలి వెళ్ళేటప్పుడు అర్థమౌతుంది. అందువలన వదిలి వెళ్ళే సమయంలో అనుభవం కలిగితే పరవాలేదు కదా మీకు? పలాయనంతో ఎక్కడైనా కర్మ నుండి తప్పించుకుంటారా? నేను బరోడాలో ఉన్నాను, నీవూ బరోడాలోనే ఉన్నావనుకో, అయినా సరే కర్మ మనలను కలవనివ్వదు. ఈ జ్ఞానం ఇవ్వటం జరిగిన సమయంలో ఎవరైతే వచ్చి కలుస్తారో అది 'వ్యవస్థితం' కనుక దాన్ని సమభావంతో నిర్వహించు. అంతే ఈ విషయం.

పుణ్యం ఉన్నంత వరకు దాదా దగ్గర కూర్చోవటానికి సమయం దొరుకుతుంది. అది ఆ పుణ్యం చేసిన ఉపకారమని తలవాలి. ఇది ఎప్పటికీ అలాగే జరుగుతుందా ఎక్కడైనా? అలాంటి ఆశ కూడా ఎలా పెట్టుకుంటారు?

## దుస్సాంగత్యంతో పాపం ప్రవేశం

ఈ ప్రపంచంలో అందరికన్నా పెద్ద పుణ్యాత్ముడు ఎవరు? దుస్సాంగత్యం తాకనివారు. పాప భయం ఉన్నవారు గొప్ప జ్ఞానులు అనబడతారు.

దుస్సాంగత్యంతో పాపం ప్రవేశిస్తుంది, ఆ తర్వాత ఆ పాపం కాటువేస్తుంది. వాళ్ళకి సమయం దొరికినప్పుడు మరో దుస్సాంగత్యం లభిస్తే, ఆ దుస్సాంగత్యం వలన నిందించటం మొదలౌతుంది. నిందించటం వలన మచ్చ పడుతుంది. కలిగే ఈ దుఖాఃలన్నీ దాని వలనే. మనకి ఎవరి గురించైనా మాట్లాడే అధికారం ఎక్కడుంది? మనది మనం చూసుకోవాలి. ఎవరైనా సుఖపడుతున్నారా లేక దుఃఖపడుతున్నారా అన్నది మనకి సంబంధించింది కాదు. వీళ్ళయితే రాజులను కూడా తప్పుపడుతుంటారు. పరాయి విషయాలతో మనకి ఎటువంటి సంబంధమూ లేదు. దానికి తోడు ఈర్ష్య ద్వేషాలు, దాని వలన కలిగే బాధ! వీతరాగులవమంటారు భగవాన్.

నీవు వీతరాగివైనపుడు ఈ రాగద్వేషాలు ఎందుకని? నీవు పేరు కోసం చూస్తేనే కదా ఈ రాగద్వేషాలు? పేరే లేకపోతే వీతరాగివే అయిపోతావు!

## ఆత్మ కోసమే సదుపయోగం

అదేమిటంటే, పుణ్య పండినపుడు తినటానికి, తాగటానికి కావలసినవన్నీ ఇంట్లో కూర్చున్నా లభిస్తాయి. అందుకే ఈ టి.వి. చూడటం. అలా కాకుండా, తినటానికి ఏమీ లేనట్లయితే రోజంతా పనిచేస్తావా లేక టి.వి.చూస్తావా? అంటే పుణ్యాన్ని దురుపయోగం చేస్తున్నారు. పుణ్యాన్ని సదుపయోగం ఎలా చేసుకోవాలంటే, దాన్ని ఆత్మ కోసం ఉపయోగించుకోవాలి. అయినా టి.వి. చూడగూడదు అనే నిబంధనేమీ లేదు. కాసేపు చూసినా, ఇది తప్పు కదా అని ఆలోచించి, అందులోంచి ఆసక్తిని తొలగించివేసుకోవాలి.

## పరోపకారంతో పుణ్యం పెంచుకుంటారు

**ప్రశ్నకర్త:** పుణ్యం వలన ఏవిధంగా బాగుపడుతారు?

**దాదాశ్రీ:** వచ్చినవారిని 'రా భాయ్ వచ్చి కూర్చో!' అంటూ అతన్ని ఆహ్వానిస్తారు. మీ దగ్గర టీ ఉంటే టీ లేకపోతే ఏముంటే అది, ఒక చిన్న రొట్టె ముక్క ఉన్నా సరే అది పెట్టండి. తర్వాత అడగండి, 'అన్నా, ఇంకొంచెం తింటావా' అని. అలా ప్రేమగా వ్యవహరిస్తే మీరు ఎంతో పుణ్యాన్ని మూటగట్టుకుంటారు. ఇతరులకు మీరు చేసేదే పుణ్యం. ఇంట్లో పిల్లలకు ఎవరైనా చేస్తారు.

**ప్రశ్నకర్త:** పుణ్యం చేయాలనే ఆలోచన ఉంటే అందుకు ఏం చేయాలి?

**దాదాశ్రీ:** రోజంతా ఇతరులకు ఉపకారం చేస్తూనేవుండండి. మనోయోగం, వాణీయోగం, దేహయోగాన్ని ఇతరుల కోసం వెచ్చించండి. అది పుణ్యం అనబడుతుంది.

## పుణ్యం, పాపం- భార్యాభర్తల మధ్య

**ప్రశ్నకర్త:** భార్యాభర్తలు సమయమంతా దాదాపు కలిసే గడుపుతారు.

వాళ్ళ వ్యవహారం, అంటే వాళ్ళ కర్మలు కూడా ఒకరితో మరొకరివి ముడిపడే వుంటాయి కదా, మరి వాటి ఫలితాలను వాళ్ళు ఏవిధంగా అనుభవిస్తారు?

**దాదాశ్రీ:** మీ భావానికి తగ్గట్లుగానే ఫలితం ఉంటుంది, దాన్ని అనుభవించవలసి వుంటుంది. భావం ఎటువంటిదైతే అటువంటి ఫలితాన్నే అనుభవించవలసి వుంటుంది.

**ప్రశ్నకర్త:** భార్య పుణ్యం వలన భర్త లాభం పొందుతాడా? భార్య పుణ్యం వలన, ఆ లక్ష్మి వలనే ఇంట్లో అంతా శుభం జరుగుతుందంటారు కదా, అలా జరుగుతుందా?

**దాదాశ్రీ:** అదేమిటంటే, మనవాళ్ళలో కొందరు భార్యను బాగా కొడుతుండేవారు కదా, అప్పుడు అతనికి, ఓరి మూర్ఖుడా, నీ భార్య అదృష్టం చూడు ఎలా ఉందో. ఎందుకలా కొడతావు అంటారు. ఆమె పుణ్యం వలనే నీవు తింటున్నావు! అనేటప్పటికి అలా అనటం మొదలైంది. ఏ జీవియైనా తన పుణ్యంకొద్దే తింటాడు. ప్రతి ఒక్కరు తన పుణ్యం వలనే భోగిస్తుంటాడు. ఇతరులకు అందులో ప్రమేయమేమీ ఉండదు. వెంట్రుక మందం కూడా గొడవేమీ ఉండదు.

**ప్రశ్నకర్త:** దానం చేయటం, శుభకర్మలను ఆచరించటం, ఉదాహరణకు పురుషుడు దానం చెయ్యటం, స్త్రీ అందుకు సమ్మతించి సహకరించటం చేస్తే ఇద్దరికీ పుణ్యం లభిస్తుంది కదా?

**దాదాశ్రీ:** పురుషుడు అంటే కర్మను ఆచరించేవారు, సహకరించేవారు అంటే దాన్ని ఆమోదించేవారు. చేసేవారు, చేయించేవారు, కర్త చేసే పనులను ఆమోదించేవారు, వీరిలో ఎవరైనా మీతో, ఈ పని చెయ్యి, ఇది చేస్తే మంచిది అని చెప్తే వాళ్ళు చేయించేవాళ్ళు అవుతారు. మీరు చేయించేవాళ్ళు చేయిస్తారు, అందుకు స్త్రీ అభ్యంతరం తెలుపదు అంటే, ఆమె కర్త చేసే పనికి ఆమోదం తెలిపేది అవుతుంది. వీళ్ళందరికీ పుణ్యం లభిస్తుంది. చేసేవారి వాటాకి యాభై శాతం, ఆమోదించేవారి వాటాకి యాభై శాతం అలా విభజించబడుతుంది.

**ప్రశ్నకర్త:** నాకు ఇరవై శాతం ఇస్తే నడవదు అంటుంది సోదరి.

**దాదాశ్రీ:** అయితే స్వయంగా చెయ్యి. ఇంట్లోవాళ్ళంతా యజమాని (భర్త)తో, మీరు ఏం చేసైనా సరే డబ్బులు తీసుకువస్తే, ఆ పాపమంతా మీకే కాని మేము అందులో ఏమీ అనుభవించం అంటారు. అలా మనకి వద్దు. ఎవరు చేస్తే వాళ్ళు అనుభవిస్తారు. ఇంట్లో సభ్యులు మాత్రం మాకు వద్దు అంటారు. అంటే వాళ్ళు ఆమోదించటం లేదు. కనుక వాళ్ళు దాని నుండి ముక్తులౌతారు. అలా చెయ్యండి అని వాళ్ళు అంటే మాత్రం వాళ్ళు అందులో బాగస్వాములౌతారు. మరి పార్టనర్‌షిప్ చెయ్యాలనుకుంటే వాళ్ళిష్టం. దానికోసం డీడ్ (లిఖితపూర్వకంగా) చేసుకోవలసిన అవసరం కానీ, స్టాంప్స్ అవసరం కాని ఉండదు. స్టాంప్ లేకపోయినా నడిచిపోతుంది.

## 'కప్పు పగిలినా కూడా పుణ్యం వస్తుందా?'

'నాకు జ్ఞానం లభించలేదు. సమకితం జరగలేదు. మరి నేనేం చెయ్యాలి? నేను మరో నష్టాన్ని భరించలేను' అని ఎవరైనా అంటే, అతనికి నేను, 'ఈ మంత్రం నేర్చుకో. అదేమిటంటే, కప్పు పగిలితే, మంచిదైంది గొడవ వదిలిపోయింది, ఇప్పుడు కొత్త కప్పు తీసుకునివస్తాను– అను. దానితో పుణ్యం లభిస్తుంది. ఎందుకంటే చింతించేదాని కంటే ఆ స్థానంలో అతను ఆనందాన్నిచ్చాడు. కనుక పుణ్యమే వస్తుంది. ఈ మాత్రం వస్తే చాలు ఎంతో లాభం ఉంటుంది. నాకు చిన్నప్పటి నుంచే ఇటువంటి అవగాహన ఉండేది. ఏరోజూ నేను చింతపడలేదు. అలాంటిదేమైనా జరిగితే నా లోపలి నుంచి అది వచ్చేస్తుంది. ఆలా నేర్పితే వచ్చేది కాదు. కానీ వెంటనే సమాధానం వస్తుండేది.

## ఒకరి నిమిత్తం వలన మరొకరికి ఏమైనా లభిస్తుందా?

**ప్రశ్నకర్త:** ఎవరికోసమైతే ఖర్చు పెట్టామో, వాళ్ళ ఖాతాలో అయితే పుణ్యం పోతుంది కదా? లేకపోతే చేసేవాళ్ళకా? మీరు ఎవరికోసం ఏదైనా పని చేస్తారో, అది పుణ్యమైతే అది అతనికి పోతుందా మనకి రాదా? చేసినవాళ్ళకి రాదా? ఇందులో ఏది నిజం?

**దాదాశ్రీ:** మనం చేస్తే వేరేవాళ్ళకి వస్తుందా? ఎక్కడైనా విన్నారా ఇది?

**ప్రశ్నకర్త:** అతని నిమిత్తంగా మనం చేస్తాం కదా?

**దాదాశ్రీ:** అతని నిమిత్తంతో మనం చేసినప్పుడు అతని నిమిత్తంతో మనం తింటే తప్పేమిటి? లేదు లేదు. ఇందులో అలాంటి తేడా ఏమీ లేదు. అలా భ్రమింపజేసి మనుషులను దారి తప్పిస్తారు, వాళ్ళ నిమిత్తంతో! అతను తిననప్పుడు మనం తింటే తప్పేమిటి? ఈ ప్రపంచమంతా నియమానుసారం నడిచేది! మీరు చేస్తే మీరే అనుభవిస్తారు. ఇతరులకు అందులో ఏమీ ఉండదు.

## వాహ్ వాహ్ లో పుణ్యమంతా ఖర్చయింది

**ప్రశ్నకర్త:** హీరాబా కోసం మీరు ఖర్చు చేసారు. అందుకు మీకు పుణ్యం వస్తుంది అంటారు.

**దాదాశ్రీ:** నాకేం వచ్చిందనా? నాకిందులో ఏమీ లేదు. నాకు ఇచ్చిపుచ్చుకునేదేమీ ఉండదు కదా! అందులో పుణ్యమేమీ రాదు. ఇందులో పుణ్యాన్ని భోగించటం జరుగుతుంది. వాహ్ వాహ్ అంటారు.

ఏమైనా చెడు జరిగితే, 'చూడు ఆ మూర్ఖుడిని, అంతా నాశనం చేసాడు' అంటారు. అందువలన, ఇక్కడిదంతా ఇక్కడే లభిస్తుంది. హైస్కూల్ నిర్మిస్తే ఇక్కడే అందుకు వాహ్ వాహ్ అన్నారు. అక్కడేమీ దొరకదు.

**ప్రశ్నకర్త:** స్కూల్‌ని పిల్లల కోసం కట్టించారు. వాళ్ళు అందులో చదువుకుని, వాళ్ళలో మంచి ఆలోచనలు ఉత్పన్నమవాలని.

**దాదాశ్రీ:** అది వేరు. కానీ, మీ గురించి అందరూ వాహ్ వాహ్ అన్నారు అంటే అది పూర్తయిపోయిందనుకో, ఖర్చయింది.

## టెండర్‌ని పాస్ చేయించాలి పుణ్యం...

**ప్రశ్నకర్త:** వీళ్ళంతా డబ్బు వెనక బాగా పరిగెడుతుంటారు. దానికి

ఛార్జ్ ఎక్కువౌతుంది కదా. అందుకు వాళ్ళకి మరుజన్మలో డబ్బు ఎక్కువ లభించాలి కదా?

**దాదాశ్రీ:** మనం లక్ష్మిని ధర్మమార్గంలో ఎక్కువ ఖర్చు పెట్టాలి. అలా ఛార్జ్ చేస్తే ఎక్కువ వస్తుంది.

**ప్రశ్నకర్త:** కానీ మనసులో డబ్బు ఎక్కువ రావాలి అనే భావాన్ని పెంచుకుంటే, వచ్చే జన్మలో అలాంటి భావంతో చార్జ్ చేస్తారంటే ప్రకృతి డబ్బుని బాగా ఇవ్వదా?

**దాదాశ్రీ:** లేదు లేదు. అలా చేస్తే డబ్బు ఎక్కువ రాదు. అలా డబ్బు ఎక్కువ కావాలన్న భావంలో ఉంటారు కదా, దానివలన రావలసిన డబ్బు కూడా రాదు. పైగా అవరోధాలు ఏర్పడుతాయి. డబ్బుని గుర్తు చేసుకుంటే రాదు, పుణ్యం చేసుకుంటేనే వస్తుంది.

'చార్జ్' అంటే పుణ్యం చార్జ్ చేసుకుంటే డబ్బు వస్తుంది. ఆ డబ్బు కూడా ఒంటరిగా రాదు. పుణ్యం ఛార్జ్‌లో నాకు డబ్బు చాల అవసరంగా కావాలి అని ఎవరికి అనిపిస్తే వారికే లభిస్తుంది. నాకు కేవలం ధర్మమే కావాలి అంటారు కొందరు. వాళ్ళకి కేవలం ధర్మమే కాని డబ్బు లభించదు. అంటే, ఆ పుణ్యానికి మనం టెండర్ నింపివుండాలి ఇలా కావాలి అని. అది లభించినప్పుడు పుణ్యం ఖర్చవుతుంది.

కొందరు, 'నాకు బంగళా కావాలి, కారు కావాలి, ఇది ఉండాలి, అది ఉండాలి' అని కోరుకుంటారు. అందులో పుణ్యం ఖర్చయిపోతుంది. ఇక ధర్మం కోసం ఏమీ మిగలదు. కొందరేమో నాకు ధర్మమే కావాలి, కారు వద్దు అని కోరుకుంటారు. నాకు ఇలా రెండు గదులుంటే చాలులే కానీ ధర్మమే ఎక్కువగా కావాలి అనుకున్నవాళ్ళకి ధర్మం ఎక్కువగా లభిస్తుంది, మిగతావన్నీ తక్కువగా లభిస్తాయి. అంటే అర్థం, ప్రతి ఒక్కరూ తమ వాటా పుణ్యంలో టెండర్‌ని నింపుకుంటారు.

# దానం అంటే ముందు నాటి తర్వాత కోసుకోవటం

**ప్రశ్నకర్త:** ఆత్మకి, దానానికి ఎటువంటి సంబంధమూ లేదు కదా, మరి దానం చెయ్యటం అవసరమా కాదా?

**దాదాశ్రీ:** దానం అంటే ఏమిటి? ఇచ్చి పుచ్చుకోవటం. ఈ జగత్తంతా ప్రతిఫల స్వరూపం. కనుక, మీరు ఏం చేస్తే దాని ప్రతిఫలం వస్తుంది, దాని మీద వడ్డీతో పాటు. అందువలన మీరు ఇవ్వండి, తిరిగి తీసుకోండి. పూర్వ జన్మలో ఇచ్చిందిది. మంచి కార్యాలకు డబ్బు ఖర్చుపెట్టారు, లేదా అలాంటిదేమైనా చేసారు. దాని ఫలితం మనకి వచ్చింది. మళ్ళీ అలా చేయకపోతే ఇక ఏమీ లేకుండా పోతుంది. మనం పొలంలోంచి నాలుగు వందల శేర్లు గోధుమలు తెచ్చాం. అందులోంచి యాభై శేర్లు విత్తనానికి పోకపోతే ఏమౌతుంది?

**ప్రశ్నకర్త:** మొలకెత్తదు

**దాదాశ్రీ:** అలాగే ఉంటుంది ఏదైనా. అందుకే ఇవ్వాలి. దాని ప్రతిఫలం వస్తుంది. వెనక్కి ఎన్నో రెట్లయి వస్తుంది. పూర్వ జన్మలో ఇవ్వబట్టే అమెరికా రాగలిగారు. లేకపోతే అమెరికా రావటం సులభమైన పనేనా? ఎంత పుణ్యం చేస్తేనో ఈ ప్లేన్‌లో కూర్చోగలుగుతారు. ఎందరో మనుషులు అసలు ప్లేన్‌ని చూడనుకూడా లేదు.

**ప్రశ్నకర్త:** భారతదేశంలో కస్తూర్‌భాయ్ లాల్‌భాయ్ వంశాలున్నాయి. వారిలో రెండు మూడు నాలుగు తరాల వరకు డబ్బులు బాగానే ఉంటాయి, వాళ్ళ పిల్లలు వాళ్ళ పిల్లల వరకు. కానీ ఇక్కడ అమెరికాలో ఎలా ఉంటుందంటే, తరం మారుతుంది కానీ ఎక్కువలో ఎక్కువ ఏడు ఎనిమిది సంవత్సరాలలో అంతమైపోతుంది. లేదా, డబ్బులుంటే నడిచిపోతుంది. లేకపోతే డబ్బు వస్తుంది కూడా. అందుకు కారణం ఏమవొచ్చు?

**దాదాశ్రీ:** సంగతేమిటంటే, అక్కడి పుణ్యం ఏదైతే ఉందో, భారతదేశంలో పుణ్యం, ఎంత చిక్కగా ఉంటుందంటే, కడుగుతూపోండి, అయినా తరిగిపోదు. పాపం కూడా ఎంత చిక్కగా ఉంటుందంటే, కడుగుతూపోయినా అది కరిగిపోదు. అందువలన వైష్ణవుడైనా జైన్ అయినా, వాళ్ళ పుణ్యం ఎంత బలంగా

ఉంటుందంటే, కడుగుతూపోయినా తరిగిపోదు. అది ఎలా అంటే పేట్‌లాబ్‌లోని దాతార్ సేఠ్, రమణలాల్ సేఠ్‌ల ఏడేడు తరాల వరకు సంపదలతో తులతూగారు. పారలతో తవ్వి తవ్వి ఇతరులకు డబ్బులిస్తుండేవారు. అయినా ఎప్పుడూ తక్కువపడలేదు. ఎంతో పుణ్యాన్ని కూడగట్టుకున్నారు వాళ్ళు– వదిలిపోనంత! అలాగే పాపాన్ని కూడా వదిలిపోనంత కూడగట్టుకుంటారు. వాళ్ళకి ఏడేడు తరాల వరకు దరిద్ర్యం వదిలిపోదు. అత్యంత కష్టాలను అనుభవిస్తారు. అంటే ఎక్సెస్ కూడా అవుతుంది, మీడియమ్ కూడా అవుతుంది.

ఇక్కడ అమెరికాలో పైకి ఎదుగుతుంది, కిందికి పడిపోతుంది, మళ్ళీ పైకి ఎదుగుతుంది. కూలబడిపోయిన తర్వాత తిరిగి పైకి లేస్తుంది. ఇక్కడ ఎక్కువ సమయం పట్టదు. అక్కడ ఇండియాలోనైతే పడిపోయిన తర్వాత తిరిగి పైకి లేవటానికి చాల సమయం పడుతుంది. అందువలన అక్కడ ఏడేడు తరాల వరకు కొనసాగుతుంది. ఇక పుణ్యమంతా తరిగిపోతుంది. ఎందుకంటే, జరిగేది ఏమిటి? కస్తూర్‌భాయ్ ఇంట్లో జన్మనెవరు ఎత్తుతారు? అని అంటే, వాళ్ళలాంటి పుణ్యశాలి మాత్రమే అక్కడ జన్మనెత్తుతాడు అంటాను. మరి అతనికి ఎవరు పుడతారు? మళ్ళీ అలాంటి పుణ్యమూర్తే తిరిగి అక్కడ జన్మనెత్తుతాడు. అక్కడ కస్తూర్‌భాయ్ పుణ్యం పనిచెయ్యదు. అక్కడ అలాంటివాడెవరైనా పుడితే అది అతని పుణ్యం. అంటే, చెప్పుకోవటానికి కస్తూర్‌భాయ్ వంశం. పైగా ఈ కాలంలో అలాంటి పుణ్యమూర్తులు ఎక్కడున్నారు? ఇప్పుడు గత ఇరవై ఐదు సంవత్సరాలలోనైతే అలాంటి మనిషి లేడు.

## నల్లధనం దానం...

**ప్రశ్నకర్త:** లెక్కల్లో చూపించని డబ్బుని దానమిస్తే పనిచేయదా?

**దాదాశ్రీ:** అటువంటి డబ్బుని దానంగా ఇస్తే అది చెల్లదు. అయినా, ఎవరైనా మనిషి ఆకలితో మాడిపోతుంటే, నల్లధనమైనా అతనికైతే తినటానికి పనికివస్తుంది కదా! నల్లధనంలో కొన్ని రకాల విశేషమైన చికాకులుంటాయి. అంతే కాని వేరే విధమైన అభ్యంతరం లేదు. ఆ డబ్బుని హోటల్‌వాళ్ళకిస్తే తీసుకుంటారా లేదా?

**ప్రశ్నకర్త:** తీసుకుంటారు.

**దాదాశ్రీ:** ఔనా, అలా వ్యవహారం ప్రారంభమౌతుంది కూడా.

**ప్రశ్నకర్త:** ఈకాలంలో నల్లధనం ధర్మకార్యాలలో ఖర్చవుతుంటుంది. దానివలన ఆ మనుషులకు పుణ్యోపార్జన జరుగుతుందా?

**దాదాశ్రీ:** తప్పక అవుతుంది కదా! అతను ఎంత త్యాగం చేసాడో అంత! తన దగ్గరకు వచ్చినదాన్ని త్యాగం చేసాడు కదా! కాని అందులో హేతువునిబట్టి ఆ పుణ్యం హేతువుది అయిపోతుంది! ఈ డబ్బులు ఇచ్చాడు అన్నది ఒక్కటే చూడగూడదు. డబ్బులు దానమిచ్చాడన్నది నిర్వివాదం. ఇకపోతే, డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి, హేతువు ఏమిటి అంటే, గవర్నమెంట్ తీసుకునిపోతుంది కనుక ఇందులో వేసేస్తే పోలే అన్నది.

## శాస్త్రపఠనం పాపక్షయం చేస్తుందా?

**ప్రశ్నకర్త:** శాస్త్ర పఠనం వలన పాపక్షయం జరుగుతుందా?

**దాదాశ్రీ:** లేదు. దానివలన పుణ్యం తప్పక వస్తుంది. పాప క్షయం జరగదు. వేరే పుణ్యం కొత్తగా ఏర్పడుతుంది. దాన్ని పుణ్యానుబంధీ పుణ్యం అంటారు. సశాస్త్ర అభ్యాసంలో స్వాధ్యాయం జరుగుతుంది. దానివలన చిత్తంలో ఏకాగ్రత, మనసులో ఏకాగ్రత చాల చక్కగా అవుతుంది.

## ప్రతిక్రమణతో పాపం కడిగివేయబడుతుంది

**ప్రశ్నకర్త:** పాపం కడిగేసుకోవటం వచ్చినట్లయితే?

**దాదాశ్రీ:** అలా కడిగివేసుకోవటమనేది జరగదు, ఒక 'జ్ఞానిపురుష్' మార్గాన్ని సూచించకుండా. అప్పటివరకు పాపాన్ని కడిగేసుకోవటం రానేరాదు. పాపాన్ని కడిగేసుకోవటం అంటే ఏమిటి? ప్రతిక్రమణ చేయటం. అతిక్రమణని పాపం అంటారు. వ్యవహారానికి వ్యతిరేకంగా ఏ పని చేసినా అది పాపమే అవుతుంది, అతిక్రమణ అనిపించుకుంటుంది. కనుక, దానికి ప్రతిక్రమణ చేయవలసివుంటుంది. దానితో పాపాలన్నీ కడిగివేయబడతాయి లేకపోతే పాపం కడిగివేయబడదు.

## తెచ్చిపెట్టుకుని చేసేది ఎప్పటికీ పశ్చాత్తాపం అవదు

**దాదాశ్రీ:** అటువంటి ప్రతిక్రమణలు మీరు ఎన్ని చేస్తారు?

**ప్రశ్నకర్త:** ఎవరికైనా దుఃఖం కలిగితే, వెంటనే పశ్చాత్తాపపడతాను.

**దాదాశ్రీ:** పశ్చాత్తాపమంటే వేదన కలుగుతుందే, అది. పశ్చాత్తాపం ప్రతికమణ అనిపించుకోదు. అయినా అది మంచి పనే.

**ప్రశ్నకర్త:** ఒక పక్క పాపం చెయ్యటం, మరో పక్క పశ్చాత్తాపపడటం, అలా జరుగుతూనేవుంటుంది.

**దాదాశ్రీ:** అలా అవదు. పాపం చేసిన వ్యక్తి పశ్చాత్తాపపడటమనేది తెచ్చిపెట్టుకుని చేసేది కాదు. నిజమైన పశ్చాత్తాపం అవుతుంది. పశ్చాత్తాపం నిజమైనదౌతుంది. అప్పుడు ఉల్లిపాయ పొర ఒకటి ఊడిపోతుంది. అయినా ఉల్లిపాయ తిరిగి సంపూర్ణంగా కనపడుతుంది. ఆ తర్వాత మరో పొర ఊడిపోతుంది. పశ్చాత్తాపం ఎప్పుడూ వ్యర్థం అవదు. ప్రతి ధర్మంలోను పశ్చాత్తాపపడటాన్ని బోధించారు. క్రిస్టియన్స్‌లో కూడా పశ్చాత్తాపపడమని చెప్తారు.

## పాపాలకు ప్రాయశ్చిత్తం ఎలా చేసుకోవాలి?

**ప్రశ్నకర్త:** భగవాన్ మందిరానికి ప్రతి ఆదివారం వెళ్ళి, తాను చేసిన పాపాలను ఒప్పుకుంటున్నట్లయితే పాపాలకు క్షమాపణ లభించినట్లే కదా?

**దాదాశ్రీ:** ఈ విధంగా పాపం గనక తుడిచిపెట్టుకుని పోతున్నట్లయితే, ఎవరూ రోగాలబారిన పడనేపడరు కదా? ఇక ఎవరికీ దుఖమనేదే కలుగదు కదా? కానీ వీళ్ళు అపార దుఖాన్ని పొందుతున్నారు. క్షమాపణ కోరుకోవటంలో అర్థమేమిటంటే, మీరు క్షమాపణ కోరుకుంటున్నప్పుడు మీ పాపపు మూలం కాలిపోతుంది. అందువలన దానికి ఇక మరెటువంటి ఎదుగుదలా ఉండదు కానీ, దాని ఫలాలనైతే అనుభవించాల్సివుంటుంది కదా!

**ప్రశ్నకర్త:** ఎన్నో చెట్లు తిరిగి చిగురిస్తాయి.

**దాదాశ్రీ:** సరిగ్గా కాలకపోతే తిరిగి చిగురిస్తాయి. ఇకపోతే, మూలం ఎంత కాలినప్పటికీ, ఫలాలనైతే అనుభవించాల్సివుంటుంది. భగవాన్‌కి కూడా అనుభవించవలసివచ్చింది. కృష్ణ భగవానునికి కూడా ఇక్కడ (పాదంలో) బాణం గుచ్చుకుంది. అందులో చేసేదేమీ లేదు. నాకు కూడా అనుభవించవలసే వుంటుంది.

ప్రతి ధర్మంలోను క్షమాపణకి స్థానం ఉంటుంది. క్రిస్టియన్, ముస్లిం, హిందు అందరికీ ఉంటుంది. కాకపోతే వేరు వేరు విధానాలలో ఉంటుంది.

**ప్రశ్నకర్త:** క్రిస్టియన్ ఫాదర్ కూడా, మా దగ్గరకు వచ్చి కన్ఫెషన్ (తప్పు ఒప్పుకోవటం) చేయమని, దానివలన పాపాలన్నీ పోతాయని చెప్తారు.

**దాదాశ్రీ:** అలా కన్ఫెస్ చేయటం ఏమైనా సులభమైన పనా? మీరు కన్ఫెషన్ చెయ్యగలరా? చీకటి రాత్రిలో చీకట్లో చేస్తారు. ఆ వ్యక్తి వెలుగులో తన ముఖం చూపించలేడు. రాత్రికి చీకటిపడుతుంది కదా అప్పుడు కన్ఫెషన్ చేస్తాను అంటాడు. మరి నా దగ్గర నలభైవేల మంది అందులో ఆడపిల్లలు కూడా అంతా కన్ఫెస్ చేసారు. ప్రతి ఒక్క విషయాన్నీ కన్ఫెస్ చేసారు. ఇలా రాసి ఇచ్చారు. అందరిలో కన్ఫెస్ చేసారు. అలాంటప్పుడు పాపం నాశనమౌతుంది కదా? కన్ఫెస్ చెయ్యటం సులభం కాదు.

**ప్రశ్నకర్త:** అంటే, ఇక్కడ ప్రతిక్రమణ చేస్తున్నారు, అక్కడ కన్ఫెషన్. రెండూ సమానమే అయ్యాయి కదా?

**దాదాశ్రీ:** లేదు అవి సమానం కాలేదు. ప్రతిక్రమణ అనేది అతిక్రమణ జరిగినపుడు కడిగివేసేది. మళ్ళీ మరక పడితే మళ్ళీ కడగాలి. కానీ పాపాన్ని కన్ఫెస్ చేయటం, ఒప్పుకోవటం రెండూ వేరు వేరు.

**ప్రశ్నకర్త:** ప్రతిక్రమణ, పశ్చాత్తాపం వీటిలో తేడా ఏమిటి?

**దాదాశ్రీ:** పశ్చాత్తాపమనేది ఒక ప్రత్యేకమైనదానికి కాదు. క్రిస్టియన్స్ ఆదివారం నాడు చర్చ్‌లో పశ్చాత్తాపపడతారు. ఏమేం పాపాలు చేసారో, వాటన్నిటికీ

సామూహికంగా పశ్చాత్తాపపడతారు. కానీ ప్రతిక్రమణ ఎలాంటిదంటే, ఎవరైతే తుపాకీ కాల్చారో, ఎవరైతే అతిక్రమణ చేసారో, వారు ప్రతిక్రమణ చేస్తారు, అదే క్షణంలో! 'షూట్ ఆన్ సైట్' (కనపడగానే కాల్చేయటం) దాన్ని కడిగివేస్తుంది. దాన్ని భావ ప్రతిక్రమణ అంటారు.

## పశ్చాత్తాపంతో దండన తగ్గుతుంది

**ప్రశ్నకర్త:** పాప నిర్మూలనానికి ఉత్తమమైన మార్గం ప్రాయశ్చిత్తం. ఇది చాల చక్కని మాట. పురాణాలలోని సత్పురుషులు అలా చెప్పారు. హంతకుడు హత్య చేసిన తర్వాత పశ్చాత్తాపపడితే అతని క్షమ లభిస్తుందా?

**దాదాశ్రీ:** హత్య చేసిన తర్వాత ఆ హంతకుడు ఆనందపడుతుంటే, అందుకు అతనికి పడవలసిన పన్నెండు నెలల దండన మూడు సంవత్సరాలకు పడుతుంది. కానీ హంతకుడు హత్య చేసిన తర్వాత పశ్చాత్తాపపడితే, పన్నెండు నెలలకు పడవలసిన దండన ఆరు నెలలకే పడుతుంది. ఏదైనా తప్పు చేసి ఆనందపడితే, అది మూడురెట్లు ఫలితాన్నిస్తుంది. ఆ కార్యం తర్వాత తప్పుచేసానే అని పశ్చాత్తాపపడితే దండన తగ్గిపోతుంది.

## జ్ఞాని ఇచ్చిన జ్ఞానంతో కర్మల నుంచి విముక్తి

**ప్రశ్నకర్త:** వ్యవహార రీత్యా ఎన్నోసార్లు వేరువేరు కర్మలు చేయవలసివస్తుంది. వాటిని చెడు కర్మలు లేక పాప కర్మలు అంటారు. అటువంటి పాప కర్మల నుంచి ఎలా తప్పించుకోవచ్చు?

**దాదాశ్రీ:** పాపకర్మలకు ప్రతిగా అతనిలో ఎంత జ్ఞానం ఉంటే అంత హెల్ప్ చేస్తుంది. మనం ఇక్కడి నుంచి స్టేషన్‌కి వెళ్ళాలనుకో, స్టేషన్‌కి వెళ్ళాలనే జ్ఞానం మనకి ఉంటే అది మనలను అక్కడికి చేర్చుతుంది. పాప కర్మల నుంచి ఎలా తప్పించుకోవచ్చు? అంటే, అందులో ఎంత జ్ఞానం ఉంటే, పుస్తకంలో కాని, లేక మరెవరి దగ్గరా జ్ఞానం ఉండదు. అది వ్యవహారిక జ్ఞానం. నిశ్చయ జ్ఞానం కేవలం జ్ఞానుల దగ్గరే ఉంటుంది. పుస్తకాలలో ఆ నిశ్చయ జ్ఞానం ఉండదు. జ్ఞానుల

హృదయాలలో దాగివుంటుంది. ఆ నిశ్చయ జ్ఞానాన్ని మనం వాణి రూపంలో విన్నట్లయితే, మనకి సమాధానం దొరుకుతుంది. లేదంటే పుస్తకంలో వ్యవహారిక జ్ఞానం ఉంటుంది. అది ఎంతో స్పష్టీకరణను ఇవ్వగలుగుతుంది. దానివలన బుద్ధి పెరుగుతుంది. మతి జ్ఞానం పెరుగుతుంది. శ్రుతజ్ఞానంతో మతి జ్ఞానం పెరుగుతుంది. పాపాల నుంచి విముక్తినెలా పొందాలి అన్నదానికి పరిష్కారాన్ని మతిజ్ఞానం తీసుకునివస్తుంది. మరే ఇతర ఉపాయమూ లేదు. లేదా ప్రతిక్రమణతో ముక్తులవవచ్చు. అయితే ప్రతిక్రమణ ఎలా చెయ్యాలి? 'షూట్ ఆన్ సైట్' అవాలి. తప్పు చేస్తూనే ప్రతిక్రమణ చేసినట్లయితే విముక్తి లభిస్తుంది.

## పాపం పండుతున్న సమయంలో ఈ విధులను చెయ్యాలి

**ప్రశ్నకర్త:** ప్రతిక్రమణ వలన కొత్తగా పాపాలు అంటుకోవేమో కానీ, పాత పాపాలనైతే అనుభవించాలి కదా?

**దాదాశ్రీ:** మీరనేది నిజం. ప్రతిక్రమణ వలన కొత్త పాపాలేమీ అంటుకోవు. కానీ, పాత పాపాలనైతే అనుభవించవలసి వుంటుంది. అయితే ఆ *భోగవటా* (అనుభవించేది) తప్పక తగ్గిపోతుంది. దానికోసం కూడా నేను ఒక మార్గాన్ని సూచించాను. మూడు మంత్రాలున్నాయి వాటిని ఒకేసారి చదవాలి. దానివలన కూడా *భోగవటా* ఫలం తేలికైపోతుంది. ఎవరి తలమీదైనా ఒకటిన్నర మణుగుల బరువుందనుకోండి, అతను పాపం భరించలేకపోతున్నాడనుకోండి, అతనికి ఒక్కసారిగా ఏదైనా అతని దృష్టిలో పడితే అతను తన దుఃఖాన్ని మర్చిపోతాడు. బరువు అలాగే ఉంటుంది కానీ అతని దుఃఖం తగ్గిపోయినట్లనిపిస్తుంది. అలాగే ఈ త్రిమంత్రం ఏదైతే ఉందో, దాన్ని చదివితే భారం తగ్గిపోతుంది.

మంత్రం అనేదానికి నిజమైన అర్థం ఏమిటి? మంత్రం అంటే మనసుకి శాంతి కలిగించేది. భగవాన్ మీద భక్తితో ప్రాపంచిక వ్యవహారాలు చేస్తుంటే విఘ్నం కలుగకుండా ఉంటుంది. అందుకే భగవాన్ త్రిమంత్రాన్నిచ్చారు. 1. నవకార మంత్రం, 2. ఓం నమో భగవతే వాసుదేవాయ, 3. ఓం నమఃశివాయ. అంటే, ఈ మంత్రాలు హెల్పింగ్ చేసేవి. మీరు ఏ రోజైనా త్రిమంత్రం చదివారా? ఒకేరోజు త్రిమంత్రం

చదివారా? కాస్త ఎక్కువ చదవగూడదూ, అంతా తేలికైపోతుంది, మీలో కలిగే భయాలు కూడా తొలగిపోతాయి కదా.

పుణ్యం ఉదయిస్తే ఏం జరుగుతుంది? అంతా ఇచ్ఛానుసారం జరిగేటట్లుగా చేస్తుంది. పాపం ఉదయించినపుడు ఏమౌతుంది? అంతా ఇచ్ఛకి ప్రతికూలంగా జరిగేటట్టుగా చేస్తుంది.

## పాపం కడిగివేయబడుతుందన్న నమ్మకం

**ప్రశ్నకర్త:** మన పాప కర్మలను ఇప్పుడు ఏ విధంగా కడిగివేయాలి?

**దాదాశ్రీ:** పాపకర్మల మచ్చలు ఎంతగా పడివున్నాయో అంత ప్రతిక్రమణ చేయాలి. ఆ మరకలు గాఢంగా ఉంటే మళ్ళీ మళ్ళీ కడగాలి, మళ్ళీ మళ్ళీ కడగాలి.

**ప్రశ్నకర్త:** ఆ మరకలు పోయాయా లేదా అన్నది ఎలా తెలుస్తుంది?

**దాదాశ్రీ:** మనసులో జాగరూకతతో ఉంటే అది కూడా తెలుస్తుంది. ముఖంలో ప్రశాంతత ఉంటుంది. మరకపోయిందన్నది మీకు తెలియదా? ఎందుకు తెలియదు? ఇబ్బంది ఏముంటుంది. ఒకవేళ శుభ్రం కాకపోయినా ఏం పరవాలేదు మనకి. నువ్వు ప్రతిక్రమణ చెయ్యి! నువ్వు సబ్బు పెడుతూనేవుండు. పాపాన్ని నువ్వు గుర్తుపడతావా ఏమిటి?

ఎదుటివారికి దుఖం కలిగితే అది పాపం, ఏ జీవికైనా, మనిషైనా, జంతువైనా లేక చెట్టయినా సరే. అవసరం లేకుండా చెట్ల ఆకులు తెంచుకుంటూపోతుంటే, దానికీ బాధ కలుగుతుంది. అందువలన అది పాపం అవుతుంది. అందువలన కొంచెమైనా సరే, కించిత్‌మాత్రమైనా అలా జరగకూడదు.

**ప్రశ్నకర్త:** అయితే, మనిషి తన స్వభావాన్నిబట్టి చేసినా అందులో పుణ్యం, పాపమనేవి కలుగుతాయా?

**దాదాశ్రీ:** ఎదుటివారికి దుఃఖం కలిగితే అది పాపం అవుతుంది. అతను తన స్వభావాన్నిబట్టే చేస్తాడులే కాని, అతను, నా స్వభావం వలన ఇతరులకు బాధ కలుగుతున్నదికదా అని అర్థం చేసుకోవాలి. కనుక అతనిని క్షమాపణ కోరుకోవాలి, నా స్వభావం వక్రంగా ఉండబట్టి అతనికి దుఃఖం కలిగింది కనుక నన్ను క్షమించండి అని.

మనం ప్రతిక్రమణ చేస్తే చాల మంచిది. మన బట్టలే శుభ్రమౌతాయి కదా? మన బట్టలలో మురికిని ఎందుకు ఉండనివ్వాలి? దాదా ఇలాంటి మార్గాన్ని సూచించారు కదా ఎందుకు శుభ్రపరచగూడదు?

**ప్రశ్నకర్త:** అతిక్రమణ ఎప్పుడు జరుగుతుంది, పూర్వ జన్మలో లెక్క బాకీ ఉంటేనే కదా?

**దాదాశ్రీ:** ఔను. అప్పుడే జరుగుతుంది.

**ప్రశ్నకర్త:** అంటే, మన కోసం ప్రతిక్రమణ చేస్తుంటే గత జన్మలోని పాపాలన్నిటికీ కూడా ప్రతిక్రమణ జరుగుతుంటుందా?

**దాదాశ్రీ:** ఆ బాకీలను మనం తీర్చేస్తాం. అంటే మనవాళ్ళు షూట్ ఆన్ సైట్ ప్రతిక్రమణ చేస్తుంటే దానివలన తన సొంత కర్మలు తొలగిపోయి నిర్మలమౌతారు.

## వ్యవసాయంలో పాపాన్ని కడిగేసే విధి

**ప్రశ్నకర్త:** మేము రైతులం. పొగాకుని పండిస్తాం. ప్రతి మొక్క పై లేలేత ఆకులను అంటే వాటి మెడను మేము విరిచేయవలసివుంటుంది. ఆ పాపమైతే మాకు అంటుకుంటుంది కదా? ఈ పాపానికి నివారణ ఏమిటి?

**దాదాశ్రీ:** మీరు మీ మనసులలో అనుకోవలసింది ఏమిటంటే, ఈ రకమైన వ్యాపారం నా మెడకు ఎందుకు చుట్టుకుంది అని. అది చాలు. మొక్క లేత ఆకులను తుంచివేయటం, మనసులో ఈ పని నా వాటాకి ఎందుకు వచ్చింది అని

అనుకోవటం అలా పశ్చాత్తాపపడాలి. ఇలా చేయటం సరికాదు అని మనసులో ఉండాలి అంతే.

**ప్రశ్నకర్త:** అయితే ఆ పాపమైతే జరిగింది కదా?

**దాదాశ్రీ:** అదైతే జరిగింది. అది మీరు చూడకండి. జరుగుతూవున్న పాపకార్యాలను చూడకండి. ఇలా జరిగివుండగూడదు అన్నది మనసులో దృఢంగా ఉండాలి. నిశ్చయం చేసుకోవాలి. ఈ పని నాకెందుకు దొరికింది? వేరే ఏదైనా మంచి పని దొరికితే ఇది చేయకపోదును. ఇది తెలియనంత వరకు పశ్చాత్తాపమనేది జరగదు. సంతోషంగా మొక్కను పీకిపడేస్తారు. నేను చెప్పినట్లుగా చేయండి. ఇక ఆ పై మీ బాధ్యతంతా నాది. మొక్కను పడేయండి. అదేం పరవాలేదు. పశ్చాత్తాపం ఉండాలి ఈ పని నా వాటాకి ఎందుకు వచ్చిందా అని.

**ప్రశ్నకర్త:** పత్తి మీద మందు చల్లవలసివుంటుంది. మరి ఏం చెయ్యాలి? దానివలన హింసయితే జరుగుతుంది కదా?

**దాదాశ్రీ:** అనివార్య కార్యాలు ఏమేమి ఉన్నాయో వాటిని, ప్రతిక్రమణ చెయ్యాలి అనే షరతు మీద చెయ్యండి. మీకు ఈ ప్రపంచంలో వ్యవహారాన్ని ఎలా నిర్వహించాలో తెలియదు. అది నేను నీకు నేర్పుతాను- దానివలన మీకు కొత్త పాపమేమీ అంటుకోకుండా ఉండేందుకు.

వ్యవసాయంలో జీవులు మరణిస్తాయి. దాని దోషమైతే అంటుకుంటుంది కదా? అందువలన వ్యవసాయం చేసేవారు ప్రతిరోజు ఐదు పది నిమిషాలు భగవత్ప్రార్థన చేయాలి. జరిగిన దోషానికి క్షమాపణ కోరుకోవాలి. నీవు ఈ వ్యాపారం చేస్తావు, అందులో జీవులెన్నో మరణిస్తాయి కనుక అందుకు ఇలా ప్రతిక్రమణ చేయమని నేను రైతులకు చెప్తుంటాను.

## పాపం వందశాతం కడిగివేయబడుతుంది

**ప్రశ్నకర్త:** అంటే, క్షమాపణ కోరుకుంటే మన పాపాలకు నివారణ జరుగుతుందా?

**దాదాశ్రీ:** పాపాలు నివారణ అయ్యేదే దానితో. వేరే మార్గమేమీ లేదు.

**ప్రశ్నకర్త:** అంటే మళ్ళీమళ్ళీ క్షమాపణలు కోరుతుండటం, మళ్ళీమళ్ళీ పాపాలు చేస్తుండటమేనా?

**దాదాశ్రీ:** మళ్ళీ మళ్ళీ క్షమాపణలు కోరుకునే స్వేచ్ఛ ఉంది. మళ్ళీమళ్ళీ క్షమాపణలు కోరుతుండాలి. ఔను, విముక్తి పొందటానికి నూరు శాతం మార్గం ఇదే. క్షమాపణ కోరుకోవటం తప్ప విముక్తికి మరెటువంటి మార్గమూ లేదు ఈ ప్రపంచంలో. ప్రతిక్రమణతో పాపాలన్నీ తుడిచిపెట్టుకునిపోతాయి.

**ప్రశ్నకర్త:** ప్రతిక్రమణ చేస్తే పాపాలు నాశనమౌతాయి అన్నదాని వెనుక సైన్స్ ఏమిటి?

**దాదాశ్రీ:** అతిక్రమణతో పాపం అంటుకుంటుంది, ప్రతిక్రమణతో పాపం నశిస్తుంది. వెనుదిరిగి రావటంతో పాపాలు నశిస్తాయి.

**ప్రశ్నకర్త:** అయితే మరి కర్మ నియమం ఎక్కడ వర్తిస్తుంది? మనం క్షమాపణ కోరుకుని కర్మల నుండి విముక్తిచెందుతాం అంటే అందులో కర్మ నియమం పనిచేయటంలేదు కదా?

**దాదాశ్రీ:** ఇదే కర్మ నియమం! క్షమించమని ప్రార్థించటమే కర్మ నియమం!!

**ప్రశ్నకర్త:** అలా అయితే అందరూ పాపాలు చేస్తూపోవటం, తర్వాత క్షమించమని కోరుకుంటుంటే?

**దాదాశ్రీ:** ఔను పాపం చేస్తూపోండి, క్షమాపణ కోరుతూపోండి. ఇదే భగవాన్ చెప్పింది.

**ప్రశ్నకర్త:** కానీ మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుకోవాలి కదా?

**దాదాశ్రీ:** క్షమించమని అడిగేవారు మనస్పూర్తిగానే క్షమించమని అడుగుతారు. అయితే, మనస్పూర్తిగా కోరకపోయినప్పటికీ సర్దుకుపోతాం. అయినా సరే క్షమాపణ కోరుకోండి.

**ప్రశ్నకర్త:** అది అతనికి అలవాటైపోతుందేమో?

**దాదాశ్రీ:** అలవాటైతే అవనీ కానీ క్షమాపణైతే కోరుకోండి. క్షమాపణ కోరకుండా నడవదని తెలుసుకో. క్షమాపణ కోరుకోవటం అంటే ఏమిటి? దాన్నే ప్రతిక్రమణ అంటారు. తప్పులు చేయటాన్ని ఏమంటారు? అతిక్రమణ.

కర్మ నియమం ఏమిటి? అతిక్రమణ చేస్తే దానికి ప్రతిక్రమణ చెయ్యాలి. అర్థమైందా మీకు?

**ప్రశ్నకర్త:** ఆ.

**దాదాశ్రీ:** అందువలన క్షమాపణ తప్పక కోరుకో. ఇక ఈ తెలివితేటలు, అతితెలివిని పక్కనపెట్టు. ఏమైనా తప్పుచేసి, క్షమాపణ కోరుకుంటూవుంటే కోరుకోనీ! 'దిస్ ఈజ్ కంప్లీట్ లా' (ఇది సంపూర్ణ న్యాయం).

## పశ్చాత్తాపం సర్వశ్రేష్ఠమైన సబ్బు

**ప్రశ్నకర్త:** పాపాలను పోగొట్టుకోవటానికి ప్రాయశ్చిత్తంకన్నా వేరే మార్గమేమీ లేదా?

**దాదాశ్రీ:** పాపాలను పోగొట్టుకోవటానికి ప్రాయశ్చిత్తంకన్నా వేరే ఉపాయమేమీ లేదు. ఈ పాపాలన్నీ, అంటే ఏమిటి? ఈ పాపాలనేవి ఉన్నాయే, వేటిని మనం పాపాలని అంటాము? అంటే ఏం చెప్తానంటే, మీరు చేసే ఈ పనులన్ని చెయ్యండి ఏమీ పరవాలేదు. ఇవన్నీ ఉన్నాయి. వీటితో ఎవరికీ అభ్యంతరమేమీ లేదు. అందులో ఒక వ్యక్తి, 'మీరెందుకు ఆలస్యంగా వచ్చారు' అని అడిగాడు. నన్ను అలా అంటే, అతను అతిక్రమణ చేసాడు అని అంటారు. ఇతరులకు ఏదైతే ఇష్టం ఉండదో, అది ఎందుకు అంటారు? దాన్ని అతిక్రమణ చేసారు అని అంటారు.

వాళ్ళు అతిక్రమణ చేస్తారు కనుకనే ప్రతిక్రమణ చేయమని భగవాన్ అన్నారు. అంటే, పశ్చాత్తాపం ఎంతవరకు చేయాలి? దేనివలనైతే ఇతరులకు దుఃఖం కలిగిందో, అటువంటిదానికి పశ్చాత్తాపపడాలి. వాళ్ళు ఇష్టపడ్డవాటికి అవసరం లేదు. అంటే ప్రాయశ్చిత్తం చేయాల్సివుంటుంది. నీవు చేస్తావా?

**ప్రశ్నకర్త:** ఆ.

**దాదాశ్రీ:** దాదా భగవాన్ పేరుతో ప్రతిక్రమణ చేస్తావా లేదా?

**ప్రశ్నకర్త:** ఆ పుస్తకం ఇచ్చారు కదా, దాని ప్రకారం చేస్తాను. నౌకల్మే చేస్తాను.

**దాదాశ్రీ:** చేస్తున్నారు కదా, అది ప్రతిక్రమణే. అన్నిటికన్నా పెద్ద ప్రతిక్రమణ. దాదా భగవాన్ నౌకల్మే ఉన్నాయి కదా, అవి జగత్కళ్యాణం కావించే ప్రతిక్రమణ.

**ప్రశ్నకర్త:** ఇదైతే నిజం. పశ్చాత్తాపపడుతున్న సమయంలో ఎంతటి పాపమైనా...

**దాదాశ్రీ:** తేలికైపోతుంది. పశ్చాత్తాపం వలన.

**ప్రశ్నకర్త:** పూర్తిగా దగ్ధమై బూడిదైపోదా?

**దాదాశ్రీ:** పూర్తిగా దగ్ధమైపోవటం కూడా జరుగుతుంది. అలా ఎన్నో పాపాలు కాలిపోతుంటాయి. పశ్చాత్తాపమనే సబ్బు ఎలాంటిదంటే, చాలరకాల బట్టల మీద బాగా పనిచేస్తుంది.

**ప్రశ్నకర్త:** అదికూడా, మీ సాక్షిగా చేస్తున్నట్లయితే మరింకేం మిగులుతుంది?

**దాదాశ్రీ:** కళ్యాణమౌతుంది. అందుకే పశ్చాత్తాపమనే సబ్బుకి సమాన సబ్బు ఈ ప్రపంచంలో మరేదీ లేదు.

## పాపపుణ్యాల నుంచి నివృత్తి లేనేలేదు...

**ప్రశ్నకర్త:** పాపం అంటే ఏమిటి, పుణ్యం అంటే ఏమిటి అన్నది సాధారణ మానవులందరికీ తెలిసిందే అయినప్పటికీ వారిలో నివృత్తి ఎందుకు అవలోకపోతారు?

**దాదాశ్రీ:** ఇదే ప్రశ్నను దుర్యోధనుడు కృష్ణ భగవానుని అడుగుతూ, నాకు పాపం అంటే ఏమిటో తెలుసు, పుణ్యం అంటే ఏమిటో తెలుసు, అంటే ధర్మాధర్మా లను ఎరుగుదును. కానీ నాకు అధర్మం నుంచి నివృత్తి అవటం లేదు, ధర్మ ప్రవృత్తి రావటంలేదు అంటాడు.

**ప్రశ్నకర్త:** అది ఎందుకు అవదు?

**దాదాశ్రీ:** అతను ఆ అధర్మాన్ని తెలుసుకోనేలేదు. ముందుగా తెలుసుకోవలసింది, 'నేను ఎవరు?' అన్నది. ఇదంతా ఎందుకోసం ఉంది? ఈ అన్న ఎందుకు నా మీద పడగవిప్పుతున్నాడు? నాకు మరో సోదరుడు ఎందుకు లభించలేదు. ఇతను రోజూ తిట్లు తింటూవుంటాడే, ఇలాంటి సోదరుడు ఎందుకు లభించాడు? అతనికైతే చాల మంచి సోదరుడు లభించాడు కదా, వీటంతటికీ కారణం ఏమిటి? అదంతా తెలుసుకోవద్దా?

**ప్రశ్నకర్త:** అది ఎలా తెలుసుకోవాలి?

**దాదాశ్రీ:** అదంతా పూర్వజన్మలో మీ ఖాతాలో ఉన్నవి. ఏ భగవాన్ కూడా ఇందులో చెయివేయలేదు. ఇది ప్రతివారికీ వారివారి కర్మల ఖాతా నుంచి వచ్చే లాభనష్టాలే. అందులో అహంకారం రావటం వలన శుద్ధ పాపపుణ్యాలు కలుగుతాయి. వాటిని అనుభవించేందుకు తిరిగి వెళ్ళవలసివుంటుంది. కనుకనే ఆ గతులలో తిరగవలసివుంటుంది. అనీ జైళ్ళే. ఆ జైళ్ళలో అనుభవించి వస్తారు, తిరిగి వచ్చి ఎలా ఉన్నవారు అలాగే మళ్ళీ. తిరిగి అహంకారానికి పోకపోతే విముక్తి లభిస్తుంది. కనుక మోక్షం కావాలనుకుంటే ముక్తి చెందు. అందులో 'నేనెవరు?' అని శోధించి తెలుసుకుంటే ముక్తిచెందుతారు.

## లాభనష్టాలకు ఏమిటి కారణం?

పంచేంద్రియాల ద్వారా వచ్చే అనుభవాలన్నీ 'డిశ్చార్జ్'. ఇదంతా పుణ్యం మీద ఆధారపడి, స్వయంగా చేసుకున్న ధారణనుబట్టి ఉంటుంది. దాన్ని అహంకారమేమో, 'నేనే చేసాను' అంటుంది. పాపం పండి నష్టం కలిగితే, 'భగవంతుడే చేసాడు!' అంటారు. లేకపోతే 'నా గ్రహాలు బాగోలేవు!!' అంటారు. ఇకపోతే సంపాదన సహజంగా వచ్చేదే. మనిషి ఎవరూ ఏమీ సంపాదించలేడు. ఒకవేళ కాయకష్టం చేసి సంపాదిస్తే, దాన్ని సంపాదించింది ఆ శ్రమ! సంపాదించేదంతా మీ పుణ్యమే. కానీ అహంకారంతో, 'నేను సంపాదించాను, నేను సంపాదించాను' అంటారు. అలా పది లక్షలు సంపాదించినంత వరకు ఛాతీ విరుచుకుని తిరుగుతారు. ఐదు లక్షలు నష్టం వచ్చినపుడు, 'సేర్, ఎందుకలా జరిగింది?' అని నేను అడిగితే, భగవాన్‌కి కోపం వచ్చింది' అంటాడు. చూడండి. అంటే అతనికి మరెవరూ దొరకలేదు, వేరెవరూ దొరకరు కూడా. పాపం భగవాన్ తలకి రుద్దుతాడు అంతా. మీరు మనసులో కోరుకున్నది (ధారణకి అనుగుణంగా) జరిగిందంతా మీ పుణ్య ఫలం. అందుకు వ్యతిరేకంగా జరిగేది పాప ఫలం. ఈ జగత్తులో మీరు స్వయంగా చేసుకునే ధారణ ప్రకారం ఏమీ జరగదు. మీరు కోరుకున్న ఫలితం వస్తే అది మీ పుణ్య ప్రారబ్ధం. ధారణ ప్రకారం జరగకపోతే అది పాప ప్రారబ్ధం.

## పాపపుణ్య బంధాలు ఏర్పడేది అహంకారంతోనే

**ప్రశ్నకర్త:** నాకు అహంకారం కాని, మమకారం కాని లేకపోతే లేదా రెండిటిలో ఒక వస్తువు లేకపోతే, నేను ఎటువంటి కర్మ చేసినట్లు?

**దాదాశ్రీ:** అహంకారంతోనే పాపపుణ్యాలు ఏర్పడుతాయి. అహంకారం పోయిందంటే పాపపుణ్యాలు పోయినట్లే. అహంకారం తక్కువగా ఉండేవారికి భౌతిక సుఖాలు లభిస్తాయి. అహంకారాన్ని తక్కువ చేసాడు, దానివలన కర్మ బంధం పడింది. దాని ఫలితంగా భౌతికమైన సుఖాలు లభిస్తాయి. ఎక్కువ అహంకారం వలన కర్మ బంధం ఏర్పడింది, దానివలన భౌతికమైన కష్టాలు కలిగాయి. అహంకారాన్ని తగ్గించినపుడు ఆ అహంకారం ఎక్కడికీ పోదు. కానీ అది భౌతిక సుఖాలనిస్తుంది. జ్ఞాని ఉన్నచోట అహంకారం వెళ్ళిపోతుంది. లేకపోతే అహంకారం పోదు.

ఒక హద్దు వరకే అహంకారం తగ్గుతుంది. దానితో ప్రపంచంలో ఏ అడ్డంకీ ఉండదు. మహావీర్ భగవాన్ ఆజ్ఞలో ఉంటే, అహంకారం ఒక హద్దు వరకు తగ్గిపోతుంది కానీ, నార్మల్‌గా ఉంటుంది. నార్మల్ అహంకారం ఉంటే ప్రపంచంలో క్లేశమేమీ ఉండదు. ఇంట్లో క్లేశాలు, అంతర్‌క్లేశాలు ఏమాత్రం ఉండవు. ఇది క్రమిక మార్గంలోనూ ఉంటుంది. ఈమాత్రం ఎవరికైనా జరుగతుంది. కొంతమందికే క్లేశాలు, అంతర్‌క్లేశాలు ఉండవు. కానీ ఆ అహంకారాన్ని కూడా మోక్ష ప్రాప్తి కోసం తీసివేయవలసివుంటుంది.

ఆ అహంకారం పోయి 'నేను' ఎవరు అనే రియలిజమ్ అనుభవంలోకి వచ్చిందంటే, ఇక కర్మబంధం ఉండదు. జడ్జికి కూడా కర్మ బంధం పడదు. దానేశ్వరునికి కూడా కర్మబంధం ఉండదు. సాధువుకి కర్మంబంధం ఉండదు, కసాయికి కూడా కర్మబంధం పడదు. నేనేం చెప్తున్నాను? ఎందుకలా ఆశ్చర్యపోతున్నారు? కసాయి అన్నాననా? కసాయిని అడిగితే చెప్తాడు, అయ్యా ఇది నా తాతల నుంచి వస్తున్న వ్యాపారం అని.

**ప్రశ్నకర్త:** అహంకారి కనుకనే కదా పుణ్యం అనే పదాన్ని ఉపయోగించటం జరుగుతుంది, అహంకారి కనుకనే కదా పాపం అనే పదాన్ని ఉపయోగించటం జరుగుతుంది.

**దాదాశ్రీ:** అది నిజం. అహంకారం ఉండటం వలనే పాపం, పుణ్యం అనే పదాలను ఉపయోగించటం జరుగుతుంది. కానీ అహంకారం అతన్ని కాస్త మారుస్తుంది. మరిక పెద్ద తేడా ఏమీ ఉండదు. అద్దైతే అవుతుంది అదీ సంగతి. అది, ఇట్ హాపెన్స్ అవుతుంది, కొత్తగా తిరిగి వస్తోంది. కొత్త సినిమా తయారౌతోంది. ఈ పాత సినిమా తెరుచుకుంటోంది.

అహంకారం ఉన్నంత వరకు కొత్త చిత్ర నిర్మాణం చెయ్యకుండా ఉండరు. నేను ఎంత చెప్పినా, కొత్తగా చిత్ర నిర్మాణం చేయకుండా ఉండరు కదా. అహంకారం ఏమేం చేయించదు? అహంకారంతోనే ఈ పరిస్థితంతా వచ్చింది. అహంకారం విలయం అయినట్లయితే ముక్తి.

## పుణ్యానికి, ఆత్మకి ఉన్న సంబంధం

**ప్రశ్నకర్త:** ఆత్మకి పుణ్యంతో ఏమైనా సంబంధం ఉంటుందా?

**దాదాశ్రీ:** ఏమీ సంబంధం ఉండదు. కానీ, 'ఇది నేను చేస్తున్నాను' అన్న బిలీఫ్ ఉంటే మాత్రం సంబంధం ఉంటుంది. 'నేను కాదు ఇదంతా చేస్తున్నది' అన్న రైట్ బిలీఫ్ వచ్చిందంటే ఇక ఆత్మకి, పుణ్యానికి ఎటువంటి సంబంధమూ ఉండదు. 'నేను దానం చేస్తున్నాను', 'నేను దొంగతనం చేస్తాను' ఈ రెండూ ఇగోయిజమే. ఏదైనా చేస్తున్న సందర్భం ఉంటే అక్కడ పుణ్యం కాని లేక పాపం కాని అంటుకుంటాయి.

## అజ్ఞానంలోనే పుణపాప బంధాలు, కర్మ ఏర్పడుతాయి

**ప్రశ్నకర్త:** పాపంకాని, పుణ్యంకాని లేక రెండిటి మిశ్రమంకాని ఉన్నట్లయితే అటవంటివాళ్ళు ఎటువంటి యోనిలో జన్మిస్తారు?

**దాదాశ్రీ:** జన్మకి, పాపపుణ్యాలకి సంబంధమేమీ లేదు. జన్మించిన తర్వాతనే పాపపుణ్యాలకు వాటి ఫలితాలనిస్తాయి. యోని దేని ఆధారంగా ఉంటుందా? 'నేను చందూభాయినే, ఇది నేను చేసాను అని అనుకోగానే యోనిలో బీజం పడింది.

ఇక ఈ కర్తృత్వభావన ఎందుకు? అని అంటే, 'చేసేవారు వేరు. పరశక్తి పనిచేస్తోంది, తనేమో నేను చేస్తున్నాను' అని అనుకుంటాడు. పరశక్తి ప్రత్యక్ష ప్రమాణమేమిటి? అని అంటే, 'ఈ జగత్తులో, మల విసర్జన చేసే స్వతంత్ర్యం కలిగినవాడు కూడా ఎవరూ లేరు. పరశక్తి చేయిస్తేనే ఆ పని చేస్తాడు.'

ఇక ఈ పరశక్తి ఎలా ఉత్పన్నమైంది? అని అంటే, ప్రతి జీవి అజ్ఞానంతో, పుణ్యం పాపం రెండూ చేస్తాయి. దాని ఫలితంగా ఆయా పాపపుణ్యాలకు అనుగుణంగా కర్మలు ఉదయిస్తాయి. వాటివలన తిరిగి కర్మ బంధాలు ఏర్పడుతాయి. 'మరి అలా పుణ్యపాప బంధాలు ఏర్పడటానికి మూల కారణమేమిటి? ఆ బంధాలు ఏర్పడకుండా ఉండేందుకు ఉపాయమేదైనా ఉందా?' అంటే, 'కర్తృత్వభావన లేకపోతే పుణ్యపాపాలేమీ అంటుకోవు' అని చెప్తాను. 'కర్తృత్వ భావన లేకుండా ఉండేందుకు ఏం చెయ్యాలి?'

అని అడిగితే, 'అజ్ఞానం ఉన్నంతకాలం, నేను చేస్తున్నాను అనే భావన ఉంటుంది. కాని వాస్తవానికి ఎవరు చేస్తున్నారు అన్నది తెలుసుకుంటే కర్తృత్వ భావన ఉండదు. పాపపుణ్యాల ప్రణాళికంతా జరిగిపోతుంది, ఇక్కడ మనం, నేను చేసాను అనే భావనలో ఉంటాము. లాభం చేకూర్చేది అదే. పుణ్యాన్నిబట్టి లాభం ఉంటుంది. అప్పుడు మనం, 'ఓహోహో, నేను చేసాను' అనుకుంటాము. అదే నష్టం కలిగినప్పుడు తెలిసివస్తుంది మన ఆధీనంలో ఏమీ లేదని. మళ్ళీ పుణ్యం ఆధీనంలోకి పోయినప్పుడు అంతా మర్చిపోతారు కనుక తిరిగి కర్తగా భావించుకుంటూవుంటారు.

ఈ పంచేంద్రియాలతో చేసేదంతా, పంచేంద్రియాలతో కలిగే అనుభవమంతా ఈ జగత్తుని నడిపించేది అంతా పరసత్తాయే. అందులో ఈ మనుషులంతా, 'ఇది నేను చేసాను' అని చెప్పుకుంటారు. వాళ్ళు అప్పుడు ఆ కర్మకి కర్తలౌతారు. అదే అధికరణ క్రియ. అందుకే తిరిగి భోక్త అవవలసివుంటుంది.

ఇక కర్తృత్వ భావన ఎలా పోతుంది? అని అంటే, ఆరోపిత భావన ఉన్నంత కాలం, కర్తృత్వ భావన పోదని చెప్తాను. మీరు మీ మూల స్వరూపంలోకి వెళ్ళినపుడు కర్తృత్వ భావన తుడిచిపెట్టుకుపోతుంది. ఆ మూల స్వరూపం ఎలా ఉంటుంది? అని అడిగితే, 'క్రియాకారి కాదు. అది స్వయంగా క్రియాకారి కాదు కనుక కర్త అవలేదు కదా!' అంటాను. కానీ వీళ్ళు అజ్ఞానంతో 'ఇది నేను చేస్తున్నాను' అని పట్టుకుని కూర్చున్నారు. అలా వాళ్ళు తెలివితేటలు లేకుండా ఉండారు. అదే ఆరోపిత భావం.

## చివర్లో పాపపుణ్యాలు రెండిటి నుంచీ విముక్తులవాలి

పుణ్యం అనేది క్రియా ఫలం, అలాగే పాపం కూడా క్రియా ఫలమే. అయితే మోక్షమనేది అక్రియా ఫలం. ఏదైనా క్రియ ఉన్నపుడు అక్కడ కర్మ బంధం ఏర్పడుతుంది. అది పుణ్యమే కావొచ్చు లేక పాపం కావొచ్చు కానీ బంధమే. అది తెలుసుకోవటం (ఆ జ్ఞానం) ముక్తి. ఆ విజ్ఞానం తెలుసుకుంటే ముక్తి లభిస్తుంది. త్యజించిన ప్రతిదానికీ వచ్చే ఫలితాన్ని అనుభవించవలసివుంటుంది. త్యజించటం మన చేతిలో ఉందా? గ్రహించటం మన చేతిలో ఉందా? ఆ అధికారం పుణ్యపాపాల ఆధీనంలో ఉంది.

## లోపల ప్రేరణ కలిగించేది ఎవరు?

లోపల ఏదైతే మనకి తెలుస్తుందో, అంటే లభించిన ఇన్ఫర్మేషన్ (సూచన) పుణ్యపాపాలను తెలియజేస్తుంది. లోపల అంతా జ్ఞానదర్శనమే. లోపల నుంచి అంతా తెలిసిపోతుంటుంది. కానీ, దాన్ని మీరు ఆపనంతవరకు అది జరుగుతూనేవుంటుంది. దాన్ని ఉల్లంఘిస్తే, ఇన్ఫర్మేషన్ రావటం ఆగిపోతుంది.

ఆత్మ పరమాత్మ స్వరూపం. అది తప్పు చెయ్యమనీ చెప్పదు. ఒప్పు చెయ్యమనీ చెప్పదు. పాపోదయం కలిగినపుడు తప్పు చెయ్యమని చెప్తుంది, పుణ్యోదయం సమయంలో మంచి చెయ్యమని చెప్తుంది. ఇందులో ఆత్మ చేసేది ఏమీ ఉండదు. అది కేవలం జరుగుతున్న స్పందనను చూస్తూవుంటుంది. ఏకాగ్రత అనేది లోపలి నుంచి మన కర్మోదయం సహకరించినపుడు వస్తుంది. అప్పుడు రాకపోతే రాదు. పాపోదయం కలిగినపుడు ఏకాగ్రత ఉంటుంది. పుణ్యం ఉదయించినపుడు ఏకాగ్రత కలుగుతుంది, పాపం ఉదయించినపుడు ఏకాగ్రత ఉండదు.

## ఆత్మ ప్రాప్తిలో 'జ్ఞాని' నిమిత్తుడు

**ప్రశ్నకర్త:** ఆత్మని గుర్తించటానికి నిమిత్తుల అవసరం పడుతుందా?

**దాదాశ్రీ:** నిమిత్తులు లేకుండా ఏ పనీ జరగదు.

**ప్రశ్నకర్త:** నిమిత్తులు పుణ్యం వలన లభిస్తారా పురుషార్థం వలనా?

**దాదాశ్రీ:** పుణ్యంతో. ఇక పురుషార్థంలో ఒక చోటి నుంచి మరో చోటికి పరుగులు తీసినా, అలా అనంత జన్మల వరకు పరుగులెత్తినా నిమిత్తుల ప్రాప్తి జరగదు. అదే మన పుణ్యమే ఉంటే దారిలో దొరుకుతారు. అది జరగాలంటే పుణ్యానుబంధీ పుణ్యం ఉండాలి.

**ప్రశ్నకర్త:** జ్ఞాని పురుష్ దొరకాలంటే ఎటువంటి పుణ్యం ఉండాలి?

**దాదాశ్రీ:** పుణ్యానుబంధీ పుణ్యంతో. ఇదొక్కటే సాధనం నాతో కలవాలంటే. కోటి జన్మల పుణ్యం వలన ఈ జ్ఞానిపురుష్ లభిస్తారు.

## మోక్షం వరకు వెంట వచ్చేది పుణ్యమే

**ప్రశ్నకర్త:** పుణ్య భావన ఆత్మకి లాభదాయకమా?

**దాదాశ్రీ:** అది ఆత్మకి ఎందుకు లాభదాయకమంటే, పుణ్యం ఉండబట్టే ఇక్కడ సత్సంగంలో 'జ్ఞానిపురుష్' దగ్గరకు రాగలిగారు కదా? లేకపోతే ఈ శ్రామికుల చేసుకున్న పాపం వలన ఇక్కడకు ఎలా రాగలుగుతారు? రోజంతా శ్రమపడితేనే సాయంత్రం తినటానికి డబ్బులు దొరుకుతాయి. పుణ్యం కారణంగా మీకు ఇంట్లో కూర్చునివుంటేనే తినటానికి లభిస్తోంది, కాస్త ఖాళీ సమయం దొరుకుతోంది. అందువలన పుణ్యమనేది ఆత్మ ప్రయోజనంలో పనికివస్తుంది. పుణ్యం ఉంటేనే ఖాళీ సమయం దొరుకుతుంది. ఇలాంటి సంయోగం కలుగుతుంది. కొద్దిగా పనిచేస్తే డబ్బులు వస్తాయి, పుణ్యం ఉంటే ఇతర పుణ్యమూర్తులు లభిస్తారు. లేకపోతే తుచ్ఛులు లభిస్తారు.

**ప్రశ్నకర్త:** ఆత్మ అభివృద్ధికి ఇది ఎక్కువ ఉపయోగకరమా?

**దాదాశ్రీ:** ఎక్కువ ఉపయోగకరమేమీ కాదు కానీ, దాని అవసరమైతే ఉంది కదా? ఎప్పుడైనా 'ఎక్సెప్షనల్ కేస్' లో పాపం కూడా ఉపయోగపడుతుంది. కానీ అది పుణ్యానుబంధీ పాపం అయ్యుండాలి. పుణ్యానుబంధీ పాపమైతే ఎక్కువ ఉపయోగ పడుతుంది.

## పాపపుణ్యాలు రెండూ భ్రాంతేనా?

**ప్రశ్నకర్త:** పుణ్యాత్ములను అంతా 'రండి కూర్చోండి' అని ఆదరిస్తారు కదా దానితో వాళ్ళలో అహంకారం పెరగదా?

**దాదాశ్రీ:** ఇది 'జ్ఞానం' ఉన్నవాళ్ళ విషయంలో జరగదు. ఇది ప్రాపంచికమైనదే. 'జ్ఞానం' ఉన్నవారి దగ్గర పుణ్యమూ లేదు, పాపమూ మిగిలి లేదు. అతని విషయంలో రెండిటి నుంచీ ముక్తిచెందటం మిగిలివుంది. ఎందుకంటే పుణ్యం, పాపం రెండూ భ్రాంతే. కానీ జగత్తులో ఈ రెండిటికీ విలువనివ్వటం జరిగింది. అంటే ఇది జగత్తులో జరిగే విషయం. కానీ జగత్తులో అందరూ అనవసరంగా కాళ్ళూ చేతులకు పనిచెప్తున్నారు.

## ఎక్కువ పుణ్యం అహంకారాన్ని పెంచుతుంది

ఏమిటంటే, ఇది కలియుగం కదా, ఎవరికైనా తన కోరికలు ఉండటం, అవి తీరటం జరిగినపుడు అతనిలో అహంకారం పెరిగిపోతుంది, దానితో బండి వెనక్కి నడుస్తుంది. ఈ కలియుగంలో మనిషికి ఎక్కువగా ఎదురుదెబ్బలు తగిలితేనే మంచిది. అంటే, ప్రతి యుగంలోను ఈ మాట వేరువేరుగా ఉంటుంది కనుక, ఈ యుగానికి అనుగుణంగా ఇలా చెప్పవచ్చు. కోరుకున్నది దొరికినపుడు అహంకారం వస్తుంది కదా, కాని అది దొరికేది పుణ్యం వలనయినపుడు, ఇక్కడ పెరుగుతున్నది ఏమిటి? అహంకారం 'నేను' అన్నది. అందువలన ఎన్ని కోరికలు ఉన్నాయో వాటికి అనుగుణంగా జరగకపోతే అతని అహంకారం హద్దుల్లో ఉంటుంది, చెప్పేది అర్థమౌతుంది. ఎదురుదెబ్బ తగిలితేనే అర్థమౌతుంది లేకపోతే అర్థమవదు. కోరికలుండి అవి తీరినట్లయితే వీళ్ళు కొండెక్కి కూర్చుంటారు. కోరుకున్నది లభించటం వలన వీళ్ళకీ పాపం దశ కలుగుతుంది. పుణ్యమేమో ఖర్చయిపోయింది, ఆ పైన వలలో చిక్కుకుని అహంకారం గాఢమైపోతోంది! అహంకారం పెరగటంలో ఆలస్యం ఉండదు. ఫలితం ఇస్తున్నదేమిటి? పుణ్యం ఇస్తోంది, కాని మనసులో ఏమని అనుకుంటున్నాడు? 'నేను చేసాను' అని. కాబట్టి అహంకారికి దెబ్బ తగిలితేనే మంచిది. కోరిక కలిగి, అది వెంటనే తీరిపోతే ఇక ఇంట్లో కాళ్ళు పైకి చాపుకుని కూర్చుంటాడు. తండ్రిని కూడా లెక్క చేయడు, మరెవరినీ లెక్కచేయడు. కాబట్టి, కోరిక కలగటం, అది వెంటనే తీరటం జరిగితే ఆ మనిషి అధోగతికి పోతాడు, అతని బుర్ర తిరిగిపోతుంది. కొందరికి ఇప్పుడు వారి కోరిక ఫలించి లక్షల ఖరీదుచేసే ఫ్లాట్‌లలో నివసిస్తున్నారు. వాళ్ళందరి దశా జంతువులలా తయారైంది. ఫ్లాట్ లక్షలు చేయవచ్చు కానీ, అది అతనికి ఉపయోగకరం కాదు. వాళ్ళది జాలిగా చూడవలసిన స్థితి.

## ప్రపంచం పెరిగేది అయ్యేది పుణ్యంతోనే

**ప్రశ్నకర్త:** పుణ్యబంధంతోనే ప్రపంచం పెరుగుతుంది అన్నదే కదా భావార్థం?

**దాదాశ్రీ:** పుణ్యం పూర్తిగా ప్రయోజనమేమీ కలిగించదు. పుణ్యమనేది ఒక విధంగా హెల్ప్ చేస్తుంది. పాపం ఉన్నట్లయితే 'జ్ఞాని పురుష్' లభించరు. 'జ్ఞానిపురుష్' ని కలవాలి, రోజంతా మిల్లులో పనిచేయాలి అంటే ఎలా కలవగలరు? అంటే, పుణ్యం ఆ విధంగా ఉపయోగపడుతుంది. అది కూడా పుణ్యానుబంధీ పుణ్యమైతేనే అది హెల్ప్ చేస్తుంది.

**ప్రశ్నకర్త:** పాపం ఎలా అయితే ప్రపంచం పెరుగుతుందో, అలాగే పుణ్యంతో కూడా ప్రపంచం పెరుగుతుంది కదా?

**దాదాశ్రీ:** పుణ్యంతో కూడా ప్రపంచం పెరుగుతుంది. ఇక్కడి నుండి మోక్షానికి పోయినవారు, ఎంతో భాగ్యశాలులు. చూస్తే వాళ్ళ చుట్టూ రెండు వందలు, ఐదు వందలమంది రాణీలు ఉండేవారు, చాల పెద్ద రాజ్యం ఉండేది. సూర్యనారాయణుడు ఎప్పుడు ఉదయించాడు, ఎప్పుడు అస్తమించాడు అన్నది కూడా అతనికి తెలియదు. పుణ్యశాలి జన్మిస్తే అలా వైభవంగా జీవిస్తాడు. ఎందరో రాణలు ఉంటారు. వైభవం ఉంటుంది. కానీ వాళ్ళు బాధపడుతుంటారు, ఈ ప్రపంచంలో ఏం సుఖం ఉంది అనుకుంటూ. ఐదు వందలమందిలో యాభైమంది రాణులు అతనితో సంతోషంగా ఉంటారు. మిగతావాళ్ళంతా ముఖాలు మాడ్చుకుని తిరుగుతుంటారు. కొందరైతే రాజుని చంపించాలని చూస్తుంటారు. అంటే ఈ జగత్తు ఎంతో కష్టభరితమైనది. ఇందులోంచి గట్టెక్కటం కష్టంతో కూడుకున్న పని. 'జ్ఞాని పురుష్ లభిస్తే, ఆయన మాత్రమే ముక్తి కలిగించగలుగుతారు. అంతేకాని వేరెవరూ ముక్తి కలిగించలేరు. 'జ్ఞాని పురుష్' ముక్తిచెందినవారు కనుకనే మనకు ముక్తిని కలిగించ గలుగుతారు. ఆయన తరణతారణహారులయ్యారు. అందువలన వారు ముక్తిని కలిగించ గలుగుతారు.

## తక్కువ పుణ్యశాలి జ్ఞానిని కలవలేరు

**ప్రశ్నకర్త:** నేను చాలమందికి చెప్తుంటాను 'దాదా' దగ్గరకు రమ్మని. కాని వాళ్ళు రారు.

**దాదాశ్రీ:** కాని రావటం అంత తేలిక కాదు. అందుకు ఎంతో పుణ్యం ఉండాలి. పుణ్యం అధికంగా ఉంటేనే తప్ప కలవలేరు. పుణ్యం లేకపోతే ఎలా కలుస్తారు? మీరు ఎంత పుణ్యం చేసారో, నన్ను కలిసారు. అంటే, పుణ్యం పండకపోయి ఉండవచ్చు కనుకనే వాళ్ళు ఇంతవరకు కలవలేకపోతున్నారు.

**ప్రశ్నకర్త:** మనుషుల పుణ్యం ఎప్పుడు జాగృతమౌతుంది? నిమిత్తులు గొప్పవారు.

**దాదాశ్రీ:** ఔను కానీ, పుణ్యం జాగృతమవటం తేలికైన విషయం కాదు. పుణ్యశాలి అయినట్లయితే పుణ్యం జాగృతమవక మానదు. ఇప్పటికీ పుణ్యశాలులు ఎవరైతే ఉన్నారో వాళ్ళకి జాగృతమౌతుంది.

## అక్రమ మార్గంలో లాటరీ విజేత....

పుణ్యబంధీ పుణ్యశాలులకు ఇలాంటి మార్గం లభిస్తుంది కదా! ప్రత్యక్షంగానే తప్ప వేరే విధంగా జరగటం సాధ్యం కాదు. ప్రత్యక్ష 'వీతరాగ విజ్ఞానం' లేకుండా పని జరగదు. ఇదే 'అక్రమ విజ్ఞానం'. అందులో క్యాష్ డిపార్ట్‌మెంట్ (నగదు ఖాతా), క్యాష్ బ్యాంక్ (నగదు బ్యాంక్) ఉంటాయి. క్రమిక మార్గంలో త్యాగం చేయటం జరుగుతుంది కానీ క్యాష్ ఫలితం రాదు. ఇదే క్యాష్ ఫలితం.

ఇటువంటి జ్ఞానం మన మూడున్నర మిలియన్ జనాభాలో ఎవరికి వద్దు? అందరికీ కావాలి. కానీ ఈ జ్ఞానం అందరికోసం కాదు. ఇది కేవలం మహా పుణ్యశాలులకే. ఈ 'అక్రమ జ్ఞానం' ప్రకటితమైందంటే దానివలన మనుషులకు కాస్త పుణ్యం ఉంటుంది కదా! ఒకే భగవాన్ మీద ఆధారపడివున్నవారు తిరుగాడుతూ, దారితప్పుతూ ఉన్న భక్తుల కోసం, ఇంకా, ఏమైనా పుణ్యం చేసుకునివున్నవారి కోసమే ఈ మార్గం ఏర్పడింది. ఇది ఎంతో పుణ్యం చేసుకున్నవారి కోసమే ఉంది. దీనికి సహజంగా వచ్చి, నిజమైన భావనతో అడిగితే వాళ్ళకి ఇవ్వటం జరుగుతుంది. కానీ మనుషులకు దీని గురించి ఏమైనా చెప్పటం, వాళ్ళు తెలుసుకోవటం జరగదు. ఈ 'దాదా', ఈ మహాత్మల గాలి తగులుతూనే జగత్కళ్యాణం జరుగుతుంది. నేను నిమిత్తుడనే

కానీ, కర్తను కాను. ఇక్కడ ఎవరికైతే ఆ భావన కలిగి, 'దాదా' దర్శనం చేసుకుంటారో ఆ దర్శనం వాళ్ళు ఎత్తులకు చేరుకుంటారు. 'దాదా' ఈ దేహానికి అతి సమీపంలో ఉన్నట్లుగా ఉంటారు. ఈ చెప్తున్నదంతా రికార్డ్. ఈ 'అక్రమ జ్ఞానం' అతి కొద్దిమంది పుణ్యమూర్తుల కోసమే. ఇక్కడికి సహజంగానే వచ్చినవారికి, వాళ్ళు తమ పుణ్యం అనే పాస్‌పోర్ట్ తీసుకునివచ్చినవారికి, నేను జ్ఞానం ఇస్తాను. 'దాదా' కృప లభిస్తే వాళ్ళ పని నెరవేరినట్లే!

ఇక్కడకు వచ్చినవాళ్ళంతా ఎంతటి పుణ్యాన్ని మూటగట్టుకుని వచ్చారు! 'దాదా' లిఫ్ట్‌లో కూర్చుని మోక్షానికి పోతారు. కోటి జన్మల పుణ్యం జమై ఉంటేనే 'దాదా' తారసపడతారు. ఇక ఎంత డిప్రెషన్ (నిరాశ) లో ఉన్నా పరవాలేదు. అన్ని విధాలా ఇరుక్కుపోయి ఉన్నవారి కోసం 'ఇక్కడ' స్థానం ఉంటుంది. ఇక్కడ క్రానిక్ (దీర్ఘకాలిక) వ్యాధులు సమసిపోయాయి.

## విశ్వంలో కోటీశ్వరులు ఎంతమంది?

ఒక మహరాజ్ ఎక్కడి నుంచో వచ్చారు. అక్కడ లక్షలాదిమంది పోగయ్యారు. కాని ఇక్కడికి రెండు మూడు వందలమంది మాత్రమే వచ్చారు. సంభవం అయ్యేంత వరకు చివరి స్టేషన్‌కి టికెట్ ఎవరు తీసుకుంటారు? అలాంటివాళ్ళు తక్కువమంది ఉంటారు. మధ్యలో స్టేషన్‌ల కోసం టికెట్ అందరూ తీసుకుంటారు. కాబట్టి ఒక మనిషి నాతో, 'ఎందుకలా?' అని అడిగాడు. నేను, 'ప్రపంచం మొత్తంలో కోటీశ్వరుల సంఖ్య ఎంత ఉందో చూస్తే ఎంతమంది ఉంటారు?' అని అంటే అతను, 'వాళ్ళు చాల తక్కువమంది ఉంటారు' అన్నాడు. 'మరి సామాన్య జనులు?' అని అడిగితే, 'వాళ్ళయితే చాలమంది ఉంటారు' అన్నాడు. ధర్మంలో మహా పుణ్యమూర్తులు నన్ను కలుస్తారు. డబ్బు పరంగా పుణ్యమూర్తులు కోటీశ్వరులౌతారు. అయితే ఇది కోటీశ్వరుల కంటే ఎంతో ఎక్కువ పుణ్యం. అలాంటివారు చాల తక్కువమంది ఉంటారు.

పుణ్యానుబంధీ పుణ్యం 'జ్ఞాని పురుష్' తో కలిసేటట్టుగా చేస్తుంది. మరి ఆ పుణ్యానుబంధీ పుణ్యమని దేన్ని అంటారు? 'దాదా భగవాన్' తో కలిసేటట్టుగా చేసేదాన్ని. కోట్లాది జన్మల వరకు మనం కలవలేని 'దాదా', కేవలం ఒక గంట

సమయంలోనే మనకి మోక్షాన్ని కలుగజేస్తారు. మోక్షాన్ని రుచిచూపిస్తారు. అనుభూతిని కలిగిస్తారు. అటువంటి దాదా భగవాన్ ఎప్పుడైనా కలవవచ్చు. నాకూ లభించారు. మీకూ లభించారు చూడండి!

**ప్రశ్నకర్త:** మేమెక్కడి నుంచి సంపాదించుకునివచ్చాము? ఇదంతా మీ కృపే.

**దాదాశ్రీ:** పుణ్యం అంటే ఏమిటి అర్థం? మీరు నన్ను కలిసారు. మీ దగ్గర అందుకు ఉన్న ఖాతాలోని నిల్వ ఆధారంగా. లేకపోతే నన్ను కలవటం చాల కష్టమైన పని. అందువలన అలా కలవటం మీ పుణ్యమే ఒక విధంగా. ఇక కలిసిన తర్వాత వచ్చి కూర్చున్నారు, దీన్నే పట్టుకున్నారు అంటే అది ఇంకా గొప్ప విషయం.

## పుణ్యంతోపాటు కషాయాలు తగ్గటం కూడా అవసరమే

**ప్రశ్నకర్త:** సమకితం కోసం ప్రయత్నించటం అవసరం కాదా?

**దాదాశ్రీ:** లేదు. ప్రయత్నం అంటే అది సహజంగా తనంతటతానుగా జరగాలి. వీళ్ళు పంటవేస్తారు! ఎందుకు అంటే, భావి కాలంలో ఫలితం పొందేందుకు. సమకితం అంటే ఫలరహితంగా ఉండాలి. ఈ జపతపాదులు ఏమైతే చేస్తారో, దాని వలన పుణ్యం లభిస్తుంది, దాని ఫలితం అనుభవిస్తారు.

**ప్రశ్నకర్త:** దాని వలన కలిగే ఫలితం సమకిత రూపంలోనే లభించాలి కదా?

**దాదాశ్రీ:** లేదు లేదు. సమకితకి దీనికి ఎటువంటి సంబంధమూ లేదు. లభించే ఈ ఫలితమంతా భౌతికమైనది. దానివలన దేవగతి లభిస్తుంది. సమకిత అనేది పూర్తిగా వేరుగా ఉంటుంది.

## పుణ్యబంధీ పుణ్యానికి మూడు నియమాలు

సమకిత ప్రాప్తికి పుణ్యానుబంధీపుణ్యం అవసరం పడుతుంది. మోహమనేది వీడిపోవాలి. క్రోధం, మానం, మాయ, లోభం తగ్గిపోవాలి. అప్పుడే సమకిత వైపు

పయనిస్తారు. అది లేకపోతే సమకితం ఎలా వస్తుంది? వీళ్ళు చేసే పనులన్నీ క్రోధం, మానం, మాయ, లోభం పెరిగే అవకాశం ఉండే పనులు.

**ప్రశ్నకర్త:** క్రోధం, మానం, మాయ, లోభం ఎలా తగ్గుతాయి, పుణ్యానుబంధీ పుణ్యం ఎలా లభిస్తుంది?

**దాదాశ్రీ:** మనకి ఉండవలసిందంతా కేవలం మోక్షానికి పోవాలన్న కోరిక మాత్రమే. దానికోసం ఏమేం చేయాలో అదంతా పుణ్యానుబంధీ పుణ్యాన్ని సంపాదించిపెడుతుంది. ఎందుకంటే, ఉద్దేశ్యం కేవలం మోక్షప్రాప్తి మాత్రమే కనుక.

ఇక ఆ తర్వాత మీ దగ్గరకు వచ్చి చేరేదంతా ఇతరులకు పంచిపెట్టండి. అదే జీవించే విధానం వచ్చినట్లు. పిచ్చితనంతో కాదు, అర్థం చేసుకుని ఖర్చుపెట్టండి. పిచ్చిపట్టినట్లుగా మద్యంపానానికి పోయినట్లయితే, దానివలన ప్రయోజనం ఏమీ ఉండదు. వ్యసనాలకు పోకుండా, ఇతర విషయాలలో ఖర్చుపెట్టండి. అది పుణ్యబంధీ పుణ్యం అనబడుతుంది.

అంతకు మించి పుణ్యానుబంధీ పుణ్యం ఏముంటుంది? ఏ క్రియలోను ప్రతీకార వాంఛ పెట్టుకోవద్దు. ఎదుటివారికి సౌఖ్యాన్ని కలిగించే సమయంలో ప్రతిఫలం ఏమీ ఆశించకండి. అది పుణ్యబంధీ పుణ్యం ఔతుంది!

## దారితప్పి తిరిగేవారిని జ్ఞానమే బయటపడేస్తుంది

లోకులు తెలుసుకున్నదంతా లౌకిక జ్ఞానమే. సత్యం వాస్తవికంగా ఉంటుంది. వాస్తవిక జ్ఞానం ఉన్నంత కాలం ఎటువంటి *అజంప* కలుగనీయదు. లోపల ఏవిధమైన పజిల్‌ని రానివ్వదు. ఈ భ్రాంతి జ్ఞానంతోనే పూర్తిగా పజిల్ ఏర్పడుతుంటుంది, ఆ పజిలేమో సాల్వ్ అవదు. అర్థం అదే కానీ, అది అర్థమవాలి కదా? విడమరచి అర్థమయేటట్లుగా చెప్పకపోతే సమాధానం దొరకదు. ధృఢంగా అర్థమవాలి అంటే అందుకోసం పాపం కడిగివేసుకోవలసివుంటుంది. పాపం కడిగివేసుకోనంత వరకు మీ వశంలోకి రాదు. పాపమే అంతటినీ చిక్కుముడిలో పడేస్తుంది. పాపరూపం, పుణ్యరూపంలోని అడ్డంకులుంటాయి జీవితంలో. అవే మనుషులను చిక్కుల్లో పడేస్తాయి.

అనంత జన్మల నుంచి, ఈ భౌతిక శరీరం కోసమే దారితప్పి తిరుగుతున్నారు. భౌతిక శరీరం వలన అంతర్‌శాంతి లభించదు. రూపాయినోట్లతో పక్కవేసుకుని పడుకున్నంత మాత్రాన నిద్రపడుతుందా? మీకున్న అనంత శక్తులన్నీ ఆ విధంగా వ్యర్థమైపోయాయి.

జ్ఞానిపురుష్ పాపాలను కడిగివేస్తారు. కృష్ణ భగవానుడు గీతలో, జ్ఞాని పురుష్ పాపాలను చుట్టచుట్టి నశింపజేస్తారని చెప్పారు. అలా పాప నాశనం జరిగినపుడే ఆత్మ ప్రకటితమౌతుంది. లేకపోతే ఆత్మ ఏవిధంగానూ ప్రకటితమవదు. నీ పాపాన్ని నీవే స్వయంగా ఎలా నాశనం చేసుకోగలుగుతావు? కొత్తగా పుణ్యాన్నయితే సంపాదించుకుంటావేమో కాని, పాత పాపాలను నాశనం చేసుకోలేవు. జ్ఞానిపురుష్ జ్ఞానమే పాపాలను నశింపజేస్తుంది.

ఇకపోతే పుణ్యం-పాపం, పాపం-పుణ్యం వీటి మధ్యనున్న అనుబంధం వలనే మనిషి తిరుగుతుంటాడు. అతనికి అందులోంచి విముక్తి లభించదు. ఎక్కువ పుణ్యం చేసుకుంటే, అది చాల ఎక్కువ నిల్వ ఉంటే దేవగతి సంప్రాప్తిస్తుంది కానీ, మోక్షం లభించదుకదా. మోక్షమైతే, జ్ఞానిపురుష్ లభించి, మీ అనంత కాలం నుంచి వస్తున్న పాపాలను భస్మీభూతం చేసి, శుద్ధాత్మను మీ చేతిలో పెట్టినపుడే లభిస్తుంది. అప్పటి వరకు ఎనభైనాలుగు లక్షల యోనులలో తిరుగాడుతూనేవుంటారు.

'నేను' జ్ఞానం ఇస్తాను. అప్పుడు చిత్తం శుద్ధి అవుతుంది. పాపాన్ని నాశనం చేస్తాను, దివ్య చక్షువునిస్తాను. అన్ని రకాలుగా అతని ఆత్మ, అనాత్మలను వేరుచేస్తాను.

## మహా విదేహ క్షేత్రానికి వీసా

**ప్రశ్నకర్త:** మహావిదేహ క్షేత్రానికి ఎలా చేరుకోవచ్చును?

**దాదాశ్రీ:** ఈ జ్ఞానం లభించిన తర్వాత, మా పంచాజ్ఞల పాలన చేసినట్లయితే, ఈ జన్మలో పుణ్యమైతే ఎలాగూ సంపాదిస్తున్నారు కదా, అది మహావిదేహ క్షేత్రానికి తీసుకునిపోతుంది. ఆజ్ఞాపాలన వలన ధర్మధ్యానం జరుగుతుంది. అది సత్ఫలితాన్నిస్తుంది. మనం వెళ్ళవలసింది మోక్షానికి కనుక, అక్కడి నుంచి మోక్షానికి

వెళ్ళగల పుణ్యం ఉంటే చాలు. ఇక్కడ సీమంధర స్వామికి ఎంత (భక్తి, ఆరాధన) చేస్తారో, అదంతా మీకు వచ్చేస్తుంది.

మీరు సీమంధర స్వామి పేరైతే విన్నారు కదా! ఆయన ప్రస్తుత తీర్థంకరులు. మహావిదేహ క్షేత్రంలో ఇప్పుడున్నది ఆయనే.

సీమంధర స్వామి వయసు 60-70 సంవత్సరాలు ఉండవచ్చా? లక్షా డెబ్బై ఐదు సంవత్సరాలు! మరో సవాలక్ష సంవత్సరాలుంటారు. ఆయనతో మీకు కనెక్షన్ ఇస్తాను. ఎందుకంటే వెళ్ళవలసింది అక్కడికే. ఇక్కడి నుంచే తిన్నగా మోక్షానికి వెళ్ళటం జరగదు. ఇక ఇప్పుడు ఒక జన్మ మాత్రమే మిగిలివుంటుంది. ఆయనతో కలిసి కూర్చోవాలి కనుక ఆయనతో కనెక్ట్ చేస్తాను.

భగవాన్ పూర్తిగా వర్ల్డ్‌కే కళ్యాణమొనరిస్తారు. ఆయన నిమిత్తంతో సంపూర్ణంగా వర్ల్డ్ కళ్యాణం జరుగుతుంది. ఆయన జీవితులైవున్నారు కనుక. మోక్షానికి వెళ్ళివున్నవారు ఏమీ చెయ్యలేరు. అటువంటివారి మీద భక్తి వలన కేవలం పుణ్యం మాత్రమే లభిస్తుంది, అది లౌకిక ఫలితాన్నిస్తుంది.

## అక్కడ పుణ్యం, పాపం రెండూ తీరిపోతాయి

ధర్మం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి స్వాభావిక ధర్మం. దాన్ని రియల్ ధర్మం అంటారు. రెండవది విభావిక ధర్మం. ఇది రిలేటివ్ ధర్మం అనబడుతుంది. 'శుద్ధాత్మ' ప్రాపించిన తర్వాత స్వాభావిక ధర్మంలోకి వస్తారు. స్వాభావిక ధర్మమే సత్యమైన ధర్మం. ఆ ధర్మంలో మంచి, చెడు అని ఎంపికచేసే పని ఉండదు. విభావిక ధర్మంలోనే అలా ఎంపిక చేసుకోవటానికి ఉంటుంది.

దానం చెయ్యటం, ఇతరులకు ఉపకారం చెయ్యటం, ఒబ్లయిజింగ్ నేచర్ కలిగివుండటం, లోకసేవ చెయ్యటం, ఇవన్నీ రిలేటివ్ ధర్మం అవుతుంది. దీనివలన పుణ్యం లభిస్తుంది. ఎవరినైనా తిట్టటం, కొట్లాటలు పెట్టుకోవటం, దోచుకోవటం చేస్తే పాపం లభిస్తుంది. పుణ్యం, పాపం అనేవి ఉన్నచోట రియల్ ధర్మమనేదే ఉండదు. రియల్ ధర్మం పుణ్యపాప రహితమైనది. పుణ్యపాపాలను హేయంగా

(త్యజించవలసిందిగా) చూస్తారో, ఎక్కడైతే స్వయంగా ఆత్మ స్వరూపాన్నే ఉపాధేయంగా (గ్రహించవలసిందిగా) చూస్తారో, అక్కడే రియల్ ధర్మం ఉంటుంది. ఆ విధంగా ఈ 'రియల్', 'రిలేటివ్' ధర్మాలు వేరువేరు.

'నేను ఎవరు?' అన్నది తెలుసుకోనంతవరకు పుణ్యం ఉపాదేయ రూపంలోనే ఉంటుంది, పాపం హేయ రూపంలో ఉంటుంది. పుణ్యపాపాలు రెండూ హేయమైనపుడు, అక్కడ ఉండేది సమకితం. పాపాపుణ్యాలు రెండిటి మీదా ద్వేషం కాని రాగం కాని లేనపుడే ఆ మనిషి 'వీతరాగి' అని భగవాన్ అన్నారు.

**–జై సచ్చిదానంద**

# నవకలమ్

(తొమ్మిది ప్రగాఢ అంతరంగ భావనలు)

(ప్రతిరోజూ మూడుసార్లు చదవండి)

1. ఓ దాదా భగవాన్! దేహధారియైన ఎ జీవాత్మ యొక్క అహంకారము కించిత్ మాత్రము కూడా గాయపడటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఏ దేహధారి జీవాత్మ యొుక్క అహంకారమును ఏ మాత్రము గాయపరచకుండు నట్టి సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

2. ఓ దాదా భగవాన్! ఎవరి ధర్మ ప్రమాణములు కించిత్ మాత్రము కూడా కించపడుటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఎవరి ధర్మము యొుక్క ప్రమాణమును అణుమాత్రమైన కించపరచ కుండుటకు తగిన, అందరికీ ఆమోద్యమైన సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

3. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి ఉపదేశక సాధు, సాధ్వీ, ఆచార్యుల పట్ల అవర్ణవాదం,అపరాధం, అవినయం చేయకుండ ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

4. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ పట్ల ఏమాత్రమైనా అభావం, తిరస్కారం, నానుండి ఎప్పుడూ జరగకుండా, జరిగించకుండా, కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

5. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల ఎప్పుడూ కఠోరమైన పదజాలంతో, జగడాలమారి పదజాలంతో మాట్లాడకుండా, మాట్లాడించకుండా, లేదా మాట్లాడటానికి ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

ఎవరైనా కఠోరంగా, తగవులాడే భాషలో మాట్లాడితే నేను మృదు సరళ భాషలో మాట్లాడేందుకు పరమ శక్తిని ప్రసాదించండి.

6. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల, స్త్రీ పురుష నపుంసకులు ఏ లింగానికి చెందినవారైనా, వారిపట్ల ఏమాత్రమైనా విషయవికార సంబంధ దోషాలు, కోరికలు, చేష్టలు, లేక ఆలోచనల దోషాలు ఉండకుండా, అలా చేయించకుండా లేదా కర్తగా ఆమోదించకుండా ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

   నేను నిరంతరం నిర్వికారిగా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

7. ఓ దాదా భగవాన్! నేను ఏ విధమైన ప్రత్యేక రుచికీ అలవాటుపడకుండా ఉండే శక్తిని ప్రసాదించండి.

   సమరస ఆహారాన్ని తీసుకునే పరమ శక్తిని ప్రసాదించండి.

8. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ యొక్క ప్రత్యక్ష లేదా పరోక్ష, జీవించివున్నా లేదా మరణించినా, ఎవరిపట్లనైనా ఏమాత్రమైనా అవర్ణవాదం, అపరాధం, అవినయానికి పాల్పడకుండా, అలా చేయించకుండా, లేక కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

9. ఓ దాదా భగవాన్! జగత్ కళ్యాణ కార్యములో సాధనముగా మారుటకు నాకు పరమ శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి.

   (పై విధంగా దాదా భగవాన్ని అడుగుతూ ఉండండి. ఇది ప్రతిరోజూ యాంత్రికంగా చదవాల్సిన విషయం కాదు, హృదయంలో ఉంచుకోవలసిన విషయం. ఇది ప్రతిరోజూ ఉపయోగ పూర్వకముగా అనుభూతి చెందాల్సిన విషయం. ఈ నవరత్నాలలో సమస్త శాస్త్రాల సారము ఇమిడి ఉన్నది)

## శుద్ధాత్మకి ప్రార్థన

హే అంతర్యామీ పరమాత్మా! నీవు నాలో ఉన్నవిధంగానే జీవులందరిలో విరాజమానమై వున్నావు. నీ యొక్క దివ్య స్వరూపమే నా నిజ స్వరూపము. నా నిజ స్వరూపము పవిత్ర ఆత్మ.

హే శుద్ధాత్మ భగవాన్! నేను నీకు అభేదభావముతో అత్యంతభక్తి పూర్వకంగా నమస్కరించుచున్నాను.

అజ్ఞానవశాత్తు నేను చేసిన తప్పులనన్నింటిని ❖ నీ ముందు ఒప్పుకొనుచున్నాను. నేను ఈ తప్పులకు పశ్చాత్తాపం చెందుతూ నీ క్షమకై అర్థిస్తున్నాను. ప్రభూ! దయతో నన్ను క్షమించు, నన్ను క్షమించు, నన్ను క్షమించు. ఆ తప్పులను మరల చేయకుండునట్లు నాకు శక్తిని ప్రసాదించు.

హే శుద్ధాత్మ భగవాన్! మాకు నీతోగల భేద భావము తొలగిపోయి మేమందరము నీతో అభేదతను పొందునట్లు ఆశీర్వదించు. మేము సదా నీతో అభేదతతో తన్మయాకారతను చెందెదము గాక!

(❖ గతంలో నీవు చేసిన తప్పులను గుర్తు తెచ్చుకోవాలి)

## ప్రతిక్రమణ : దివ్యమైన క్షమాపణా విధానము

నేను దాదా భగవాన్ సాక్షిగా ❖...................... యొక్క మనోవచన కాయము కంటె పూర్తిగా వేరైన పవిత్రాత్మకు నమస్కరించుచున్నాను.

నేను నా తప్పులను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను (ఆలోచన) ❖❖

ఆ తప్పులకై నేను క్షమాపణ కోరుచున్నాను (ప్రతిక్రమణ)

ఆ తప్పులను మరల చేయనని దృఢముగా నిశ్చయించుకొనుచున్నాను (ప్రత్యాఖ్యాన్)

ప్రియాతి ప్రియమైన దాదాభగవాన్! ఈ దృఢ నిశ్చయమును పాలించు శక్తిని నాకు అనుగ్రహించు.

❖ మీ వలన గాయపడిన వ్యక్తి పేరు

❖❖ ఆ వ్యక్తిపట్ల మీరు ఒనర్చిన దోషాలను గుర్తుచేసుకోవాలి.

## తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది |
| 4. | బాధితుడు తప్పిదము |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |
| 16. | పాప-పుణ్యం |
| 17. | తల్లి-తండ్రి, పిల్లల వ్యవహారం |


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ Dada Bhagwan books are available in different languages: Gujarati, Hindi, English, Marathi, Telugu, Kannada, Oriya, Malayalam, Bengali, Punjabi, Assamese, Tamil, German, Spanish, Russian, etc.

❖ 'Dadavani' Magazine is published every month in three languages: Gujarati, Hindi & English.

❖ All Dada Bhagwan books and magazines are also available on online book store : https://store.dadabhagwan.org

# దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




- **ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.**

- **దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.**

**‘Dada Bhagwan Foundation Telugu’ Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

YouTube

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

# Persons to Contact

## Dada Bhagwan Foundation

**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 9789906461 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9885058771 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar:** | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

| | |
|---|---|
| **USA: Dada Bhagwan Vignan Institute**<br>Tel: + 1-877-505-DADA (3232)<br>Email: info@us.dadabhagwan.org | **U.K: Dada Darshan (UK)**<br>Tel: +44 330-111-DADA (3232)<br>Email: info@uk.dadabhagwan.org |
| **Germany** : +49 700 32327474<br>**UAE** : +97 1557316937<br>**Kenya** : +25 4722722063<br>**Dubai** : +971 501364530 | **Australia** : +61 421127947<br>**Singapore** : +65 81129229<br>**New Zealand** : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## మోక్షం కోసం, పుణ్యానుబంధి పుణ్యం

సమకిత ప్రాప్తి కోసం పుణ్యానుబంధీపుణ్యం ఆవశ్యకత ఉంటుంది. క్రోధం, మానం మాయ, లోభాలు తగ్గిపోవాలి. అప్పుడే అతను సమకిత వైపు వెళ్తాడు. మనలో కోరిక కేవలం మోక్షానికి వెళ్ళటమే అయ్యుండాలి. ఆ కోరికను నెరవేర్చుకోవటానికి ఏమేం చేసుకుంటూవెళ్తారో, అవన్నీ పుణ్యబంధాన్ని కలిగిస్తాయి. ఎందుకంటే, ఉద్దేశ్యం మోక్ష ప్రాప్తే కనుక.

తర్వాత, నీ దగ్గర ఏదైతే ఉందో అదంతా ఊడ్చిపెట్టు. పరాయివాళ్ళ కోసం ఊడ్చిపెట్టు. దాన్ని పుణ్యానుబంధీ పుణ్యం అంటారు. ఏ కార్యంలోను లాభాపేక్ష వద్దు. ఎదుటివారి సౌఖ్యం కోసం ఏమైనా చేస్తున్న సమయంలో కూడా అందుకు ప్రతిగా ఏమైనా తిరిగి పొందాలనే కోరిక పెట్టుకోవద్దు. దాన్ని పుణ్యానుబంధీ పుణ్యం అంటారు.

**-దాదాశ్రీ**

मूल दीपक से प्रकटे दीपमाला

dadabhagwan.org

9 789391 375737

Printed in India

Price ₹70